

ఒంగోలులోని మహిళా మార్ట్‌లో విచారణ చేస్తున్న అధికారులు

అవినీతి డొంక కదులుతోంది!

మహిళా మార్ట్‌పై విచారణ వేగవంతం

ఉద్యోగుల నుంచి పొంతనలేని సమాధానాలు

సభ్యుల సొమ్ము తిరిగి ఇవ్వాలని బాధ్యులను నిలదీసిన ఆర్పీలు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా మార్ట్‌లో అవినీతి డొంక కదులుతోంది. నెల్లూరు జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలారాణి నేతృత్వంలోని కమిటీ మంగళవారం మార్ట్‌కు వచ్చి విచారణ చేపట్టింది. మార్ట్ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు బాధ్యులుగా ఉన్న వారికి ముందుగా నోటీసులు

మిగతా 6లో...

సిఫార్సు బదిలీలు

జిల్లాలో ఇద్దరు టీచర్లకు స్థానచలనం

త్వరలో మరో ఆరుగురికి రావచ్చని సమాచారం

ఒంగోలు (విద్య), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వంలోనూ ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఇద్దరు టీచర్లకు స్థానచలనం కల్పించారు. విద్యాశాఖలో ప్రస్తుతం ఈ విషయం చర్చనీయాంశమైంది. గత వైసీపీ హయాంలో విచ్చలవిడిగా సిఫార్సు బదిలీలు జరిగాయి. వీటిపై అప్పట్లో అనేక ఆరోపణలు వచ్చాయి. ప్రజాప్రభుత్వం అధికారంలోకి

మిగతా 6లో...

రెండోసారీ చర్చలు విఫలం

ముడిరాళ్ల రికవరీపైనే గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల ఆందోళన

దానితో మాకు సంబంధం లేదంటున్న ఏఎంఆర్ ప్రతినిధులు

రాయల్టీకి అదనంగా చెల్లించేది లేదని తేల్చిచెప్పిన ఓనర్లు

6

కరువు నేలపై కర్జూరం

ఎర్రగొండపాలెంలో ప్రయోగాత్మకంగా సాగు

తోకపల్లి, గంగపాలేల్లో నూతన పంటల వైపు మొగ్గుచూపిన రైతులు

మెళకువలు తెలుసుకోలేక ఇబ్బందులు

7



టంగుటూరు మండలం వల్లూరులో ఈకేవైసీ ప్రక్రియను పరిశీలిస్తున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ (ఫైల్)

ఉపాధిలో బోగస్‌ల ఏరివేతపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. అనర్హుల జాబ్‌కార్డులను తీసేయడంతోపాటు, దొంగ మస్టర్లకు చెక్ పెట్టాలన్న ప్రధాన లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. కార్డులకు ఈకేవైసీ చేయాలని ఆదేశించడంతో డ్వామా అధికారులు ఆ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 7,29,000 మంది కూలీలు జాబ్ కార్డులు కలిగి ఉండగా వారిలో ఇప్పటికే 1,01,000 మందికి ఈకేవైసీ పూర్తి చేశారు. వచ్చే సీజన్ నుంచి కూలీలకు ముఖ హాజరు అమలు చేయనున్నారు. దీనివల్ల హాజరు విషయంలో చోటుచేసు కుంటున్న అనేక అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది..

ఉపాధిలో బోగస్‌కు చెక్!

- జాబ్ కార్డులకు ఈకేవైసీ
- జిల్లాలో ముమ్మరంగా ప్రక్రియ

- ఇకపై కూలీలకు ముఖ హాజరు
- రానున్న సీజన్ నుంచి అమలు
- దొంగ మస్టర్లకు చెల్లుచీటీ
- ఒకరి బదులు మరొకరు పనిచేసే విధానానికి స్వస్తి

జిల్లాలోని 38 మండలాల్లో ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు పొందిన కూలీలు 7,29,000 మంది ఉన్నారు. గడచిన ఆరు రోజులుగా ఈకేవైసీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 1,01,000 మంది కూలీల వేలిముద్రలు, ఐరిస్‌ను అధికారులు పూర్తి చేశారు. ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న కొత్త విధానం ద్వారా అవినీతి, అక్రమాలకు కొంత మేరకు చెక్ పడే అవకాశం ఉంది.

1,01,000 జాబ్ కార్డులను ఈకేవైసీ

కొండపి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ అవి కొనసాగుతూనే ఉన్నాయి. ఏటా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల్లో నిర్ఘాంతపోయే నిజాలు బయటపడుతున్నాయి. ముఖ్యంగా బోగస్ మస్టర్లలో మాయాజాలం వెలుగు చూస్తోంది. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కూలీలకు వాస్తవంగా హాజరవుతున్న సంఖ్యకు పొంతన ఉండటం లేదు. పలుచోట్ల బోగస్ హాజరును నమోదు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న వారు, సాఫ్ట్‌వేర్, ఇతరత్రా చిరుద్యోగాలు చేస్తున్న వారి పేర్లతో హాజరు వేసి నిధులను దిగమింగుతున్నారు. ఇలాంటి అక్రమాలకు చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం ఈకేవైసీ ప్రక్రియను చేపట్టింది. దీంతో నకిలీ జాబ్ కార్డులు వెలుగు చూసే అవకాశం ఉంది. అలాగే ముఖహాజరు అమలుకు నిర్ణయించింది. దీని వలన పథకంలో యంత్రాల వినియోగంతోపాటు, పని ప్రదేశాల మార్పు, దొంగ ఫొటోలు, ఒకరికి బదులు మరొకరు పనులకు రావడం, కూలీల సంఖ్యను అధికంగా చూపడం వంటి వాటికి బ్రేక్ పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

తగ్గనున్న మెటీరియల్ కోటా నిధులు

ఉపాధి హామీ పథకం ద్వారా చేసే

మిగతా 6లో...

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం

- ఆ దిశగా చర్యలు తీసుకోవాలి
- రాష్ట్రంలో దాని తయారీ నిషేధం
- పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి కాకుండా చూడాలి
- కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

7



హుషార్..

ఒంగోలులో అంతరిక్ష వారోత్సవాలు మంగళవారం ప్రారంభయ్యాయి. శ్రీహరికోట హైఆల్టిట్యూడ్ రేంజ్ (షార్), ఇస్రో, క్విస్ విద్యా సంస్థ కలిసి నగరంలో ర్యాలీ నిర్వహించాయి. విద్యార్థులు 'జయహో భారత్' అని నినాదాలు చేస్తూ హుషారుగా ప్రదర్శనలో పాల్గొన్నారు.

7

కర్ణాటకలో నేటి నుంచి

పొగాకు కొనుగోళ్లు

అక్కడ ఈ ఏడాది కూడా తగ్గిన పంట ఉత్పత్తి

మీడియం రకం అధికంగా ఉన్నట్లు సమాచారం

ప్రారంభ ధర రూ.300పైన లభించే అవకాశం

ఆసక్తిగా చూస్తున్న జిల్లా రైతులు



ఒంగోలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటకలో ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లు బుధవారం నుంచి మొదలు కానున్నాయి. ప్రారంభ ధర కిలో రూ.300 పైగానే ఉండవచ్చని తెలుస్తోంది. ఆ మేరకు వ్యాపారులు ఒక అవగాహనకు వచ్చినట్లు మార్కెట్ వర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఈ ఏడాది కూడా కర్ణాటకలో పంట ఉత్పత్తి అనుమతి ఇచ్చిన దాని కన్నా తగ్గడంతోపాటు, గత ఏడాది కంటే నాణ్యమైన పంట ఎక్కువగా ఉన్నట్లు చెప్తున్నారు. ఈ కారణంగా ఆరంభం నుంచే మంచి ధరలు లభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడి మార్కెట్‌ను జిల్లా రైతులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

85 మిలియన్ కిలోల లోపుగానే ఉత్పత్తి

కర్ణాటకలో పది వేలం కేంద్రాలు ఉండగా వాటి

మిగతా 6లో...

సోలార్ సొబగులు..!

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు

భారీగా సబ్సిడీ ప్రకటించిన ప్రభుత్వం

దర్శి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని దర్శి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రధానంగా గృహ వినియోగదారులు ఈపథకాన్ని వినియోగించుకునేందుకు వీలుగా భారీగా సబ్సిడీ ఇస్తున్నారు. విద్యుత్ కోతల ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను వాడుకునేందుకు సోలార్ విద్యుత్ ఎంతో ఉపయోగపడుతుంది.

దర్శి డివిజన్ పరిధిలో 12వేల దరఖాస్తులు ఇప్పటికే దాఖలయ్యాయి. అందులో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల నుంచి 10వేలు అందాయి. మిగిలినవర్గాల నుంచి రెండువేల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే 850 దరఖాస్తులకు ఆమోదం లభించగా, బ్యాంకుల నుంచి కూడా క్లియరెన్స్ వచ్చింది. ఇప్పటికే సుమారు 400 ఇళ్లకు సోలార్ ప్రాజెక్టును ఏర్పాటుచేశారు. కాలుష్య నివారణకు ఈ పథకం ఎంతో దోహదపడుతుంది.

క్రమేపీ బొగ్గు, క్రూడాయిల్, నీటి వనరులు కొరత తరచూ ఏర్పడుతున్నందున భవిష్యత్తు అవసరాలకు సరిపడా విద్యుత్ ఉత్పత్తి చేయటం కష్టతరమవుతుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం ముందుచూపుతో సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టి వినియోగదారులకు భారీగా సబ్సిడీ అందిస్తోంది.


దర్శిలో సోలార్ విద్యుత్ ఏర్పాటును పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసులు

దరఖాస్తు ఇలా...

సోలార్ విద్యుత్ పథకానికి ఆన్‌లైన్‌లో నేషనల్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వినియోగదారులు నిబంధనల ప్రకారం పత్రాలు సమర్పిస్తే అనుమతి లభిస్తుంది. ఈప్లాంట్ ఏర్పాటుకు బ్యాంకర్లు పూర్తిగా రుణ సహాయం అందిస్తారు. సబ్సిడీ పోను మిగిలినసొమ్ము వాయిదాల పద్ధతిలో చెల్లించే అవకాశం కల్పిస్తారు. ప్రతినెలా చెల్లించే కరెంట్ బిల్లులకు కొంత మొత్తాన్ని కలిపితే ప్రతినెలా కిస్తీ చెల్లించేందుకు సరిపోతుంది. వాయిదాలు పూర్తయిన తర్వాత సోలార్ ప్రాజెక్టు సొంతమవుతుంది. ఆతర్వాత అనేక సంవత్సరాలు ఉచితంగా గృహ అవసరాలకు సరిపడ విద్యుత్ వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. విద్యుత్‌ను ఆదా చేసుకొని మిగిలించినట్లయితే ప్రభుత్వానికి విక్రయించవచ్చు. ఎన్నోరకాల సదుపాయాలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టడంతో పట్టణాల్లో ఈప్రాజెక్టును వినియోగించుకునేందుకు అధిక సంఖ్యలో ముందుకు వస్తున్నారు. గ్రామాల్లో ఇప్పుడిప్పుడే ఈపథకం గురించి తెలుసుకుంటున్నారు. 200 యూనిట్లు పైబడి విద్యుత్ వాడుకునే ప్రతిఒక్కరూ ఈ పథకాన్ని ఏర్పాటు చేసుకుంటే ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

పీఎం సూర్యఘర్ పథకం వినియోగించుకునే ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు నూరుశాతం సబ్సిడీ అందిస్తున్నారు. వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించిన తరువాత యూనిట్ మంజూరవుతుంది. ప్రభుత్వం యూనిట్లు మంజూరు చేసిన తరువాత ప్లాంట్ ఏర్పాటు జరుగుతుంది.

- 150 యూనిట్లు వరకు తయారుచేసే 1.2 కిలోవాట్ల ప్లాంట్‌కు రూ.30వేల నుంచి రూ.60 వేల వరకు సబ్సిడీ ఇస్తుంది.
- 300 యూనిట్లు విద్యుత్ తయారుచేసే 2.3 కిలోవాట్ల ప్రాజెక్టుకు రూ.60 వేల నుంచి రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుంది.
- 300కు పైగా విద్యుత్ తయారుచేసే 3 కిలోవాట్ల ప్లాంట్‌కు రూ.78 వేల రాయితీ అందిస్తున్నారు.

రెండోసారీ చర్చలు విఫలం

గ్రానైట్ ముడిరాళ్ల రికవరీపైనే

ఫ్యాక్టరీ ఓనర్ల ఆందోళన

దాంతో సంబంధం లేదంటున్న ఏఎంఆర్ సంస్థ

రాయల్టీకి అదనంగా చిల్లిగవ్వ కూడా

చెల్లించేదిలేదని తేల్చిచెప్పిన యజమానులు

సంస్థ దృష్టికి తీసుకెళ్తామన్న

ఏఎంఆర్ ప్రతినిధులు


చర్చల్లో పాల్గొన్న క్వారీ, ఫ్యాక్టరీల యజమానులు, ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు

చీమకుర్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ సీనరేజి వసూలు హక్కులు దక్కించుకున్న ఏఎంఆర్ సంస్థ, గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల మధ్య మంగళవారం రెండోసారి జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఈనెల ఒకటో తేదీ నుంచి మొదలైన గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల సమ్మె ముగింపునకు చేరే పరిస్థితులు కనిపించకపోవటంతో ఫ్యాక్టరీ ఓనర్లలో ఆందోళన పెరిగిపోతోంది. ముఖ్యంగా ఫ్యాక్టరీలను లీజు తీసుకొని నడుపుతున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. లీజు హక్కులు పొందిన ఏఎంఆర్ సంస్థ ప్రభుత్వంతో అగ్రిమెంట్ బుధవారం కుదుర్చుకుంటే సమస్య కొలిక్కి వస్తుందని ఓనర్లు భావించారు. అగ్రిమెంట్‌కు తుది గడువును ఈనెల 24 వరకూ పొడిగించాలని ఏఎంఆర్ సంస్థ, మైన్స్ డీడీకి వినతిపత్రం అందచేయటం ఫ్యాక్టరీ ఓనర్లను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. నెలాఖరు వరకూ ఫ్యాక్టరీలు మూసివేయాల్సిందేనా...అదే జరిగితే బ్యాంకు ఈఎంఐలు, కరెంట్ బిల్లులు, లీజు చెల్లింపులు, జీతాలు అందివ్వటం ఎలా అని ఓనర్లు తలలు పట్టుకుంటున్నారు. మొత్తం 800 ఫ్యాక్టరీల్లో నలభైశాతం వరూ లీజుదారులే ఉండటం గమనార్హం.

రికవరిపైనే పీటముడి...

రెండోసారి చర్చల్లో ముడిరాళ్లలో రికవరీ శాతం ప్రధాన అంశంగా మారింది. ఒక కట్టర్‌కు రాయల్టీగా ప్రభుత్వానికి డబ్బు చెల్లిస్తే అందుకుప్రతిగా 22 క్యూబిక్ మీటర్ల ముడిరాయిని క్వారీ ఓనర్ల నుంచి కొనుగోలు చేసే అవకాశం లీగల్‌గా ఫ్యాక్టరీ ఓనర్లకు లభిస్తుంది. అలా కొనుగోలు చేసినపుడు ముడిరాయిలో దాదాపు సగానికి సగం వేస్ట్‌గా మిగిలిపోతుంది. అంటే రికవరీ శాతం సగమే ఉంటుంది. ఇప్పటి వరకూ క్వారీ ఓనర్లు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని అదనంగా రాయిని లాట్ల రూపంలో విక్రయిస్తున్నారు. రాయి వేస్ట్ విషయం మైనింగ్ అధికారులకు తెలుసు.. అందుకే అదనంగా ఫ్యాక్టరీ ఓనర్లు కొనుగోలు చేసిన రాళ్లపై పెనాల్టీని విధించేవారు కాదు. ఇలా అవగాహనతో సాగిపోతున్న క్రమంలో ప్రభుత్వం సీనరేజి వసూలును ప్రైవేటు సంస్థకు అప్పచెప్పటంతో సమస్యగా మారింది. రికవరీతో మాకు సంబంధం లేదు కొనుగోలు చేసిన రాళ్లను లెక్కకట్టి పర్మిట్‌కు మించితే పెనాల్టీ వసూలు చేస్తాం లేదా ముందుగానే మాతో ఒప్పందం కుదుర్చుకొని కట్టర్‌కు రూ.30వేలు అదనంగా చెల్లిస్తే మీ పని మీరు చేసుకోవచ్చు అని తేల్చి చెప్పటంతో సమస్యగా మారి సమ్మె వరకూ వెళ్లింది. ఇప్పటి వరకూ ప్రభుత్వానికి కట్టర్‌కి రూ.27వేలు చెల్లిస్తుండగా ఇపుడు మరో ఎనిమిది వేలు పెంచడమే భారం అనుకుంటే మరో ముప్పై వేలు అదనంగా ప్రభుత్వానికి కాకుండా మీ జేబుల్లోకి వెళ్లే విధంగా మేము చెల్లించే ప్రసక్తే లేదని ఓనర్లు భీష్మించుకున్నారు. ఇపుడే అంతంత మాత్రంగా జరుగుతున్న వ్యాపారాలు ఈ అదనపు చెల్లింపులతో ఫ్యాక్టరీలను నడిపే అవకాశమే లేదని, ఖర్చులు కూడా రాని దుస్థితి ఏర్పడుతుందని, అంతకన్నా మూసివేసుకోవటమే మేలని ఏఎంఆర్ సంస్థ ముందు ఫ్యాక్టరీ ఓనర్లు తెగేసి చెప్పారు. అవసరమైతే ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటు మేరకు ప్రభుత్వానికే అదనంగా రెండుశాతం రాయల్టీ చెల్లిస్తే ఎంతమేరకు అయినా రాళ్ల కొనుగోలుకు అనుమతి లభిస్తుందని, అలానే ముందుకెళతామని ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు తెగేసి చెప్పటంతో ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు ఆలోచనలో పడ్డారు. ఈ అంశాలను మా సంస్థ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామని, మరోసారి చర్చలు జరిపి పరిష్కారమార్గం కనుగొందామని ఏఎంఆర్ ప్రతినిధి చెప్పటంతో చర్చలు అర్ధంతరంగా ముగిశాయి.

క్వారీ ఓనర్ల చేతిలోనే పరిష్కారం...

ముడిరాయిని విక్రయించే క్వారీ ఓనర్ల చేతిలోనే పరిష్కార మార్గం ఉందని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. రికవరీతో సంబంధంలేదు, పర్మిట్‌కు మించితే పెనాల్టీ వేస్తామన్న ఏఎంఆర్ సంస్థ వాదన ప్రభుత్వ నిబంధనల మేరకే ఉంది. మరో వైపు నాణ్యమైన రాయిని ఎగుమతి చేసుకుంటూ నాణ్యత తక్కువ ఉన్న రాయిని లోకల్ ఫ్యాక్టరీలకు క్వారీ ఓనర్లు విక్రయిస్తున్నారు. ఈ రాళ్లలో రికవరీ శాతం తక్కువ అని ఓనర్లకు తెలుసు కాబట్టి రేటు తక్కువకు విక్రయిస్తే ఫ్యాక్టరీ ఓనర్లు నష్టాల నుంచి గట్టెక్కవచ్చు. వేలాదిమందికి ఉపాధి కల్పించే పరిశ్రమ కళకళలాడాలంటే పదుల సంఖ్యలో ఉన్న క్వారీ ఓనర్లు తమ లాభాల్లో కొంత మేర తగ్గించుకుంటే వారికొచ్చే నష్టమేమి లేదనేది కొంతమంది ఫ్యాక్టరీ ఓనర్లు వాదన. ఉభయతారకంగా సమ్మెకు స్వస్తి పలికి పరిశ్రమ యథాతథంగా నడిచేలా క్వారీ ఓనర్లు ముందుకు వచ్చి తమ నిర్ణయం తెలపాలని ఆశిస్తున్నారు. ఏఎంఆర్, ఫ్యాక్టరీ ఓనర్ల మధ్య చర్చల్లో మధ్యవర్తిగా ఉంది కూడా క్వారీ ఓనర్లే కావటం విశేషం. గత రెండు సార్లు జరిగిన చర్చల్లో వారు మౌనంగా వింటున్నారే తప్ప సమస్య పరిష్కారం దిశగా ముందుకు రాకపోవటం గమనార్హం. మంగళవారం జరిగిన చర్చల్లో ఏఎంఆర్ సంస్థ ప్రతినిధి నీహంత్, కారీ ఓనర్లు శిద్దా భరత్, ఆర్‌పీ రవి, చలువాది బదరీనారాయణ, సురేంద్రరెడ్డి, శిల్పారెడ్డి, నూనె అనుదీప్, ఫ్యాక్టరీ ఓనర్లు కాట్రగడ్డ రమణయ్య, యర్రగుంట్ల శ్రీనివాసరావు, కోడూరి వెంకట్రావు, లగడపాటి శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు, సూదనగుంట కోటేశ్వరరావు, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

అవినీతి డొంక కదులుతోంది!

(5వ పేజీ తరువాయి)

జారీ చేయగా, మొదటి రోజు సీఎంఎంలు, సీవోలు, ఐబీలు, మార్ట్ కమిటీ ప్రతినిధులు మొత్తం 14 మంది హాజరయ్యారు. ఒక్కొక్కరిని వేర్వేరుగా పలు అంశాలపై కమిటీ విచారించింది. ఈసందర్భంగా వారు పొంతనలేని సమాధానాలు, ఒకరిపై ఒకరు నెపం మోపే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. మరో వైపు మార్ట్‌లో జరిగిన అమ్మకాల నగదు నిల్వ, లావాదేవీలపై విచారణ కమిటీ లోతుగా ఆరా తీసినట్లు సమాచారం. విచారణకు హాజరైన వారు తమకేమీ తెలియదని, గతంలో పనిచేసిన వారే అంతా చేశారని చెప్పినట్లు తెలిసింది. వారు ఇచ్చిన సమాధానాలను రికార్డు చేసిన విచారణ కమిటీ.. మార్ట్ రికార్డులను స్వాధీనం చేసుకుంది. ఒకరిద్దరి వలన మార్ట్ మూతపడలేదని, మూకుమ్మడిగా ఎవరికి తోచినట్లు వారు నగదు దోచుకోవడమే కారణమని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.

మార్టు సరుకులతో వ్యాపారం

మార్ట్‌లోని సరుకులు మెప్మా ఉన్నతాధికారుల ఇళ్లకు కూడా చేరినట్లు తెలుస్తోంది. కొందరు సీవోలు ఇంటి అవసరాలకు వాడుకున్నట్లు సమాచారం. మరొకరు సొంతంగా ఇంటి వద్ద చిల్లర కొట్టుపెట్టి మార్టులోని సరుకులు అక్కడికి తీసుకెళ్లి వ్యాపారం చేసినట్లు విచారణ సందర్భంగా గుర్తించినట్లు తెలిసింది. ఇలా ఎవరికి తోచినట్లు వారు దోచేశారు. వచ్చిన లాభాలను కూడా బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని సొంతానికి వాడేసుకున్నట్లు బయటపడింది. మరో ఉద్యోగి మార్టులో విక్రయాలకు సంబంధించిన డబ్బును ఏరోజుకారోజు బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా జేబులో వేసుకున్నట్లు తెలిసింది. గతంలో ఇక్కడ పనిచేసిన మెప్మా ఉన్నతాధికారి నిర్లక్ష్యంతో అప్పట్లో ఇక్కడ పనిచేసిన సీఎంఎంలు, సీవోలు, మరికొందరు ఉద్యోగులు అడ్డగోలుగా అవినీతికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. విచారణ విషయం తెలుసుకున్న ఆర్పీలు మార్ట్ వద్దకు చేరుకొని తాము పొదుపు సభ్యుల ద్వారా కట్టించిన సొమ్మును తిరిగి ఇవ్వాలని మెప్మా సిబ్బందిని నిలదీశారు.

‘ఉపాధి’లో బోగస్‌కు చెక్!

(5వ పేజీ తరువాయి)

మొత్తం పనుల అంచనాలో 60శాతం కూలీలు చేయాల్సి ఉంది. మిగతా 40శాతం నిధులను కేంద్రం మెటీరియల్ కోటా కింద ఇస్తోంది. కూలీలు చేసిన పని ప్రకారమే మెటీరియల్ కాంపొనెంట్ నిధులు వస్తాయి. కూలీల సంఖ్యను పెంచాలని అధికారులపై ఒత్తిడి ఉండటంతో ఇప్పటి వరకు ఏదోవిధంగా కూలీల నమోదు అధికంగా చూపుతున్నారు. వేలిముద్రలు, ముఖ ఆధారిత డిజిటలైజేషన్ కార్యక్రమం ద్వారా బోగస్ కూలీల సంఖ్య తగ్గిపోనుంది. మెటీరియల్ కాంపొనెంట్ నిధులు కూడా తగ్గిపోతాయని పలువురు అంటున్నారు.

ముమ్మరంగా నమోదు కార్యక్రమం



మండలంలో కూలీల వేలిముద్రలు, ఐరిస్, ముఖం డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో ముమ్మరంగా చేస్తున్నాం. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ వివరాలను నమోదు చేస్తాం. బోగస్ హాజరు నమోదు కట్టడిలో భాగంగా ఈ విధానాన్ని ప్రభుత్వం చేపట్టింది. దీని వలన నిజమైన కూలీకి న్యాయం జరుగుతుంది. చేసిన పనిని బట్టి కూలీలకు అధిక వేతనం కూడా లభిస్తుంది.

- పి.వెంకటరావు, ఉపాధి హామీ కొండపి ఏపీవో

అవీఇవీ

వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి


వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, డీపీవో,అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మానవాళికి రామాయణం లాంటి మహత్తరమైన గ్రంథాన్ని అందించిన మహనీయుడు మహర్షి వాల్మీకి అని ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని కలెక్టర్ పీ రాజాబాబు పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను ఒకసారి స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అధికారిణి నిర్మలా జ్యోతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. తడి, పొడిచెత్త నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం సాయంత్రం సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సమావేశంలో పలు శాఖల అధికారులు ఎం.వెంకటేశ్వరరావు, చిరంజీవి, బాలశంకరరావు, అశోక్ పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేపట్టాలి

రాజముద్రతో తయారు చేసిన పట్టాదారు పాసుపుస్తకాలను పటిష్టంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సీసీఎల్‌ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. కలెక్టర్ పి.రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, సర్వేశాఖ ఏడీ గౌసబాషా పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో అభివృద్ధికి శ్రీకారం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మాస్టర్ ప్లాన్‌తో పాటు ఎన్‌టీఆర్ స్మార్ట్ టౌన్ షిప్‌లో వినూత్న ఆలోచనలతో కూడిన చర్యలు తీసుకోనున్నట్లు ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్ పేర్కొన్నారు. ఒంగోలు అర్బన్ డెలప్‌మెంట్ అథారిటీ (ఒడా) సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో జరిగింది. ఈ సందర్భంగా ఉడా వైస్ ఛైర్మన్, జేసీ ఆర్.గోపాలకృష్ణతో కలిసి పలు శాఖల అధికారులతో కలిసి ఒడా ద్వారా చేపట్టే పలు రకాలప్రాజెక్టులపై చర్చించారు.

25 నాటికి ఈ-పంట నమోదును పూర్తి చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 25వ తేదీనాటికి ఈ-పంట నమోదును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జేసీ గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయం నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ-పంట నమోదుతోపాటు సీసీఆర్ కార్డులు జారీ, మ్యుటేషన్ తప్పులు సరిచేయుట, పట్టా సబ్‌డివిజన్, రెవెన్యూ శాఖ ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాలపై తహసీల్దార్లకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఆయా కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు మాధురి, పద్మశ్రీ, వరలక్ష్మి, గౌసబాషా తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 బాలబాలికల జిల్లా హాకీ జట్ల ఎంపిక

సంతనూతలపాడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్-19 బాలి, బాలికల జిల్లా హాకీ జట్ల ఎంపిక జరిగింది. ప్రతిభ చూపిన వారిని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జరగబోయే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లలో పాల్గొంటారని అండర్-19 జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి చింపారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవికుమార్, శ్రీనివాసరావు, హెచ్‌ఎం నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, పీడీలు వనజ, కౌసల్య, కోటిరెడ్డి, సౌజన్య, టి.రవికుమార్ పాల్గొన్నారు.

సిఫార్సు బదిలీలు

(5వ పేజీ తరువాయి)

వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్టం-2025 తీసుకొచ్చింది. ఆ ప్రకారం బదిలీలను ఆన్‌లైన్‌లోనే నిర్వహించాల్సి ఉంది. అభ్యర్థన మేరకు, సరస్పర, అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర బదిలీల నిర్వహణ అధికారం ప్రభుత్వానికి ఉన్నట్లు ఆచట్టంలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ నిబంధనల సాకుతో జిల్లాలో ఇద్దరు టీచర్‌లకు సిఫార్సు బదిలీ ఉత్తర్వులు అందాయి. కొండపి మండలం కట్టావారిపాలెం ఎంపీపీ పాఠశాలలో సెంకడరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిని ఎస్‌ఎన్ పాడు ఎంపీపీఎస్ మెయిన్‌కు బదిలీ చేశారు. నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న బయోలాజికల్ సైన్స్ టీచర్‌ను మద్దిపాడు మండలం కారుమూడివారిపాలెం (గుండ్లాపల్లి) జడ్పీ హైస్కూల్‌కు పంపారు. ఈ ఇద్దరూ మంగళవారం ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. ఈ రెండు సిఫార్సు బదిలీ ఉత్తర్వులు సంతనూతలపాడు నియోజకవర్గానికే రావడం గమనార్హం. మరో ఆరుగురు టీచర్‌ల బదిలీలకు సంబంధించిన సిఫార్సు ఉత్తర్వులు త్వరలోనే రావచ్చని ప్రచారం జరుగుతోంది.

నేటి నుంచి కర్ణాటకలో పొగాకు కొనుగోళ్లు

(5వ పేజీ తరువాయి)

పరిధిలో 100 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. ప్రతికూల వాతావరణంతో 85 మిలియన్ కిలోల లోపుగానే ఉత్పత్తి జరిగినట్లు తెలుస్తోంది. అందులో లోగ్రేడ్ 25శాతం ఉంది. 30శాతం మేలు రకం, 45శాతం మీడియం గ్రేడ్ వచ్చినట్లు సమాచారం. గత ఏడాది కిలో రూ.230తో కొనుగోళ్లు ప్రారంభించిన వ్యాపారులు అవసరానికి అనుగుణంగా ధరలు పెంచుతూ అత్యధికంగా కిలోకు రూ.367 ఇచ్చారు. సగటున కిలోకు రూ.257.52 మేర ధర లభించింది. ఈ ఏడాది లోగ్రేడ్ ఉత్పత్తి తగ్గడంతో సగటు ధరలు అధికంగా లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మెరుగైన ధరలు లభించే అవకాశం

ఈ ఏడాది ఆరంభం నుంచే కర్ణాటక మార్కెట్లో ధరలు ఒకింత మెరుగ్గానే లభిస్తాయని తెలుస్తోంది. గత ఏడాది ప్రారంభ ధర కిలోకు రూ.230ఇచ్చిన వ్యాపారులు ఈ ఏడాది కిలోకు రూ.300పైనే ఇవ్వాలని ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొనుగోళ్లు జరుగుతున్న ఆంధ్ర మార్కెట్లో ఉత్తరాది వేలం కేంద్రాలలో గరిష్ఠ ధర కిలో రూ.420 కాగా, దక్షిణాదిన రూ.346 వరకు వెళ్లిన నేపథ్యంలో కర్ణాటకలో ప్రారంభ ధరలే రూ.300పైగా ఇవ్వవచ్చని తెలుస్తోంది.

బాలుడు చాటున చంద్రుడు



పక్క చిత్రంలో కనిపిస్తున్న మేఘంలో ఓ చిత్రం ఆవిష్కృతమైంది. చంద్రుడు ప్రకాశిస్తున్న సమయంలో అడ్డుగా వచ్చిన ఒక మేఘం బాలుడి ఆకారంలో కనిపించింది. బాలుడు చాటున చంద్రుడు నక్కినట్లు కనిపించిన ఈ దృశ్యాన్ని మంగళవారం రాత్రి ప్రజలు తిలకించారు.

- ఆంధ్రజ్యోతి, త్రిపురాంతకం

ఖర్జూరం.. ప్రయోగాత్మకం..!

ఎర్రగొండపాలెం ప్రాంత కరువు నేలపై సాగు

తోకపల్లి, గంగపాలెల్లో నూతన పంటల వైపు మొగ్గుచూపిన రైతులు

మెళకువలు తెలుసుకోలేక ఇబ్బందులు



పండిన పండ్లు

త్రిపురాంతకం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన ప్రాంతంలో కొందరు రైతులు ముందడుగు వేస్తున్నారు. కొత్తకొత్త ఆలోచనలతో సాగు చేపడుతున్నారు. నిత్యం మిర్చి, పత్తి, మొక్కజొన్న, కంది వంటివి సాగు చేసే రైతులు ఇటీవల ఉద్యాన పంటల సాగు వైపు ఆసక్తి చూపిస్తున్నారు.

ఎర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో పండ్లతోటల సాగు క్రమక్రమంగా పెరుగుతోంది. వీరిలో కొందరు కొత్త పంటల సాగుపట్ల ఆసక్తితో ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఈ ప్రాంత నేల, సామర్థ్యం, వాతావరణానికి భిన్నంగా పంటలను సాగు చేయడం విశేషం. సకాలంలో వర్షాలు కురవక భూగర్భ జలాలు అందుబాటులో ఉండక కరువు ప్రాంతమని ముద్రపడిన ఎర్రగొండపాలెం లాంటి చోట ఖర్జూరం పండించాలని చూడడం నిజంగా ప్రయోగాత్మకమే. దీనిపై ఆసక్తి ఉన్నా సరైన మెళకువలు తెలియక ఇబ్బంది పడుతున్నామని, అనుకూల దిగుబడి వస్తే ఈ సాగు లాభదాయకమేనని రైతులు అంటున్నారు. ఎర్రగొండపాలెం మండలం గంగపాలెంలో రైతు ఏపూరి రామిరెడ్డి 6 ఎకరాల్లోనూ, పెద్దారవీడు మండలం తోకపల్లిలో భాస్కర్‌రావు అనే రైతు 5 ఎకరాల్లోనూ ఖర్జూరాన్ని సాగు చేశారు.

ఉద్యాన శాఖ నుంచి రాయితీ లేదు

పీ ఆదిరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి

కొందరు రైతుల సూచన మేరకు ఉద్యాన వర్సిటీకి లేఖ రాశాం. కానీ ఖర్జూరం సాగుకు ఈ ప్రాంతం అనుకూలించకపోవచ్చని, పంట ఎగుమతికి కూడా ఇబ్బందులు ఉంటాయని ఉన్నతాధికారులు తమకు సమాచారం ఇచ్చారు. దాంతోపాటు ఖర్జూర పంటకు ఉద్యాన శాఖ నుంచి ఎలాంటి రాయితీలేదు. ఆసక్తి ఉన్నవారు మాత్రమే సాగు చేస్తున్నారు.



గంగపాలెంలో ఏపుగా పెరుగుతున్న ఖర్జూర చెట్లు

వెలిగొండపైనే ఆశలు...

భాస్కరరావు, వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగి, పెద్దారవీడు మండలం తోకపల్లి గ్రామం



పెద్దారవీడు మండలం తోకపల్లిలో నాకు 5 ఎకరాల భూమి ఉంది. అందులో ఖర్జూర మొక్కలు దాదాపు 350 మొక్కలు నాటి ఇప్పటికి నాలుగేళ్లు గడిచింది. అప్పట్లో మద్రాసు నుంచి వచ్చిన కొందరు వ్యాపారులు డెమో ప్లాంటేషన్ చేద్దామని చెప్పి ఖర్చుపెట్టి మొక్కలు నాటిన తరువాత ముఖం చాటేశారు. ఆ తర్వాత నాకు ఉన్న పరిజ్ఞానంతో ఖర్జూరం సాగులో మెళకువలు తెలుసుకుంటూ ముందుకెళ్తున్నా. 500 నుంచి 600 అడుగుల లోతు నుంచి బోర్ల ద్వారా అతికష్టం మీద చెట్లకు నీరు అందిస్తున్నా. ఈ క్రమంలో ఉద్యాన శాఖ అధికారులు వచ్చి పరిశీలించి నీటిలో ఉన్న కొన్ని లోపాల వల్ల చెట్లు ఎదుగుదల లేకుండా పోయాయని చెప్పారు. అయినప్పటికీ వ్యవసాయంపై ఉన్న ఆసక్తితో గత 30 ఏళ్లుగా పండ్ల తోటల సాగులో బత్తాయి పండించి ఉత్తమరైతుగా ప్రశంసలు పొందా. దాదాపు 7 ఎకరాల్లో బత్తాయిని 22 ఏళ్లుగా సాగు చేస్తున్నా. ఆ తర్వాత ఖర్జూర సాగుపట్ల ఆసక్తి కలిగింది. నీటి సమస్యకు పరిష్కారం వెలిగొండ ప్రాజెక్ట్ వస్తేనే మేలు. అప్పుడే మాలాంటి ప్రయోగాత్మకంగా సాగుకు దిగే వారి ఆశలు ఫలిస్తాయి.

యూట్యూబ్‌లో చూసి పండిస్తున్నా

రామిరెడ్డి, రైతు, ఎర్రగొండపాలెం మండలం గంగపాలెం

నాకు ఎర్రగొండపాలెం మండలం గంగపాలెంలో 6 ఎకరాల భూమి ఉంది. అందులో ఖర్జూరం సాగు చేస్తున్నా. పండ్ల తోట సాగు చేయాలనే ఆలోచనతో యూట్యూబ్ ద్వారా తెలుసుకుంటుండగా ఖర్జూరం పట్ల ఆసక్తి కలిగి సాగుకు దిగా. ఇప్పటికి ఆరేళ్ల కిందట సాగుకు ఉపక్రమించిన తాను అప్పటి నుంచి అలాగే కొన్ని మెళకువలు తెలుసుకుంటూ ఇప్పటికి మూడేళ్లుగా ఖర్జూరం ఫలాలు కూడా అమ్మినప్పటికీ ఆశించిన మేర దిగుబడులు రావడం లేదు. రామిరెడ్డి ఎకరాకు దాదాపు 75 మొక్కలను ఒక్కో మొక్క రూ.8వేల ఖరీదుతో కొనుగోలు చేసి నాటాను. కారణంగా నాలుగేళ్లకే చెట్లు కాపుకు వచ్చాయి. మొక్కలు కొనుగోలుకే దాదాపు రూ.36 లక్షలు ఖర్చు చేశా. మొదటి ఏడాది 4 టన్నులు, రెండో ఏడాది 6టన్నుల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఇంకొద్దిగా పెరిగే అవకాశం ఉంది. టన్ను ధర సగటున లక్ష రూపాయలు అమ్ముతున్నా. ఇప్పటివరకు కేవలం సాగుకు అయ్యే ఖర్చులను పూడుస్తుంది. దిగుబడి పెరిగితే మంచి లాభదాయకమే. కొత్త పంట పండించాలనే ఆసక్తితోనే ఇలా ఖర్జూర పంట ఎంచుకున్నా.



చెట్టుకు విరగ్గాసిన కర్జూరం

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

మృతుడు ఒంగోలు వాసి

తుర్కపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): భువనగిరి-గజ్వేల్ రహదారిపై యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం పెద్ద తండ సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి సోమవారం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడు ఒంగోలుకు చెందిన వ్యక్తి అని అతని వెంట వచ్చిన వ్య క్తులు చెప్పారు. ఎస్ఐ తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు కు చెందిన శేషయ్య తుర్కపల్లి మండలం రామోజీనాయక్ తండాలో మేస్త్రీగా పనిచేస్తున్నాడు. శేషయ్య సెప్టెంబరు 23న ఒంగోలు నుంచి వచ్చేటప్పుడు అతని వెంట ఇద్దరు కూలీలు శ్రీను(30), రవిని తీసుకొచ్చాడు. వారు భువనగిరికి చేరుకోగానే రామోజీనాయక్ తండాకు చెందిన డ్రైవర్ సీతాపతి మారుతి ఈకో వ్యాన్ తీసుకుని భువనగిరికి వెళ్లాడు. వారిని వ్యాన్‌లో ఎక్కించుకుని వస్తుండగా పెద్దతండా సమీపంలో ఎదురుగా వస్తున్న కారు వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న నలుగురు వ్యక్తుల్లో మేస్త్రీ శేషయ్య, శ్రీను, రవిలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. వీరిలో శ్రీను చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతిచెందాడు. శ్రీను ఒంగోలు కూలీల అడ్డాపై ఉండగా తమ వెంట తీసుకొచ్చామని, అతని పేరు శ్రీను అని మాత్రమే తమకు తెలుసునని మేస్త్రీ శేషయ్య చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి మెడపై అమ్మ, కుడిచేతి మీద లవ్ సింబల్, స్టార్ టాట్యూ మచ్చలు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిస్తే ఫోన్ నెంబర్లు 8712662479, 8712662805కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

ఒంగోలు క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందిన సంఘటన మంగళవారం పెళ్లూరు సమీపంలోని ఆలాస్ హోటల్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. మృతుడి తల, ముఖంపై బలమైన గాయాల వల్ల రక్తస్రావమై మృతి చెందాడు. ప్రమాదవశాత్తు మృతి చెందాడా, ఎవరైనా హత్య చేసి అక్కడ పడవేశారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. సమాచారం అందుకున్న తాలుకా పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలిచారు. మృుడిని ఆచూకీ కోసం విచారణ చేపట్టారు.

యువకుడు ఆత్మహత్య

ఒంగోలు క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బేకరీ షాపులో పనిచేసే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా ఏంజెల్ బేకరీలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలలోకి వెళితే.. స్థానిక కర్నూల్‌రోడ్డులోని రెవెన్యూకాలనీలో నివాసం ఉండే చల్లగాలి బాబు (19) బేకరీకి సమీపంలోని బంధువుల ఇంట్లో గొడవపడ్డాడు. మద్యం సేవించిన బాబును నిలవరిచేందుకు వరుసకు అక్క అయిన నయోమి, ఆమె కుమారుడు ఏబు వల్ల కాలేదు. దీంతో వారి ఇరువురిని ఇంట్లో ఉంచి బయిట గడియ పెట్టి సెల్‌ఫోన్‌ను విసిరివేసి మంగళవారం తెల్లవారుజామున వెళ్లిపోయాడు. అతనితో బేకరీలో పనిచేసే నారాయణ ఉదయం 6 గంటలకు అక్కడకు వెళ్లే సరికి బాబు లుంగీతో ఇనుపరాడ్డుకు ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నాడని మృతిడి సోదరుడు నవీన్ తెలిపారు. ఈమేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు స్మార్ట్‌జన్ విద్యార్థి

సింగరాయకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక స్మార్ట్‌జన్ గ్లోబల్ స్కూల్‌కి చెందిన ఆరో తరగతి విద్యార్థి దక్ష బక్షి రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లాలోని అద్దంకిలో సోమవారం నిర్వహించిన 69వ స్కూల్‌గేమ్ జిల్లా స్కేటింగ్ పోటీల్లో దక్ష ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. త్వాదారా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని పాఠశాలలో మంగళవారం చైర్మన్ పి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతారాణి అభినందించారు.



ఎంపికైన దక్ష

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130. 139. 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00



మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేశు

వృద్ధుల పట్ల బాధ్యతగా మెలగాలి

డీఆర్వో ఓబులేశు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీ కోసం హాలులో మంగళవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వృద్ధులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకులు, వృద్ధుల సంఘం ప్రతినిధులు తమ అనుభవాలను ఈసందర్భంగా ప్రస్తావించారు. ఆయా అంశాలపై డీఆర్వో స్పందిస్తూ వృద్ధుల సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం వృద్ధుల సంక్షేమం, రక్షణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వృద్ధుల సేవలో విశేషంగా సహకరించిన వృద్ధులను సన్మానించారు. అనంతరం వృద్ధులకు చేతికర్రలు, వారి దిన చర్యలకు ఉపయోగం చేసేందుకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ అధికారి సీహెచ్ సువార్త పాల్గొన్నారు.

జవాన్ తిరుమలయ్యకు ఘన నివాళి



జవాన్‌కు నివాళులు అర్పిస్తున్న క్రిష్ణకిశోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్మీలో విధులు నిర్వహిస్తూ సెలవులపై సొంత గ్రామానికి వచ్చిన తరువాత అనారోగ్యంతో జవాన్ మృతి చెందారు. గిద్దలూరు మండలం కేఎస్‌పల్లె గ్రామానికి చెందిన దాసరి చిన్నతిరుమలయ్య కొంతకాలంగా ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల సొంత గ్రామమైన కేఎస్‌పల్లెకు సెలవుపై వచ్చారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి జవాన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, టీడీపీ నాయకులు పాలుగుళ్ల హనుమంతరెడ్డి, చిన్న శ్రీనివాసరెడ్డి, ఆర్మీ జవాన్లు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం

ఆ దిశగా చర్యలు తీసుకోవాలి

రాష్ట్రంలో దాని తయారీ నిషేధం

పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి కాకుండా చూడాలి

కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య



మాట్లాడుతున్న కృష్ణయ్య, పక్కన కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య చెప్పారు. ఒక వైపు దీనిని నివారించి మరో వైపు ఇప్పటికే ఉన్న వ్యర్థాలను రీసైకిల్, రీయూజ్ చేయడం ద్వారా సర్క్యులర్ ఏకనామీ పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర సమావేశపుహాలులో మంగళవారం కాలుష్యనియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా, జిల్లాలో ఉపాధి అవకాశాలు పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అదేసమయంలో కాలుష్యాన్ని కూడా తగ్గించడంపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రానైట్‌తో పాటు మత్స్య, వ్యవసాయ-దాని అనుబంధ రంగాలలో వస్తున్న వ్యర్థాల వల్ల పర్యావరణం కాలుష్యం అవుతున్న తీరుపై చర్చించారు. రీయూజ్ చేసేందుకు దృష్టి సారించాలని చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీకి ప్రభుత్వం అనుమతులు ఇవ్వనుందున పొరుగు రాష్ట్రాల నుంచి అవి రవాణా జరగకుండా విస్తృత తనిఖీలు చేపట్టాలన్నారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగ నివారణ, వివిధ రంగాల ద్వారా వచ్చే కాలుష్యాన్ని నివారించేందుకు రాష్ట్రకాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ చేసిన సూచనలను సంబంధిత శాఖలు సమన్వయంతో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీపీవో వెంకటేశ్వరరావు, గనులశాఖ డీడీ రాజశేఖర్, పొల్యూషన్ కంట్రోలు బోర్డు ఈఈ రాఘవరెడ్డి, ఒంగోలు ఆర్డీవో కళావతి, వివిధ శాఖల అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాసులు, గోపీచంద్, పానకాలరావు పాల్గొన్నారు.

భూగర్భ జల మట్టం పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలి

కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూగర్భ జలమట్టం మరింత పెరిగేలా గ్రామ స్థాయిలో వాటర్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలతో పాటు గ్రామాలవారీగా వాటర్ డిమాండ్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ పీ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో మంగళవారం భూగర్భ, జలవనరులశాఖ, డ్వామా, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని 20 మీటర్ల కంటే ఎక్కువ భూగర్భజలం మట్టం ఉన్న గ్రామాల్లో, 8నుంచి 20 మీటర్ల భూగర్భజల మట్టం ఉన్న గ్రామాల్లో ఏయే చర్యలు తీసుకుంటే భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంటుందో పరిశీలన చేసి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలోని 799 ఇరిగేషన్ ట్యాంకులు, సంబంధిత ఫీడర్ ఛానల్స్‌లో ఉపాధిపథకం నిధులను అనుసంధానం చేస్తూ పూడికతీత పనులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా ఇరిగేషన్ , డ్వామా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. అంతకు ముందు వాటర్‌మేనేజ్‌మెంట్‌పై సంబంధిత శాఖల అధికారులు కలెక్టర్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమవేశంలో ఆయా శాఖల అధికారులు వరలక్ష్మీ, బాలశంకరరావు, చిరంజీవి, వందనం, ఎం. వెంకటేశ్వరరావు, గోపిచంద్, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఒంగోలులో ఘనంగా అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభం

అంతరిక్ష నడక, భారీ ర్యాలీ

ఒంగోలు విద్య, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి) : సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్), ఇస్రో, ఒంగోలు క్విస్ విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలులో ఘనంగా అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్పేస్ వాక్(అంతరిక్ష నడక) నిర్వహించారు. స్థానిక ఎస్పీ కార్యాలయం నుంచి అద్దంకి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, షార్ డిప్యూటి డైరెక్టర్ గోపికృష్ణ, క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయిత్రీదేవి పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో క్విజ్ విద్యాసంస్థలు, జవహర్ నవోదయ విద్యార్థులు పాల్గొని భారతమాతాకి జై అంటూ నినాదాలు చేశారు. ఇస్రో గొప్పతనాన్ని చాటే రాకెట్‌లు, ఉపగ్రహాల నమూనాలను ర్యాలీలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూఅంతరిక్ష పరిశోధనలు, రాకెట్‌లు వాటి పనితీరు ప్రజలకు, విద్యార్థులకు తెలియచేసే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం ఆనందదాయకమన్నారు. షార్ డిప్యూటి డైరెక్టర్ గోపికృష్ణ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలు వలన మనకు కలిగే ప్రయోజనాలు గురించి తెలియచేయటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉదేశ్యమన్నారు. క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీగాయిత్రిదేవి మాట్లాడుతూ అంతరిక్ష ప్రయోగాలు మానవాళి శ్రేయస్సుకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఈకార్యక్రమాలలో క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ చక్రవర్తి, ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు, డీపీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, డీన్ డాక్టర్ భార్గవ్, వరల్డ్ స్పేస్ వీక్ 2025 ఒంగోలు సబ్ కమిటీ చైర్మన్ లీలా నాగ శ్రీనివాసరావు, సెక్రటరీ ఆదిత్య పాల్గొన్నారు



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

నేడు షార్ డైరెక్టర్ రాక

క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగే అంతరిక్ష వారోత్సవాల కార్యక్రమంలో షార్ డైరెక్టర్ పద్మకుమార్, కలెక్టర్ రాజాబాబు ముఖ్యఅతిధులుగా హాజరవుతారు.



ర్యాలీ ముగింపు సందర్భంగా ఇస్రో అధికారులు, పోలీసులు, క్విస్ కళాశాల ప్రతినిధులు

కార్పొరేషన్ రోడ్డులో ఆక్రమణ తొలగింపు


రోడ్డులో కొలతలు వేసి బోర్డును తొలగించిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలులోని కార్పొరేషన్ రోడ్డులో ఆక్రమణ తొలగింపును టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురించిన 'కార్పొరేషన్ రోడ్డు ఆక్రమణ' వార్తపై కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఈ మేరకు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశాలతో సర్వేయర్ శ్రీనివాసరావు పరిశీలించారు. రోడ్డును ఆక్రమించిన నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లోని ఓ లాడ్జి యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తీర్ణం కొలతలు వేయడంతోపాటు అక్కడ ఏర్పాటు చేసిన ఐరన్ బోర్డులను తొలగించారు. ఆ రోడ్‌లో ప్రజల రాకపోకలకు అడ్డుకుంటే చర్యలు తప్పవని లాడ్జి యాజమానికి తెలిపారు. ఇకపై ప్రజలు ఈ మార్గంలో నిరభ్యంతరంగా రాకపోకలు సాగించవచ్చని, ప్రజల సౌకర్యార్థం సర్వీస్ రోడ్డు నిర్మించారని, ఎవరైనా ఆక్రమణలు చేస్తే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

ఆర్‌ఎల్‌పురం కార్యదర్శికి సత్కారం


నరేంద్రను సత్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా స్వచ్ఛాంధ్ర రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్న చీమకుర్తి మండలం ఆర్‌ఎల్‌పురం పంచాయతీకార్యదర్శి నరేంద్రను కలెక్టర్ రాజాబాబు సన్మానించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం రాత్రి రాష్ట్ర స్థాయి అవార్డులను అందుకున్న ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్‌ఎల్‌పురం పంచాయతీ రాష్ట్ర స్థాయి అవార్డు పొందడంతో అక్కడ చేపట్టిన కార్యక్రమాలను జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. అదేవిధంగా మెప్మా పీడీ శ్రీహరి కూడా రాష్ట్ర స్థాయి అవార్డును అందుకోవడంతో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేశారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ రవికుమార్ అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఒంగోలులో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అన్ని రకాల అవినీతిని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఇటీవల పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అపరిచిత ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు బ్యాంకు ఏటీఎం, ఓటీపీ నెంబర్లు చెప్పకుండా ఉండాలన్నారు. బ్యాంకు రీజనల్ కార్యాలయం నుంచి మినీస్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ రామలింగేశ్వరరావు, శ్రీనివాసరావు, యూనియన్ బ్యాంకు రీజనల్ విజిలెన్స్ అధికారి అనిల్‌కుమార్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

నాగులుప్పలపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఎం.ముప్పాళ్లలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 220 మందికి వైద్యులు రామాంజనేయులు, స్వాతి పలు పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు కిమ్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రఫీ తెలిపారు. 50 మందికి ఆపరేషన్లు అవసరమైనట్లు గుర్తించామని ఆయన పేర్కొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- మంత్రి స్వామి
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న మంత్రి స్వామి

టంగుటూరు(కొండపి), అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): కొండపి నియోజకవర్గంలో తాగునీటి సమస్యలేకుండా అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. తాగునీటి సమస్య, నియోజకవర్గంలో ఆశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి మంగళవారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో కొత్తగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంకులు, శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు. త్వరగా నిర్మిస్తే ప్రారంభ కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని మంత్రి అధికారులకు సూచించారు. పీఎం అజయ్ నిధులతో టంగుటూరులో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, పొన్నలూరు మండలంలోని రావులకొల్లులోని ఎస్సీ కాలనీలో ట్యాంకు నిర్మాణానికి మంజూరైన జడ్పీ నిధులు 25 లక్షల రూపాయల పనిని వెంటనే ప్రారంభించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా పర్యవేక్షించి నివారణ చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో సింగరాయకొండ డీఈఈ వి.వేణుగోపాల్‌రావు, ఏఈలు రమేష్‌బాబు, పౌల్‌రాజు, వెంకటేశ్వరరావు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్లేస్కూల్ పేరుతో ప్రైమరీ తరగతులు

- నిర్వాహకులకు నోటీసులు



ఒంగోలు(విద్య), అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం రామ్‌నగర్ 3వ లైన్‌లోని హనీకిడ్స్ ప్లేస్కూల్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా 1,2,3 తరగతులు కూడా నిర్వహిస్తున్నట్లు వెలుగుచూసింది. మంగళవారం ఎంఈవో టి.కిషోర్‌బాబు ఆకస్మిక తనిఖీలో ఈ అక్రమ తరగతులు వ్యవహారం బయటపడింది. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ప్లే స్కూల్‌లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు మాత్రమే నిర్వహించాలి. అయితే హనీకిడ్స్ ప్లేస్కూల్‌లో ఎల్‌కేజీ, యూకేజీతోపాటు 1,2,3 తరగతులు కూడా నిర్వహించడంపై ఎంఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనుమతులు, గుర్తింపు లేకుండా 1,2,3 తరగతులు ఎలా నిర్వహిస్తారంటూ పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. 1వ తరగతులో 11మంది, రెండో తరగతిలో ఇద్దరు, 3లో ఏడుగురు మొత్తం 20 మంది విద్యార్థులు ఉండగా ఎంఈవో వెంటనే వారి తల్లితండ్రులతో సెల్‌ఫోన్‌లో నేరుగా కొంతమందితో మాట్లాడారు. ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల్లో పిల్లలను చేర్పించకూడదని చెప్పారు. వెంటనే వారిని ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఇతర పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా 1,2,3 తరగతులు నిర్వహించినందుకు కరస్పాండెంట్ శిరీషకు నోటీస్‌లు జారీ చేశారు. విద్యార్థులు స్కూలులో ఇలాగే కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈవో హెచ్చరించారు.

నూతన జీఎస్టీతో సామాన్యులకు ఎంతో మేలు

- ఎంపీడీవో రవికుమార్


విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎంపీడీవో రవికుమార్

నాగులుప్పలపాడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నూతన జీఎస్టీతో సామాన్యులకు ఎంతో మేలు కలుగుతుందని ఎంపీడీవో తేళ్ల రవి కుమార్, ఎంఈవో తిరుమలశెట్టి రవి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పై మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగులుప్పలపాడులో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ చార్జీలతో అన్ని వర్గాల ప్రజలకు నగదు ఆదా అవుతుందన్నారు. ప్రధానంగా సామాన్య ప్రజలు జరిపే కొనుగోళ్లలో భాగంగా అన్ని వస్తువులపై తగ్గింపు లభిస్తుందని చెప్పారు. ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వ్యాసరచన, పెయింటింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో రమణయ్య, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ టి.ఏడుకొండలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాల పంపిణీ


ఆటోడ్రైవర్లకు ఖాకీ చొక్కాలను అందజేస్తున్న ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఊళ్లపాలెం పంచాయతీ పరిధిలోని ఆటోడ్రైవర్లు 62 మందికి ఆ గ్రామ పంచాయతీ పరిధిలోని బేసిన్‌పల్లెపాలెం టీడీపీ నేత కొక్కిలిగడ్డ శ్రీనివాసులు రూ.35వేలు విలువచేసే ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. వీటిని మంగళవారం గ్రామసచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై బి.మహేంద్ర చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బాలాజీ, బాయిరెడ్డి మురళి, నూతలపాటి చైతన్య, గొల్లపోతు హరిప్రసాద్, నాయుడు నాగరాజు, యూనియన్ ప్రెసిడెంట్ శ్రీనుబాబువర్మ పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

టంగుటూరు (కొండపి), అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ఓట్ చోరీ నినాదంతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆలకూరపాడులో కొండపి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. సేకరించిన సంతకాలను రాష్ట్ర అధ్యక్షురాలికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.శశికుమార్, నాయకులు గంగుల పోలయ్య, మహేష్, ఏసుపోగు దావీదు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఒంగోలు నగరంలో పలుప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ కేపీపీరంగారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కర్నూల్‌రోడ్, అద్దంకి బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, సమైఖ్యత నగర్, బాలకృష్ణాపురం, చంద్రయ్యనగర్, సత్యనారాయణపురం తదితర ప్రాంతాలలో కరెటు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు

ఒంగోలు(రూరల్), అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ పాఠశాలలో ఈనెల 8, 9 తేదీల్లో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ కోఆర్డినేటర్ సామినేని సురేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8న కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగా, చదరంగం, 9న అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. అండర్-14 క్రీడా పోటీల్లో పాల్గొనే బాల, బాలికలు 2012 సంవత్సరం లోపు జన్మించి ఉండాలన్నారు. అండర్-17 విభాగంలో పాల్గొను క్రీడాకారులైన బాల, బాలికలు 2009లోపు జన్మించి ఉండాలన్నారు. ఒంగోలు మండలంలోని అన్ని పాఠశాలల నుంచి క్రీడాకారులు (బాల,బాలికలు) పాల్గొనేలా పాఠశాలల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని, పూర్తి వివరాలకు 984942939 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

కలెక్టర్‌ను కలిసిన గిరిజనులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గతంలో వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందిన కొత్తపట్నం మండలానికి చెందిన అల్లూరు, ఈతముక్కల గ్రామానికి చెందిన గిరిజనులు కలెక్టర్ రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌కు బొకే అందజేశారు. కార్యక్రమంలో యానాది సంఘం మహాకూటమి నాయకులు చేవూరి వెంకటేశ్వర్లు, ప్రోగ్రెసివ్ సఫాయి కర్మశారి సంఘం జాతీయ కార్యదర్శి ఎం.బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం


పొగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

కొండపి, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): పెదకండ్లగుంట గ్రామంలో పోలేరమ్మ ఆలయ ఆరవ వార్షికోత్సవం మంగళవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం, చీరెలు, గాజులు, పసుపు, కుంకుమలు సమర్పించారు. అర్చకులు బి.హరీష్‌శర్మ, విజయ్‌కుమార్ పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రికి గ్రామంలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి నీటితో వారు పోసి టెంకాయలు కొట్టి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ తానికొండ వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు కొల్లా మోహన్‌రావు, కల్లూరి మల్లికార్జునరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీజేపై దాడి చేసిన నిందితుడిను అరెస్టు చేయాలి

- బార్ అసోసియేషన్ డిమాండ్


జిల్లా కోర్టు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కోర్టు ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ గవాయ్‌పై బూటుతో దాడి చేసేందుకు ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెక్రటరి జగ్జీవన్, ప్రతినిధులు గ్రేస్‌కుమారి, యాసిన్, గాంధీ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పలు సంఘాల ఆధ్వర్యంలో..

- సుప్రీంకోర్టు సీజే గవాయపై దాడి చేసిన నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడటం దారుణమన్నారు. జిల్లా అభివృద్ధి వేదిక కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ జడ్ కేటగిరి భద్రతలో ఉండే సీజేపై దాడి చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నీలం నాగేంద్రరావు, ఎల్.రాజశేఖర్, ఎంకే.బేగ్, చౌటూరి వెంకటేశ్వర్లు, ఎస్వీ.రంగారెడ్డి, షేక్ సుభాణి పాల్గొన్నారు.
- సుప్రీంకోర్టు సీజే గవాయ్‌పై దాడికి పాల్పడిన రాకేష్‌కిషోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.
- చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడి చేయడాన్ని డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్దుల్ సత్తార్ ఒక ప్రకటనలో ఖండించారు. ఈ దాడి ఉన్నత న్యాయవ్యవస్థను అగౌరవపర్చడమేనని అన్నారు.
- సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణించి దోషిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సాగర్ సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వంపై దాడిగా భావిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎం.రమేష్, బి.రఘురాం, కంకణాల రమాదేవి, జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసులు, జి.రమేష్, పి.కల్పన, టి.మహేష్, తంబి శ్రీనివాసులు, ఎస్.వెంకటేశ్వర్లు, జాలా అంజయ్య, ఉబ్బా వెంకటేశ్వర్లు, మోజెష్, ఎస్‌డీ.హుస్సేన్, ఎం.శేషయ్య, రాంబాబు, ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, ఎం.మాలతి, డి.నారాయణ పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై కోర్టులోనే జరిగిన దాడికి నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్, సీఐటీయూ నాయకులు వై.రూబెన్, బ్రహ్మయ్య, సుబ్బారావు, కళావతి పాల్గొన్నారు.

వర్షాలతో కంది, జొన్న కళకళ


పెట్లూరు పరిసరాల్లో సాగు చేసిన కంది, జొన్న పైరు

కొండపి, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): గడచిన మూడు రోజులుగా కొండపి ప్రాంతంలో ప్రతి రోజూ ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో ప్రస్తుతం కొండపి, జరుగుమల్లి, మర్రిపూడి మండలాల్లోని ఎర్ర నేలల్లో సాగు చేసిన దాదాపు వెయ్యి ఎకరాలకుపైగా కంది, అంతర పంటగా, వేరుగా సాగు చేసిన మేత జొన్న పైర్లు కళకళలాడుతున్నాయి. వర్షాలతో ఈ పైర్లకు ఉపయోగమని జరుగుమల్లి వ్యవసాయ అధికారి ఇ.కాశీవిశ్వనాథ్ వివరించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కందికి నష్టం లేదని ఆయన వివరించారు.

దాడి కేసులో ఇద్దరు అరెస్ట్

మార్కాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థలం దురాక్రమణ విషయంలో మహిళపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులను టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు.. పట్టణానికి చెందిన గోపాలుని లక్ష్మీభవానికి బాపూజీ కాలనీలో ఇంటి స్థలం ఉంది. ఆ స్థలాన్ని కొట్టేయాలని పట్టణానికి చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్, కందుకూరి శంకరాచారిలు పన్నాగం పన్నారు. ఈ క్రమంలో స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిని లక్ష్మీభవాని అడ్డుకుంది. దీంతో రెహమాన్, శంకరాచారి ఆమెపై దాడిచేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోచేశారు. నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి ఏజేఎఫ్‌సీఎమ్ కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి రిమాండ్ విధించారు.

జూదరుల అరెస్టు

రాచర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పలుగుంటిపల్లి గ్రామ పొలాల్లో పేకటాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. రూ.13,450 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

స్వామిత్వ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

సంతనూతలపాడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో జరుగుతున్న స్వామిత్వ సర్వేను మంగళవారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు టీములను ఏర్పాటుచేసి స్వామిత్వ సర్వేను చేపట్టినట్లు తెలిపారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈవోఆర్డీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

చీమకుర్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : 69వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు గురు,శుక్రవారాల్లో మండలస్థాయిలో నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ స్వరూపావాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తేదీన బండ్లమూడి హైస్కూల్లో అథ్లెటిక్స్, పదో తేదీన చీమకుర్తి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఆటల పోటీలను అండర్-14,17 విభాగాల్లో బాలుర,బాలికల కేటగిరిలో జరపనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

21 నుంచి వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ

ఒంగోలు నగరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రూడ్ సెట్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ నుంచి ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతకు ఈ శిక్షణ ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం ఉంటుందదని తెలిపారు. ఇతర వివరాలకు 8309915577 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

గాజాపై దాడులను నిలిపివేయాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడులను నిలిపివేసే విధంగా చర్యలు తీసుకోవాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్యభవన్‌లో మంగళవారం సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ, సీ పీఎం(ఎల్) సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాజా ప్రజలకు సంఘీభావంగా ఈనెల 21న నగరంలో శాంతి ప్రదర్శన నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో ఎస్‌కే.మాబు, ఎంఎల్.నారాయణ, ఎంఎస్.సాయి, ఆర్.మోహన్, జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, పరిటాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులను పంపిణీ చేయాలి

ఎర్రగొండపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ రేషన్ కార్డులను కార్డుదారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ మంజూనాథరెడ్డి వీఆర్వోలకు సూచించారు. మంగళవారం కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయం పరిధిలోని వీఆర్వోలకు ఈ కార్డులను అందజేశారు. డీటీ యూ విజయభాస్కర్, ఆర్ఐ సర్దార్ పాల్గొన్నారు.

మార్జిన్లలో కంప చెట్లు తొలగించండి

రాచర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల నుంచి పలుగుంటిపల్లి బస్టాండ్ వరకు ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్లలో చిల్ల కంపచెట్లు తొలగించాలని టీడీపీ మండల నాయకుడు పేర్ల సుధీర్ కుమార్‌రెడ్డి మండల అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఎంపీడీవో వెంకటరామిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. జాతీయ రహదారిపై తిరిగే వాహనాలకు చిల్లకంప ఇబ్బందికరంగా ఉందని, ప్రమాదాలు జరగకుండా కంపను తొలగించాలన్నారు. రోడ్డు పక్క స్థలం శుభ్రం చేస్తే వాకింగ్‌కు అనుకూలంగా ఉంటుందన్నారు.



మిరప పొలంలో నిలిచిన వాన నీరు



జలమయంగా మారిన కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి

దోర్నాలలో వర్షం.. రైతుల్లో హర్షం

- జలమయమైన రహదారులు
- ఊపందుకున్న రబీ సాగు

పెద్ద దోర్నాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : దోర్నాల మండలంలో మంగళవారం మోస్తరు వాన కురిసింది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే రబీ సాగే ఊపందుకోగా మరింత చురుగ్గా సేద్యం పనులు సాగనున్నాయి. సాధారణంగా ఈ ప్రాంతంలో పత్తి తర్వాత మిర్చిపై అధిక మొగ్గు చూపుతారు. వేసవిలో, ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి దాదాపు పూర్తి కావచ్చింది. తొలగించి కొందరు రైతులు మిరప నాటు కోగా మరి కొందరు అపరాలు సాగు చేస్తున్నారు. మినుము, మొక్కజొన్న, ఆముదం, శనగ, ఉలవ, జొన్న, అలసందలు విత్తుకోగా ఇంకా కొన్ని భూములు పదును సరిపోక విత్తలేదు. సాగుకు సిద్ధంగా ఉన్నాయి.మిరప మాత్రం నెల నుంచి దశలవారీగా నాట్లు వేస్తున్నారు. ఇటీవల గత వారం రోజులుగా ఎండలు మండిపోతూ ఉష్ణోగ్రతలు కూడా పెరిగి మిరప మొక్కలు ఎండుతున్న సమయంలో కురిసిన వాన రైతుల్లో ఆనందాన్నిచ్చింది. ఇంకా విత్తాలసిన భూములకు తగిన తేమ ఇచ్చిందని రైతులు చెప్తున్నారు. మరోపక్క గ్రామాల్లో మురుగు కాలువలు లేకపోవడంతో అంతర్గత రహదారులపై వాన నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఐనముక్కల వద్ద కర్నూలు - గుంటూరు జాతీయ రహ దారిపై నీరు మోకాలు లోతు నిలవడం వాహనదారులను కలవరపెడుతోంది.



పెద్దనాగులవరంలో మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మ్యాజిక్ డ్రెయిన్‌తో పారిశుధ్యం మెరుగు

మార్కాపురం రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మ్యాజిక్ డ్రెయిన్‌ల నిర్మాణంతో గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడుతుందని ఎంపీడీవో బాల చెన్నయ్య తెలిపారు. మండలంలోని పెద్దనాగులవరం గ్రామంలో జరుగుతున్న మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణ పనులను ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. గ్రామంలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఇజియస్ ఏపీఓ నాగరాజు, ఇసి కిషోర్‌కుమార్, పియస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా స్థానిక న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. మంగళవారం గిద్దలూరు కోర్టులో కోర్టు ఆవరణలో నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగ శేషశైనారెడ్డి, తిరుమలప్రసాద్ మాట్లాడుతూ జరిగిన దాడికి నిరసనగా తాము విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మృతదేహాలకు నివాళులర్పిస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెద్దారవీడు మండలం కొత్తపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబ సభ్యులను టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మంగళవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో దోర్నాల మండలం రామచంద్రకోట గ్రామానికి చెందిన ఇరువురు బొమ్మనబోయిన కొండలరాజు, ధనంకుల లక్ష్మయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. మార్కాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం ఉన్న మృతదేహాలను ఎరిక్షన్‌బాబు సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం అండగా ఉంటుదని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ మాబు, యోహాను, దేవయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు సాజియా

పొదిలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పొదిలి పట్టణంలో ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థిని ఎస్‌కే సాజియా జిల్లా స్థాయిలో ఒంగోలులో జరిగిన తైక్వాండో పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని కె.రోజారాణి మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం ఒంగోలులో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో అండర్-14 విభాగంలో మా పాఠశాల విద్యార్థిని సాజియా సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈసందర్భంగా విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన తైక్వాండో మాస్టర్ చిన్నరాజును, విద్యార్థిని సాజియాను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన తురిమెళ్ల విద్యార్థి



కంభం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలో ఈనెల 7వ తేదీ జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో మండలంలోని తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ ఇంటర్ విద్యార్థి టీ మహేష్ ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జీ సోని మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ హెచ్‌ఈసీ విద్యార్థి టీ మహేష్ డిస్కస్‌త్రోలో ద్వితీయ బహుమతి, 800 మీటర్ల పరుగుపందెంలో తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ లేకున్నప్పటికీ విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది ఎంతో ప్రోత్సహిస్తున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన మహేష్ రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్, సిబ్బంది ఆకాంక్షించారు.

నలుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ సురేష్ తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన నలుగురు ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మరో నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ సురేష్ హెచ్చరించారు.

మహిళపై దాడి కేసులో ఇద్దరు అరెస్ట్

మార్కాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థలం దురాక్రమణ విషయంలో మహిళపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులను టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు.. పట్టణానికి చెందిన గోపాలుని లక్ష్మీభవానికి బాపూజీ కాలనీలో ఇంటి స్థలం ఉంది. ఆ స్థలాన్ని కొట్టేయాలని పట్టణానికి చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్, కందుకూరి శంకరాచారిలు పన్నాగం పన్నారు. ఈ క్రమంలో స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిని లక్ష్మీభవాని అడ్డుకుంది. దీంతో రెహమాన్, శంకరాచారి ఆమెపై దాడిచేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి ఏజేఎఫ్‌సీఎమ్ కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి రిమాండ్ విధించారు.

జూదరుల అరెస్టు

రాచర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలుగుంటిపల్లి గ్రామ పొలాల్లో పేకటాడుతున్న వారిని అరెస్ట్ చేశామని ఎస్సై వీ కోటేశ్వరరావు తెలిపారు. పొలాల్లో పేకాట శిబిరంపై దాడి చేసి, ఆరుగురుని అరెస్టు చేశామని, వారి వద్ద నుంచి రూ.13,450 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని లోకానికి చాటిన మహా పురుషుడు వాల్మీకి అని టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. వాల్మీకి జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్యయాదవ్, ఉపసర్పంచ్ కడియం శేషగిరి, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, ముండ్ల రంగనాయకులు, శేషాద్రి, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

రాచర్ల : సంస్కృత సాహిత్యంలో ఆదికవి, రామాయణ మహాకావ్యాన్ని లిఖించిన జ్ఞాన నిధి వాల్మీకి మహర్షి అని గిద్దలూరు తెలుగుదేశం సీనియర్ నాయకులు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రాచర్ల సచివాలయంలో మంగళవారం ఆయన వాల్మీకి జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. వెంకట రామిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్, డీటీ స్వాతి, ఎంఈవోలు వీ గిరిధర్ శర్మ, షేక్ మొయినుద్దీన్, కార్యదర్శి ఎంవి నాయక్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కె యోగానంద్, నాయకులు జి జీవనేశ్వర్ రెడ్డి, ఏ శ్రీనివాసరెడ్డి, ఎస్ శ్రీనివాసులు, పి సుధీర్ కుమార్ రెడ్డి, డీ కాశిరెడ్డి, ఎం రాజశేఖర్ రెడ్డి, బి పుల్లారెడ్డి, డి సయ్యద్ మియా, బీ రామకృష్ణ, వై లక్ష్మీరెడ్డి, ఎస్.వెంకటపతి, ఎస్ నరసింహులు పాల్గొన్నారు.

గిద్దలూరు, పట్టణంలోని శాఖ గ్రంథాల యం ఆవరణలో వాల్మీకి మహర్షి జయం తి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. వాల్మీకి జీవిత చరిత్ర గురించి, ఆయన రచించిన రామాయణం గురించి పలువురు వివరించారు. ఈకార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కిశోర్, కార్యదర్శి ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు. కాగా కేఎస్‌పల్లెలో, ముండ్లపాడులో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కెఎస్‌పల్లిలో వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

ఎర్రగొండపాలెం రూరల్ : రామాయణాన్ని రచించి మహర్షిగా ఖ్యాతి ఘడించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి అని ఎస్ఐ పీ చౌడయ్య అన్నారు. మంగళవారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆర్అండ్‌బీ కార్యాలయ ఆవరణలో బీసీ సంక్షేమ సంఘం వాల్మీకి సేవా సంఘం నాయకులు బంగ్లా సుబ్బయ్య ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగ నిర్వహించారు. కార్యక్రమంలో దేవన్ల శ్రీనివాస్, కృష్ణ, తిరుమలయ్య, సింగ ప్రసాద్, పి బ్రహ్మయ్య, వెంకటయ్య గౌడ్, ఎలక సుబ్బారావు, ఎం ఆంజనేయులు, బి వెంకటేశ్వర్లు, రాజేష్ పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న పాఠకులు



వైపాలెంలో మాట్లాడుతున్న ఎస్ఐ

పీఎంపీల సేవలు వెలకట్టలేనివి

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉషారాణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉషారాణి

మార్కాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మారుమూలన ఉన్న గ్రామీణ ప్రాంతాలకు కూడా వెళ్లి ప్రజలకు వైద్య సేవలందించే పీఎంపీల సేవలు వెలకట్టలేనివని మార్కాపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉషారాణి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ప్రైమరీ మెడికల్ ప్రొవైడర్స్ (పీఎంపీ)ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ ఆరోగ్య హాస్పిటల్, శ్రీశ్రీనివాస 4డీ స్కానింగ్ సెంటర్‌లు వైద్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఉషారాణి మాట్లాడుతూ రిమోట్ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునేది పీఎంపీలే అన్నారు. వారి ద్వారానే పలు వ్యాధుల ప్రభావంతో ఎలా ఉందో తెలుస్తుందన్నారు. పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. మందులు అందజేయడంలో కూడా విచక్షణతో వ్యవహరించాలని సూచించారు. డాక్టర్లు కల్యాణ్‌కుమార్‌రెడ్డి, ప్రసన్నాంజలి, మక్బూల్ బాషా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నపాటి జబ్బులకు ఎక్కువ డోస్ కలిగిన మందులు ఇవ్వకూడదన్నారు. పలు రకాలైన జబ్బులను ఏ విధంగా గుర్తించాలి, వారికి ప్రాథమిక వైద్యం ఎలా అందించాలో వివరించారు. కార్యక్రమంలో పీఎంపీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ షేక్ మౌళాలి, ప్రధాన కార్యదర్శి ఐవీ సుబ్బారావు, డివిజన్‌లోని అన్ని మండలాలకు చెందిన పీఎంపీలు, ఆర్ఎమ్‌పీలు పాల్గొన్నారు.

వన్యప్రాణుల ప్రాముఖ్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రేంజ్ ఆఫీసర్ నరసింహారావు

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల ప్రాముఖ్యత.. వాటిని కాపాడాల్సిన బాధ్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ డీ శివశంకర్ అన్నారు. వన్యప్రాణుల వారోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి కొలుకుల గ్రామంలో కడప జిల్లా నుంచి వచ్చిన కళాజాతా బృందం వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఎర్రగొండపాలెం రేంజర్ ఏ ప్రసన్న జ్యోతి ఆధ్వర్యంలో అటవీ సంపద, వన్యప్రాణులు, జంతు సంరక్షణ తదితర వాటిపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు అవగాహన

గిద్దలూరు : వన్యప్రాణి వారోత్సవాలలో భాగంగా మండలంలోని దిగువమెట్టలో గల వన విహార్‌లో వివిధ అంశాలపై విద్యార్థులకు అటవీశాఖ అధ్యక్షుడు అవగాహన కల్పించారు. అడవులు - ఉపయోగాలు, అడవుల్లో ఉండే వన్యప్రాణులు, వాటి రక్షణ, పర్యావరణ సమతుల్యానికి అడవులు, వన్యప్రాణులు వాటివల్ల కలిగే ఉపయోగాలపై ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఎస్.వీ నరసింహారావు అవగాహన కల్పించారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

పొదిలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పోలీసులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్‌స్టాండ్, పార్శిల్ పాయింట్‌తోపాటు బెస్తపాలెంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వేమన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. గంజాయి, మత్తు పదార్థాల నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరనియంత్రణ విషయంలో ఎటువంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

నల్లబర్లీ పొగాకు సాగు చేయొద్దు!

కురిచేడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు సాగు చేయకుండా ప్రభుత్వం జీవో జారీ చేసిందని తహసీల్దార్ రజనీకుమారి తెలిపారు. రైతులు నల్లబర్లీ పొగాకు సాగు చేయవద్దని సూచించారు. మండలంలోని పొగాకు నర్సరీలను టాస్క్‌ఫోర్సు కమిటీ మంగళవారం పరిశీలించారు. రైతులు అనుమతి పత్రాలు తెస్తేనే నర్సరీ యజమానులు నారు ఇవ్వాలని సూచించారు. పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సంపత్‌కుమార్ సూచించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్

దొనకొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ తపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం నుంచి ఈనెల 14 వరకు దొనకొండ పోస్టాఫీస్‌లో ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పోస్టుమాస్టర్ పఠాన్ అర్షద్‌ఖాన్ తెలిపారు. ఈసందర్భంగా ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఈకేవైసీ చేసుకుంటేనే ఉపాధి పనులు

దొనకొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు తమ ఆధార్ కార్డులను జాబ్‌కార్డుతో తప్పనిసరిగా ఈకెవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో వసంతరావునాయక్ తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాల్లో ఉపాధి సిబ్బంది వద్ద ఈప్రక్రియ చేయించుకోవాలన్నారు. నిర్ణీత సమయానికి ఈప్రక్రియ చేయించుకోనివారికి పనికల్పించే అవకాశం లేదన్నారు. మండలంలో జాబ్‌కార్డ్ కల్గిన ఉపాధి కూలీలందరూ ఈకెవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో సూచించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పామూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకుడు యారవ శ్రీను అన్నారు. మంగళవారం దూబగుంటలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా, నానో యూరియా, డీఏపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దైండే శివశంకర్, ఎం.రాజేంద్ర, కందుల శ్రీను, పి.వెంకట్రావు, ఉడుముల ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జున, జె.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.





కనిగిరి అభివృద్ధే లక్ష్యం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): డిజిటల్ టెక్నాలజీ దిశగా కనిగిరి మున్సిపాల్టీ అభివృద్ధి జరగాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ గఫార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రధానంగా వార్డుల పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగింది. 20 వార్డుల నుంచి 28 వార్డులుగా పునర్విభజన చేస్తూ అజెండాలోని ముఖ్యాంశంగా చేర్చటం, వార్డుల వివరాలు, ప్రదేశాలు, ప్రాంతాలపై వీడియో ద్వారా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సువర్ణకుమార్ కౌన్సిలర్లకు వివరించారు. వాటిలో అభ్యంతరాలు, సూచనలు


రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డు గ్రహీత సుశీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

తెలియజేయాల్సిందిగా కోరటంతో కౌన్సిలర్లందరూ మూజువాణి ద్వారా ఆమోదం తెలిపారు. అనంతరం పట్టణాభివృద్ధికి జరగాల్సిన పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలు, నీటి సరఫరా, పారిశుధ్యంపై రూ.5.33 కోట్ల పనులకు 57 అంశాలపై చర్చ జరిగింది.

ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పట్టణంలో మురుగు కాల్వలు, పారిశుధ్య పనుల పేరుతో గతంలో రూ.30 లక్షలు ఎలా ఖర్చు చేశారో వివరాలు చెప్పాలని ఏఈ అంజిరెడ్డిని నిలదీశారు. 30 లక్షలతో మున్సిపాల్టీ మొత్తం పారిశుధ్య సమస్య లేకుండా చేయవచ్చని పేపర్లలోనే పనులు చేసినట్లు ఉంటే, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని అసహనం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు గత మున్సిపల్ కమిషనర్ ఉన్నప్పుడు పనులు చేపట్టారని తెలపటంతో వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గత ప్రభుత్వంలో దొరువు అభివృద్ధి పేరుతో మున్సిపాల్టీ సొమ్ము రూ.46 లక్షలు దుర్వినియోగం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. సంబంధిత కాంట్రాక్టు రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఈవిధంగా చేసినట్లు వివరించారు. సంబంధిత కాంట్రాక్టు సంస్థపై విజిలెన్స్‌శాఖకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కొండపైన శివాలయంకు సిమెంటు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కౌన్సిలర్ సత్యవతి మాట్లాడుతూ లాడేసాహెబ్ వీధి మలుపు వద్ద ఆటోలు రోడ్డుకు అడ్డంగా నిలిపివేసి మహిళలతో ఇబ్బందికరంగా ప్రవర్తిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఈసమస్యను పరిష్కరించాలని, లేకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కమిషనర్‌కు ఆదేశించారు.


మున్సిపల్ సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పట్టణంలో ఒక్కో సచివాలయానికి ఒక్కో విద్యుత్ ట్రాలీ ఆటోను ఏర్పాటుచేసేందుకు సీఎస్ఆర్ ప్రోగ్రాం కింద ఎంతవరకు అవకాశం ఉందని మున్సిపల్‌శాఖ సీఎస్‌తో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఫోన్‌లో మాట్లాడారు. ఆదిశగా నివేదిక ఇవ్వాలని అధికారులను కోరారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు మున్సిపాల్టీకి అవసరమైన పనులు, చేపట్టాల్సిన అభివృద్ధిపై నివేదిక కోరితే ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారని టీపీవో సువర్ణకుమార్ తీరును ఎమ్మెల్యే తప్పుపట్టారు. నాగులుచెరువు అభివృద్ధికి రూ.ఒక కోటి మంజూరు కానున్నట్లు చెప్పారు. పట్టణంలో పలుచోట్ల వీధిలైట్లు వెలగటం లేదని, వెంటనే కొత్తవి అమర్చాలని అధికారులను ఆదేశించారు. కొండ వాగు, వంకల ఆక్రమణలను గుర్తించి నోటీసులు జారీ చేయాలన్నారు. కనిగిరి మున్సిపాల్టీకి స్వచ్ఛ భారత్ అవార్డు రావటం శుభపరిణామమన్నారు. అందుకు చైర్మన్‌ను, రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైన కేతినేని సుశీలను సన్మానించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, ఏఈ అంజిరెడ్డి, టీపీఎస్ సువర్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో పోలీసుల తనిఖీలు

దర్శి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో మంగళవారం సాయంత్రం పోలీసులు ముమ్మర తనిఖీలు చేశారు. సీఐ వై.రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎం.మురళీ డాగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి ఆర్టీసీ బస్టాండ్, గడియారస్తంభం సెంటర్‌తో పాటు పలువీధులు, వ్యాపార సముదాయాల్లో తనిఖీలు చేశారు. ఇటీవల కాలంలో ఇతర ప్రాంతాల నుంచి మాదకద్రవ్యాలు సరఫరా అవుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ ఎవరైన మాదకద్రవ్యాల రవాణాకు, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడనుంచైనా మాదక ద్రవ్యాలు రవాణా అవుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే తమకు తెలపాలని కోరారు.



దర్శి ఆర్టీసీ బస్టాండ్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ప్రయోజనం

తాళ్లూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ఎంపీడీవో పి.అజిత అన్నారు. సూపర్ సిక్స్ -సూపర్ సేవింగ్స్‌పై మంగళవారం తాళ్లూరు పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపు విషయాన్ని తల్లిదండ్రులకు వివరించి కొనుగోలు సమయంలో మోసపోకుండా చూడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో జి.సుబ్బయ్య, డిప్యూటీ ఎంపీడీవో నాగమల్లేశ్వరి, గ్రామ కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

40 మందికి కంటి పరీక్షలు

తాళ్లూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు కంటికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకునేందుకు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయటం వల్ల ఎంతో ఉపయోగకరంగా వుంటుందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు తెలిపారు.ఒంగోలు జిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో మండలపరిషత్‌కార్యాలయం ఆవరణలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. 40మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఎంపీపీ ఐ.శ్రీనివాసరెడ్డి, గ్రామ కార్యదర్శి నాగమల్లేశ్వరి, సచివాలయ సిబ్బంది, జిమ్స్ఆప్తాలమిస్ట్‌నిపుణులుసాయిరాం,రాఘవి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి హాని కలిగిస్తే కఠిన చర్యలు

కనిగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ఇబ్బందులు కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఖాజావలి అన్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రి 10 నుంచి 6 గంటల వరకు డీజే సౌండ్ స్పీకర్‌లు, లౌడ్ స్పీకర్లు వినియోగించరాదన్నారు. తప్పనిసరిగా అవసరమైనవారు డీఎస్పీ నుంచి వ్రాతపూర్వక అనుమతి తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986, శబ్ద కాలుష్యం నియంత్రణ, నియమాలు - 2000 చట్టం అనుసరించి విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ టి.శ్రీరాం పాల్గొన్నారు.

ఈపంట నమోదు వివరాల పరిశీలన

తాళ్లూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం గ్రామాల్లో ఈక్రాప్ పంట నమోదు సూపర్ చెక్‌ను వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు మంగళవారం పరిశీలించారు. ఈపంట నమోదు వివరాలు, వర్షాధారితం, బోరు వంటి వివరాలు సూపర్ చెక్ నిర్వహించి వివరాలు రాబట్టారు. పొరపాటున పంట వివరాలు, విస్తీర్ణాలు, రైతు వివరాలు తప్పుగా నమోదయితే సరిచేయటం వీలు కాదన్నారు. వీఏఏలు బాధ్యతగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన రైళ్లు

» తిరుగు ప్రయాణంలో తిప్పలు

దొనకొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల అనంతరం స్వగ్రామాల నుంచి తిరుగు ప్రయాణంలో తిప్పలు పడుతున్నారు. గత రెండు రోజులుగా ఉదయం నుంచి గుంటూరు వైపు వెళ్లే అన్ని రైళ్లు కిక్కిరిసి వెళుతున్నాయి. దొనకొండ నుంచి రోడ్డుమార్గాన బస్ సౌకర్యం లేకపోవటంతో రైలు ప్రయాణం తప్పనిసరి కావటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పాసింజర్ రైళ్లు లేకపోవటంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జనరల్ కంపార్ట్‌మెంట్‌లు తక్కువగా ఉండటంతో పడరానిపాట్లు పడుతున్నారు. కొన్ని రైళ్లల్లో ఎక్కేందుకు వీలులేకపోవటంతో వృద్ధులు, చిన్నారులు ప్రయాణాలను వాయిదా వేసుకొని మరుసటిరోజు బయలుదేరి వెళ్లిన సంఘటనలు సోమ, మంగళవారాల్లో చోటుచేసుకున్నాయి.


దొనకొండ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కేందుకు గుంపులుగా ఉన్న ప్రయాణికులు



ఘనంగా వాల్మీకి జయంతి

పామూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రామాయణ మహాకావ్యాన్ని లిఖించి జగతికి అందించి అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఆదికవి వాల్మీకి మహర్షి అని జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుర్తినేని ప్రసాద్ అన్నారు. స్థానిక డీవీ పార్కులో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని మంగళవారం వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రామాయణ గ్రంథంలో కుటుంబం, అన్నదమ్ములు, భార్యభర్తల మధ్య ఎలాంటి ప్రేమాభిమానాలు ఉండాలో వాల్మీకి చక్కగా వివరించారన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ చల్లా సుబ్బారావు, ఎన్.నాగేశ్వరరావు, బొమ్మన శ్రీనివాసులు, ఎస్.రమణయ్య, వీరాస్వామి, ఎస్.గురవయ్య, యాటా రాఘవులు, పిక్కిలి మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండలంలోని పూరిమెట్ల గ్రామంలో మంగళవారం రాత్రి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా దర్శి మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ కోడిగ మస్తాన్‌రావు మాట్లాడుతూ వాల్మీకి జీవిత చరిత్రను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చింతపల్లి వెంకటేశ్వరరావు, ఎన్.నారాయణ, చొప్పరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి: వాల్మీకి మహర్షి జీవితం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని బీసీ నాయకుడు డి.శివకాశయ్య అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని మంగళవారం గార్లపేట రోడ్డులోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామరాజు, వెంకట సుబ్బారావు, వల్లెపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుల వివరాలు తెలియజేయాలి

ముండ్లమూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో పనుల కోసం వచ్చిన వలస కార్మికుల వివరాలను యజమానులు స్థానిక పోలీసు స్టేషన్‌లో అందజేయాలని ఎస్ఐ కె.కమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వలస కార్మికుల ఆధారాలు పోలీసు స్టేషన్‌లో ఇవ్వటంవల్ల అనుకోకుండా ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు వెంటనే వారి కుటుంబ సభ్యులకు తెలియజేయవచ్చునని చెప్పారు. ఈసందర్భంగా సింగనపాలెం, చంద్రగిరి, ముండ్లమూరు, పసుపుగల్లు, పోలవరం, శంకరాపురంతో పాటు వివిధ గ్రామాల్లో ఉన్న వలస కార్మికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పి.హనుమంతరావు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణదాసు, సిబ్బంది మహేష్, కాశిరాజు, తుపాకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పీసీపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో జీవీ కృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని గుదేవారిపాలెంలోని చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమనివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుధ్య కార్మికులు రోజూ ఇళ్ల నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిపై దాడి హేయం

దొనకొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై ఒక న్యాయవాది బూటుతో దాడిచేయటాన్ని నిరసిస్తూ మంగళవారం దొనకొండలో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మార్పీఎస్ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు గుంటు పోలయ్య మాదిగ, రైల్వే పింఛనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బీజే జయరాజ్‌ల నేతృత్వంలో ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ రైల్వేస్టేషన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు మేడికొండ ధర్మారావు, వి.ఆశీర్వాదం, ఎన్.రాములు, జె .నాగయ్య, విజయానందం, కె.కరుణాకర్, సాల్మన్, పాపారావు, పాస్టర్ల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూతో బాలిక మృతి?

కురిచేడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నమశ్శివాయపురం గ్రామంలో డెంగ్యూతో మంగళవారం బాలిక మృతి చెందింది. కేసనపల్లి మధురవాణి (15) స్థానిక ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. గత రెండు రోజుల నుంచి బాలిక జ్వరంతో బాధపడుతుంది. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లగా జ్వరం ఎక్కువగా ఉండటంతో బాలికను వినుకొండకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. బాలిక రక్త పరీక్షల రిపోర్టు ప్రకారం డెంగ్యూ వ్యాధి సోకిందని తెలుస్తుంది. బాలిక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

కాంగ్రెస్ సంతకాల సేకరణ

కురిచేడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో అవకతవకలను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కైపు వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కురిచేడులో సంతకాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధికి మద్దతుగా వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశానుసారం దర్శి నియోజకవర్గంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ చిన్న మీరావలి, కాటం రమణారెడ్డి, ఇరిగినేని వెంకటనరసయ్య, షేక్ పెద్ద ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలి

పామూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలని మండలంలోని బొట్లగూడూరు పంచాయతీ కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన ఎస్సీఎస్టీ, బీసీ లకు చెందినవారు మంగళవారం తహసీల్దార్ ఆర్.వాసుదేవరావుకు వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో రికార్డులను పరిశీలించి భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూములు దక్కేలా చూడాలని కోరారు. రికార్డులను పరిశీలించి తగిన న్యాయం చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

విద్యార్థులు తప్పక వ్యాయామం చేయాలి

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తప్పకుండా వ్యాయామం చేయాలని ఎంఈవో ప్రసాదరావు అన్నారు. సీఎస్‌పురం మండల కేంద్రంలోని కేజీబీవీలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజు వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ రేష్మా, తదితరులు పాల్గొన్నారు.

పామూరులో భారీ వర్షం

పామూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం గంటపాటు భారీ వర్షం కురిసింది. రోడ్లపైకి వర్షపు నీరు చేరింది. గత 15 రోజుల నుండి ఎండ తీవ్రత, ఉక్కపోతతో మండల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈవర్షంతో ప్రజలు ఉపశమనం చెందారు.

12న గంధమహోత్సవం

పామూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎస్‌పురం రోడ్డులోగల శ్రీహజరత్ మహబూబ్‌సుబాని స్వామి వారి దర్గా 49వ గంధ మహోత్సవం ఈనెల 12న జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకుసంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హజీగౌస్, మహబూబ్‌పీరా, కోడిగుంపల నాయబ్, గౌస్‌బాషా, గయాజ్, పులి నాయబ్, మీరామొహిద్దీన్, పత్తు మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత

పీసీపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మండలంలోని వెంగళాయపల్లి గ్రామ సర్పంచ్ కరణం తిరుపతయ్య అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఇటీవల ప్రధానోపాధ్యాయుడు స్వర్ణ రమణయ్య కోరిక మేరకు పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు అందిస్తానని చెప్పిన ఆయన వాటికి సంబంధించి పాఠశాల ఆవరణలోని పిచ్చిచెట్లను తొలగించి గ్రౌండ్ చదును చేసే పనులు చేపట్టారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణయ్య, చెన్నుపాటి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్‌కు కనిగిరి వాసి ఎంపిక

కనిగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి జూజిట్సు మార్షల్ ఆర్ట్స్ పోటీలకు సాంకేతిక అధికారిగా కనిగిరికి చెందిన యాసిన్ ఎంపికయ్యారు. ఈనెల 9 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్‌లోని సహారా న్పూర్‌లోని బీఆర్ అంబేడ్కర్ స్పోర్ట్స్ స్టేడియంలో జూజిట్స్ మార్షల్ ఆర్ట్స్ పోటీలు జరుగుతున్నాయి. ఈపోటీలకు సాంకేతిక అధికారిగా, క్రమశిక్షణా సంఘం సభ్యుడిగా యాసిన్ ఎంపికకావటం పట్ల మిత్రులు, శ్రేయోభి లాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





శ్రీఆంజనేయం

1 ఆంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ 1 శింగరకొండకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు

అద్దంకి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అశ్వయుజ పౌర్ణమి సందర్భంగా మంగళవారం శింగరకొండలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో తమలపాకుల పూజ వైభవంగా జరిగింది. స్వామివారికి లక్ష తమలపాకులతో ప్రత్యేకంగా పూజ చేశారు. ప్రాతఃకాలంలో సుప్రభాతం, గోపూజ, బిందెతీర్థం అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు 11 ఆవృత్తములుగా లక్ష తమలపాకుల పూజ చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలుగా మార్టూరు మండలం వలపర్లకు చెందిన తవ్వా సురేష్‌బాబు, పద్మావతి దంపతులు పాల్గొన్నారు. మంగళవారం, పౌర్ణమి కలిసి రావడంతో భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు.

అద్దంకి ఆర్టీసీ.. రికార్డు

రోజుకు రూ.19.10 లక్షల ఆదాయం

అద్దంకి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ఆర్టీసీ డిపో రికార్డు సృష్టించింది. దసరా పండుగ తర్వాత స్వగ్రామాలకు వచ్చిన ప్రయాణికులు తిరుగు ప్రయాణంతో సోమవారం రోజంతా బస్సులన్నీ కిటకిటలాడాయి. అద్దంకి డిపోలో మొత్తం 64 బస్సులు ఉండగా సోమవారం రూ.19,10,001 ఆదాయం వచ్చిందని ఇన్‌చార్జి డీఎం మహబూబి తెలిపారు. మహిళాశక్తి పథకం ప్రారంభానికి ముందు అద్దంకి డిపోకు రోజుకు సరాసరిన రూ.10 లక్షల లోపుగానే ఆదాయం వచ్చేది. మహిళా శక్తి పథకం ప్రారంభం తర్వాత 15 సార్లు రూ.13 లక్షలకుపైగా ఆదాయం వచ్చింది. అయితే సోమవారం మాత్రం రికార్డు స్థాయిలో రూ.19.10 లక్షల ఆదాయం వచ్చింది. ఓఆర్ 127 శాతం కాగా ఈపీకే రూ.70.40గా ఉంది. మహిళాశక్తికి ముందు నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీ ప్రస్తుతం లాభాలబాట పట్టింది.



అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు

కొనుగోళ్లపై కినుక

ముగింపు దశకొచ్చిన బర్లీ సేకరణ

1 ప్రక్రియపై రైతుల మిశ్రమ స్పందన 1 రైతుల వద్ద ఇంకా పెద్దఎత్తున పొగాకు నిల్వలు 1 రూ.273 కోట్లకు రూ.143 కోట్ల మేర కొనుగోలు చేసిన మార్క్‌ఫెడ్



బాపట్లలోని వేర్‌హౌసింగ్ గోడౌన్ వద్ద పొగాకు బేళ్లతో నిలిచి ఉన్న ట్రాక్టర్లు (ఫైల్ ఫొటో)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తాం.. ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదు.. అని నైరశ్యంలో మునిగిపోయిన బర్లీ పొగాకు రైతులకు గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ ప్రకారమే గతంలో ఎన్నడూ లేనట్లుగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేపట్టింది. ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయించింది. ప్రభుత్వం పొగాకు కొనుగోళ్లపై తీసుకున్న నిర్ణయాలపై బాపట్ల జిల్లాతో పాటు పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల బర్లీ పొగాకు రైతులు అప్పట్లో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మూడు నెలలు కొనుగోళ్ల ప్రక్రియ సాగినా.. విడతల వారీగా రైతుల ఖాతాలకు నిధులు జమ అవుతున్నా.. సాగుదారులు పలువురు ఇంకా అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. అధికారుల ప్రణాళిక లేమి వల్లనో లేక ముందస్తు అంచనాలు లేకపోవడం వల్లనో కానీ కొనుగోళ్ల ఘట్టం అనేక ఇబ్బందులకు దారి తీయడమే రైతుల్లో అసంతృప్తికి కారణమని తెలిసింది. సెప్టెంబరు చివరికే కొనుగోళ్లు నిలిపేస్తామని తొలుత మార్క్‌ఫెడ్ ప్రకటించింది. కానీ మరో రెండు వారాలు పొడిగిస్తున్నట్లు అధికారులు నామమాత్రపు ప్రకటన చేశారు తప్పితే ఎక్కడా బర్లీ సేకరిస్తున్న దాఖలాలు లేవు. అయితే ఇప్పటికీ రైతుల వద్ద ఇంకా కనీసంగా 80 వేల క్వింటాళ్ల పొగాకు నిల్వలు ఉన్నాయని క్షేత్రస్థాయి పరిస్థితులు ధ్రువీకరిస్తున్నాయి. మొత్తం రిజిష్టర్ చేసుకున్న రైతుల సంఖ్య 16,734గా ఉండగా అంతిమంగా మార్క్‌ఫెడ్ గణాంకాల ప్రకారం 12,250 మంది

(మిగతా 6లో)

బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి గతంలో ప్రభుత్వం రూ.273 కోట్లు కేటాయించింది. అయితే ఇప్పటి వరకు రూ.143 కోట్ల మేర మాత్రమే కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. మూడు నెలల్లో 2,12,949 క్వింటాళ్లను మార్క్‌ఫెడ్ సేకరించింది. ఇందులో అత్యధికంగా బాపట్ల జిల్లా నుంచి 1,43,356 క్వింటాళ్లను కొనుగోలు చేసింది. గుంటూరు జిల్లాలో 32,729, పల్నాడులో 24,409 క్వింటాళ్లను కొనుగోలు చేసింది. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.98 కోట్లు జమ చేసినట్లు మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. ఇంకా రూ.45 కోట్లు చెల్లించాల్సి ఉంది.

2,12,949 క్వింటాళ్ల సేకరణ..

అక్రమ విద్యుత్ కనెక్షన్ కట్

ఏఎంఆర్ చెక్‌పోస్టు నిర్వాహకులపై కేసులు

ఆంధ్రజ్యోతి కథనంపై ట్రాన్స్‌కో అధికారుల స్పందన

బల్లికురవ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ సీనరేజ్ వసూళ్లకు సంబంధించి ఏఎంఆర్ కంపెనీ చెక్‌పోస్టులను ఏర్పా టు చేసి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండటంపై ట్రాన్స్‌కో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఎంఆర్ బాక్సులకు విద్యుత్ చౌర్యం అంటూ మంగళవారం ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనంపై ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. వీర్లగంగమ్మ దేవాలయం, మల్లాయపాలెం సచివాలయం, బల్లికు రవ నాలుగు రోడ్ల కూడలిల్లోని చెక్‌పోస్టుల విద్యుత్ కనెక్షన్లు కట్ చేశారు. అనంతరం నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరో 9 చోట్ల ఏఎంఆర్ చెక్‌పోస్టులకు విద్యుత్ మీటర్లు పెట్టేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు లెటర్లు ఇచ్చారని, వాటికి మీటర్లు మంజూరు చేస్తామని తెలిపారు.

పరిశీలించకుండానే ఎన్‌వోసీలు

రోడ్లపైన, రోడ్డు మార్జిన్లలో ఏర్పాటు చేస్తున్న ఏఎంఆర్ చెక్ పోస్టులకు విద్యుత్ మీటర్లు అవసరం కాగా వాటికి పంచాయతీ కార్యదర్శులు ఇష్టంవచ్చినట్లుగా ఎన్‌వోసీ లెటర్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడ మీటరు పెడుతున్నారనే అంశాన్ని పరిశీలించకుండానే లెటర్లు ఇస్తున్నారని సమాచారం. రోడ్డు మార్జిన్‌లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాటికి విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఏదైనా ప్రమాదాలు జరిగితే అందుకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ కోసం మెయిన్ లైన్లపైన, ప్రభుత్వ కార్యాలయాల నుంచి విద్యుత్ కోసం వైర్లు ఏర్పాటు చేశారు. అక్రమ విద్యుత్ కనెక్షన్లపై విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మల్లాయపాలెం సచివాలయం వద్ద ఏఎంఆర్ చెక్ పోస్టుబాక్సుకు కట్ చేసిన విద్యుత్ కనెక్షన్

దాడి కేసులో ఇద్దరు అరెస్ట్

మార్కాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థలం దురాక్రమణ విషయంలో మహిళపై దాడి చేసి న ఇద్దరు వ్యక్తులను టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశా రు. టౌన్ ఎస్సై ఎం. సైదు బాబు కథనం మేరకు.. పట్టణానికి చెందిన గోపాలుని లక్ష్మీభవానికి బాపూజీ కాలనీలో ఇంటి స్థలం ఉంది. ఆ స్థలాన్ని కొట్టేయాలని పట్టణానికి చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్, కందుకూరి శంకరాచారిలు పన్నాగం పన్నారు. ఈ క్రమం లో స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిని లక్ష్మీభవాని అడ్డుకుంది. దీంతో రెహమాన్, శంకరాచారి ఆమెపై దాడిచేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. నిందితులను మంగళవారం అరెస్ట్ చేసి ఏజేఎఫ్‌సీఎమ్ కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి రిమాండ్ విధించారు.

సంతకాల సేకరణ

టంగుటూరు (కొండపి), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓట్ చోరీ నినాదంతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆలకూరపాడులో కొండపి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. సేకరించిన సంతకాలను రాష్ట్ర అధ్యక్షురాలికి పంపుతామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బి. శశికుమార్ పాల్గొన్నారు.

సోలార్ సొబగులు..!

పీఎం సూర్యఘర్ పథకాన్ని
సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు
భారీగా సబ్సిడీ ప్రకటించిన ప్రభుత్వం


దర్శిలో సోలార్ విద్యుత్ ఏర్పాటును పరిశీలిస్తున్న ఈశ్వర శ్రీనివాసులు

దర్శి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని దర్శి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రధానంగా గృహ వినియోగదారులు ఈపథకాన్ని వినియోగించుకునేందుకు వీలుగా భారీగా సబ్సిడీ ఇస్తున్నారు. విద్యుత్ కోతల ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను వాడుకునేందుకు సోలార్ విద్యుత్ ఎంతో ఉపయోగపడుతుంది.

దర్శి డివిజన్ పరిధిలో 12వేల దరఖాస్తులు ఇప్పటికే దాఖలయ్యాయి. అందులో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల నుంచి 10వేలు అందాయి. మిగిలినవర్గాల నుంచి రెండువేల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే 850 దరఖాస్తులకు ఆమోదం లభించగా, బ్యాంకుల నుంచి కూడా క్లియరెన్స్ వచ్చింది. ఇప్పటికే సుమారు 400 ఇళ్లకు సోలార్ ప్రాజెక్టును ఏర్పాటుచేశారు. కాలుష్య నివారణకు ఈ పథకం ఎంతో దోహదపడుతుంది.

క్రమేపీ బొగ్గు, క్రూడాయిల్, నీటి వనరులు కొరత తరచూ ఏర్పడుతున్నందున భవిష్యత్తు అవసరాలకు సరిపడా విద్యుత్ ఉత్పత్తి చేయటం కష్టతరమవుతుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం ముందుచూపుతో సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టి వినియోగదారులకు భారీగా సబ్సిడీ అందిస్తోంది.

దరఖాస్తు ఇలా...

సోలార్ విద్యుత్ పథకానికి ఆన్‌లైన్‌లో నేషనల్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వినియోగదారులు నిబంధనల ప్రకారం పత్రాలు సమర్పిస్తే అనుమతి లభిస్తుంది. ఈప్లాంట్ ఏర్పాటుకు బ్యాంకర్లు పూర్తిగా రుణ సహాయం అందిస్తారు. సబ్సిడీ పోను మిగిలినసొమ్ము వాయిదాల పద్ధతిలో చెల్లించే అవకాశం కల్పిస్తారు. ప్రతినెలా చెల్లించే కరెంట్ బిల్లులకు కొంత మొత్తాన్ని కలిపితే ప్రతినెలా కిస్తీ చెల్లించేందుకు సరిపోతుంది. వాయిదాలు పూర్తయిన తర్వాత సోలార్ ప్రాజెక్టు సొంతమవుతుంది. ఆతర్వాత అనేక సంవత్సరాలు ఉచితంగా గృహ అవసరాలకు సరిపడ విద్యుత్ వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. విద్యుత్‌ను ఆదా చేసుకొని మిగిలించినట్లయితే ప్రభుత్వానికి విక్రయించవచ్చు. ఎన్నోరకాల సదుపాయాలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రవేశపెట్టడంతో పట్టణాల్లో ఈప్రాజెక్టును వినియోగించుకునేందుకు అధిక సంఖ్యలో ముందుకు వస్తున్నారు. గ్రామాల్లో ఇప్పుడిప్పుడే ఈపథకం గురించి తెలుసుకుంటున్నారు. 200 యూనిట్లు పైబడి విద్యుత్ వాడుకునే ప్రతిఒక్కరూ ఈ పథకాన్ని ఏర్పాటు చేసుకుంటే ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

- 150 యూనిట్లు వరకు తయారుచేసే 1.2 కిలోవాట్ల ప్లాంట్‌కు రూ.30వేల నుంచి రూ.60 వేల వరకు సబ్సిడీ ఇస్తుంది.
- 300 యూనిట్లు విద్యుత్ తయారుచేసే 2.3 కిలోవాట్ల ప్రాజెక్టుకు రూ.60 వేల నుంచి రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుంది.
- 300కు పైగా విద్యుత్ తయారుచేసే 3 కిలోవాట్ల ప్లాంట్‌కు రూ.78 వేల రాయితీ అందిస్తున్నారు.

పీఎం సూర్యఘర్ పథకం వినియోగించుకునే ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు నూరుశాతం సబ్సిడీ అందిస్తున్నారు. వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించిన తరువాత యూనిట్ మంజూరవుతుంది. ప్రభుత్వం యూనిట్లు మంజూరు చేసిన తరువాత ప్లాంట్ ఏర్పాటు జరుగుతుంది.

అవీఇవీ

వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి


వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, డీపీవో,అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మానవాళికి రామాయణం లాంటి మహత్తరమైన గ్రంథాన్ని అందించిన మహనీయుడు మహర్షి వాల్మీకి అని ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని కలెక్టర్ పీ రాజాబాబు పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను ఒకసారి స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అధికారిణి నిర్మలా జ్యోతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. తడి, పొడిచెత్త నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం సాయంత్రం సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సమావేశంలో పలు శాఖల అధికారులు ఎం.వెంకటేశ్వరరావు, చిరంజీవి, బాలశంకరరావు, అశోక్ పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేయాలి

రాజముద్రతో తయారు చేసిన పట్టాదారు పాసుపుస్తకాలను పటిష్టంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సీసీఎల్‌ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. కలెక్టర్ పి.రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, సర్వేశాఖ ఏడీ గౌస్‌బాషా పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలతో అభివృద్ధికి శ్రీకారం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మాస్టర్ ప్లాన్‌తో పాటు ఎన్‌టీఆర్ స్మార్ట్ టౌన్ షిప్‌లో వినూత్న ఆలోచనలతో కూడిన చర్యలు తీసుకోనున్నట్లు ఒడా చైర్మన్ షేక్ రియాజ్ పేర్కొన్నారు. ఒంగోలు అర్బన్ డెలప్‌మెంట్ అథారిటీ (ఒడా) సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో జరిగింది. ఈ సందర్భంగా ఉడా వైస్ చైర్మన్, జేసీ ఆర్.గోపాలకృష్ణతో కలిసి పలు శాఖల అధికారులతో కలిసి ఒడా ద్వారా చేపట్టే పలు రకాలప్రాజెక్టులపై చర్చించారు.

25 నాటికి ఈ-పంట నమోదును పూర్తి చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 25వ తేదీనాటికి ఈ-పంట నమోదును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జేసీ గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయం నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ-పంట నమోదుతోపాటు సీసీఆర్ కార్డులు జారీ, మ్యుటేషన్ తప్పులు సరిచేయుట, పట్టా సబ్‌డివిజన్, రెవెన్యూ శాఖ ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాలపై తహసీల్దార్లకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఆయా కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు మాధురి, పద్మశ్రీ, వరలక్ష్మి, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 బాలబాలికల జిల్లా హాకీ జట్ల ఎంపిక

సంతనూతలపాడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్-19 బాలి, బాలికల జిల్లా హాకీ జట్ల ఎంపిక జరిగింది. ప్రతిభ చూపిన వారిని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జరగబోయే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లలో పాల్గొంటారని అండర్-19 జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి చింపారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవికుమార్, శ్రీనివాసరావు, హెచ్‌ఎం నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, పీడీలు వనజ, కౌసల్య, కోటిరెడ్డి, సౌజన్య, టి.రవికుమార్ పాల్గొన్నారు.

హైవే నిర్మాణంతో దెబ్బతిన్న రోడ్డుకు మోక్షం

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
- యుద్ధప్రాతిపదికన రోడ్డు నిర్మాణం


కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

పర్చూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు - పిడుగురాళ్ల 167(ఏ) రోడ్డు నిర్మాణంలో భాగంగా పర్చూరు మండలం చెన్నుబొట్ల ఆగ్రహారం గ్రామ సమీపంలో దెబ్బతిన్న ధ్వంసమైన రోడ్డుకు మోక్షం లభించింది. రోడ్డు దెబ్బతినటంతో గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యపై హైవే అధికారులకు తెలియజేసినా, పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ తరుణంలో గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి పలుమార్లు నిరసన కార్యక్రమాలు సైతం చేపట్టారు. కాలనీవాసులు, గ్రామస్థుల సమస్యపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడిన నేపథ్యంలో హైవే అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలతో కంది, జొన్న కళకళ

కొండపి, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): గడచిన మూడు రోజులుగా కొండపి ప్రాంతంలో ప్రతి రోజూ ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో ప్రస్తుతం కొండపి, జరుగుమల్లి, మర్రిపూడి మండలాల్లోని ఎర్ర నేలల్లో సాగు చేసిన దాదాపు వెయ్యి ఎకరాలకుపైగా కంది, అంతర పంటగా, వేరుగా సాగు చేసిన మేత జొన్న పైర్లు కళకళలాడుతున్నాయి. వర్షాలతో ఈ పైర్లకు ఉపయోగమని జరుగుమల్లి వ్యవసాయ అధికారి ఇ. కాశీవిశ్వనాథ్ వివరించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కందికి నష్టం లేదని ఆయన వివరించారు.

కొనుగోళ్లపై కినుక

(5వ పేజీ తరువాయి)

రైతుల నుంచే కొనుగోళు చేశారు. అంటే ఇంకా 4484 మంది రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేయాల్సి ఉంది. వీరు కాకుండా అవగాహన లేక మరెందరో రిజిష్టర్ చేసుకోలేదని సమాచారం. వీరందరి వద్ద పెద్దఎత్తున నిల్వలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వీరందరిలోనూ అయోమయం నెలకొంది. మరో వైపు కేబినెట్ ఆమోదం తెలిపిన నిధులు కేటాయింపులో రూ.130 కోట్లు మిగులు ఉన్నట్లు కనబడుతుండడంతో కొనుగోళ్లు కొనసాగించడంపై ఉన్న అభ్యంతరం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

గోదాములపై అంచనా లేకపోవడం...

బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రారంభమైన దగ్గర నుంచి కూడా వాటిని నిల్వ ఉంచడానికి గోడౌన్ల లభ్యత అధికారులకు సవాల్‌గా మారింది. వీటి విషయంలో ముందస్తు సన్నద్ధత లేకపోవడం కూడా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని రైతులకు గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని గోడౌన్లకు తీసుకువెళ్లే విధంగా షెడ్యూలింగ్ ఇవ్వడం, రవాణా ఖర్చులపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని రైతులు తప్పుబట్టారు. ఇవన్నీ ఒక ఎత్తయితే 20 క్వింటాళ్ల పరిమితి అని ప్రభుత్వం ప్రకటించాక రైతుల సెల్‌ఫోన్లకు పొంతనలేని మెసేజ్‌లు రావడం, వారు తీసుకొచ్చిన పొగాకు బేళ్లను తిరిగి తీసుకువెళ్లడం లాంటివన్నీ కూడా అధికారుల వైఫల్యానికి సాక్ష్యంగా నిలిచాయి. మార్కెటింగ్, వేర్‌హౌసింగ్, ఎఫ్‌సీఐ గోదాములు మొత్తం 56 చోట్ల పొగాకును నిల్వ ఉంచారు. పొగాకు నాణ్యత విషయంలో మార్క్‌ఫెడ్ నియమించుకున్న బయ్యర్లకు జీతాలు చెల్లించే విషయంలో కూడా ఎడతెగని జాప్యం కారణంగా ఇటీవల వారు విధులు కూడా బహిష్కరించారు. కొనుగోళ్ల వాస్తవికతతో పాటు, నిధుల లభ్యత, గోడౌన్ల సాధ్యాసాధ్యాలను ప్రభుత్వానికి వివరించడంలో అధికారుల తప్పిదాల వల్ల రైతుల ఆశలను మార్క్‌ఫెడ్ చేరుకోలేకపోయింది.


అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం

పంగులూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులతో పాటు తల్లులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు నీతిఆయోగ్ టీం పోషణ్ ట్రాకర్ 2.0 సభ్యుడు జోషఫ్ మిరాకిల్ అన్నారు. మండలంలోని రామకూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నీతిఆయోగ్ టీం సభ్యుడు జోషఫ్‌మిరాకిల్ మంగళవారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరోగ్యం, చదువుతో మంచి అలవాట్లు నేర్పించాలన్నారు. సమీపంలోని ఇళ్లకు వెళ్లి తల్లులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సౌకర్యాలు, వైద్యపరీక్షలు, సమావేశాల నిర్వహిస్తున్న తీరుగురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలు, తల్లులు, బలింతలు, గర్భిణులు ప్రభుత్వం సమకూర్చుతున్న పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. పిల్లలకు ఆటపాటలతో కూడిన అభ్యసన ప్రక్రియ చదువుపట్ల ఆసక్తిని పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ పద్మజ, టీచర్ తులసి, పద్మ, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

మార్టూరు, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి మృతిచెందిన ఘటన మార్టూరులోని జనార్దన్ కాలనీలో మంగళవారం చోటుచేసుకొంది. ఈ ఘటనలో కాలనీకి చెందిన దేవరకొండ రాంబాబు(35) మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు కాలనీలో వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్న రాంబాబు విద్యుత్ మరమ్మతులు చేసుకుంటూ, వాటర్ ప్లాంట్‌కు సంబంధించి తీగను లాగుతున్న సమయంలో పైన ఉన్న 11 కేవీ విద్యుత్ త్రీఫేజ్‌కు లైన్‌కు తీగ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో ఆయన ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఆయన కుటుంబం వాటర్ ప్లాంట్‌కు ఆనుకొని ఉన్న మరో గదిలో ఉంటోంది. ఈ ప్రమాదం జరగగానే భార్య మౌనిక నేలపై పడిపోయిన భర్త దగ్గరకు రావడానికి ప్రయత్నించింది. చివరి క్షణంలో రాంబాబు భార్యను దగ్గరకు రావద్దని చేతితో సైగ చేస్తూ చనిపోవడం అందరినీ కదిలించివేసింది. ఏఎస్‌ఐ బాషా ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇదిలా ఉండగా విద్యుత్ ఏఈ కిరణ్‌కుమార్, లైన్‌మెన్ సుబ్బారావులు ఘటనా స్థలానికి వెళ్లి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మార్టూరు డీఈఈ సురేంద్రబాబు సూచనలు మేరకు బాధిత కుటుంబానికి విద్యుత్ శాఖతరఫున సాయం చేసే అవకాశంపై ఉన్నత అధికారులకు నివేదికను పంపిస్తామని కిరణ్ కుమార్ తెలిపారు. రాంబాబుకు భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం


పొగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

కొండపి, అక్టోబరు7 (ఆం ధ్రజ్యోతి): పెదకండ్లగుంట గ్రామంలో పోలేరమ్మ అల య ఆరవ వార్షికోత్సవం మంగళవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం, చీరెలు, గాజులు, పసుపు, కుంకుమలు సమర్పించారు. అర్చకులు బి.హరీష్‌శర్మ, విజయ్‌కుమార్ పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రికి గ్రామంలో అమ్మవారి గ్రా మోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి నీటితో వారు పోసి టెం కాయలు కొట్టి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ తా నికొండ వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు కొల్లా మోహన్‌రావు, కల్లూరి మల్లికా ర్జునరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రెండోసారీ చర్చలు విఫలం

గ్రానైట్ ముడిరాళ్ల రికవరీపైనే
ఫ్యాక్టరీ ఓనర్ల ఆందోళన
దాంతో సంబంధం లేదంటున్న ఏఎంఆర్ సంస్థ
రాయల్టీకి అదనంగా చిల్లిగవ్వ కూడా
చెల్లించేదిలేదని తేల్చిచెప్పిన యజమానులు
సంస్థ దృష్టికి తీసుకెళ్తామన్న
ఏఎంఆర్ ప్రతినిధులు


చర్చల్లో పాల్గొన్న క్వారీ, ఫ్యాక్టరీల యజమానులు, ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు

చీమకుర్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ సీనరేజి వసూలు హక్కులు దక్కించుకున్న ఏఎంఆర్ సంస్థ, గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల మధ్య మంగళవారం రెండోసారి జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఈనెల ఒకటో తేదీ నుంచి మొదలైన గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల సమ్మె ముగింపునకు చేరే పరిస్థితులు కనిపించకపోవటంతో ఫ్యాక్టరీ ఓనర్లలో ఆందోళన పెరిగిపోతోంది. ముఖ్యంగా ఫ్యాక్టరీలను లీజు తీసుకొని నడుపుతున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. లీజు హక్కులు పొందిన ఏఎంఆర్ సంస్థ ప్రభుత్వంతో అగ్రిమెంట్ బు ధవారం కుదుర్చుకుంటే సమస్య కొలిక్కి వస్తుందని ఓనర్లు భావించారు. అగ్రిమెంట్‌కు తుది గడువును ఈనెల 24 వరకూ పొడిగించాలని ఏఎంఆర్ సంస్థ, మైన్స్ డీడీకి వినతి పత్రం అందచేయటం ఫ్యాక్టరీ ఓనర్లను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. నెలాఖరు వరకూ ఫ్యాక్టరీలు మూసివేయాల్సిందేనా...అ దే జరిగితే బ్యాంకు ఈఎంఐలు, కరెంట్ బిల్లు లు, లీజు చెల్లింపులు, జీతాలు అందివ్వటం ఎలా అని ఓనర్లు తలలు పట్టుకుంటున్నారు. మొత్తం 800 ఫ్యాక్టరీల్లో నలభైశాతం వరూ లీజుదారులే ఉండటం గమనార్హం.

రికవరిపైనే పీఠముడి...

రెండోసారి చర్చల్లో ముడిరాళ్లలో రికవరీ శాతం ప్రధాన అంశంగా మారింది. ఒక కట్టర్‌కు రాయల్టీగా ప్రభుత్వానికి డబ్బు చెల్లిస్తే అందుకుప్రతిగా 22 క్యూబిక్ మీటర్ల ముడిరాయిని క్వారీ ఓనర్ల నుంచి కొనుగోలు చేసే అవకాశం లీగల్‌గా ఫ్యాక్టరీ ఓనర్లకు లభిస్తుంది. అలా కొనుగోలు చేసినపుడు ముడిరాయిలో దాదాపు సగానికి సగం వేస్ట్‌గా మిగిలిపోతుంది. అంటే రికవరీ శాతం సగమే ఉంటుంది. ఇప్పటి వరకూ క్వారీ ఓనర్లు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని అదనంగా రాయిని లాట్ల రూపంలో విక్రయిస్తున్నారు. రాయి వేస్ట్ విషయం మైనింగ్ అధికారులకు తెలుసు.. అందుకే అదనంగా ఫ్యాక్టరీ ఓనర్లు కొనుగోలు చేసిన రాళ్లపై పెనాల్టీని విధించేవారు కాదు. ఇలా అవగాహనతో సాగిపోతున్న క్రమంలో ప్రభుత్వం సీనరేజి వసూలును ప్రైవేటు సంస్థకు అప్పచెప్పటంతో సమస్యగా మారింది. రికవరీతో మాకు సంబంధం లేదు కొనుగోలు చేసిన రాళ్లను లెక్కకట్టి పర్మిట్‌కు మించితే పెనాల్టీ వసూలు చేస్తాం లేదా ముందుగానే మాతో ఒప్పందం కుదుర్చుకొని కట్టర్‌కు రూ.30వేలు అదనంగా చెల్లిస్తే మీ పని మీరు చేసుకోవచ్చు అని తేల్చి చెప్పటంతో సమస్యగా మారి సమ్మె వరకూ వెళ్లింది. ఇప్పటి వరకూ ప్రభుత్వానికి కట్టర్‌కి రూ.27వేలు చెల్లిస్తుండగా ఇపుడు మరో ఎనిమిది వేలు పెంచడమే భారం అనుకుంటే మరో ముప్పై వేలు అదనంగా ప్రభుత్వానికి కాకుండా మీ జేబుల్లోకి వెళ్లే విధంగా మేము చెల్లించే ప్రసక్తే లేదని ఓనర్లు భీష్మించుకున్నారు. ఇపుడే అంతంత మాత్రంగా జరుగుతున్న వ్యాపారాలు ఈ అదనపు చెల్లింపులతో ఫ్యాక్టరీలను నడిపే అవకాశమే లేదని, ఖర్చులు కూడా రాని దుస్థితి ఏర్పడుతుందని, అంతకన్నా మూసివేసుకోవటమే మేలని ఏఎంఆర్ సంస్థ ముందు ఫ్యాక్టరీ ఓనర్లు తెగేసి చెప్పారు. అవసరమైతే ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటు మేరకు ప్రభుత్వానికే అధనంగా రెండుశాతం రాయల్టీ చెల్లిస్తే ఎంతమేరకు అయినా రాళ్ల కొనుగోలుకు అనుమతి లభిస్తుందని, అలానే ముందుకెళతామని ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు తెగేసి చెప్పటంతో ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు ఆలోచనలో పడ్డారు. ఈ అంశాలను మా సంస్థ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామని, మరోసారి చర్చలు జరిపి పరిష్కారమార్గం కనుగొందామని ఏఎంఆర్ ప్రతినిధి చెప్పటంతో చర్చలు అర్థంతరంగా ముగిశాయి.

క్వారీ ఓనర్ల చేతిలోనే పరిష్కారం...

ముడిరాయిని విక్రయించే క్వారీ ఓనర్ల చేతిలోనే పరిష్కార మార్గం ఉందని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. రికవరీతో సంబంధంలేదు, పర్మిట్‌కు మించితే పెనాల్టీ వేస్తామన్న ఏఎంర్ సంస్థ వాదన ప్రభుత్వ నిబంధనల మేరకే ఉంది. మరో వైపు నాణ్యమైన రాయిని ఎగుమతి చేసుకుంటూ నాణ్యత తక్కువ ఉన్న రాయిని లోకల్ ఫ్యాక్టరీలకు క్వారీ ఓనర్లు విక్రయిస్తున్నారు. ఈ రాళ్లలో రికవరీ శాతం తక్కువ అని ఓనర్లకు తెలుసు కాబట్టి రేటు తక్కువకు విక్రయిస్తే ఫ్యాక్టరీ ఓనర్లు నష్టాల నుంచి గట్టెక్కవచ్చు. వేలాదిమందికి ఉపాధి కల్పించే పరిశ్రమ కళకళలాడాలంటే పదుల సంఖ్యలో ఉన్న క్వారీ ఓనర్లు తమ లాభాల్లో కొంత మేర తగ్గించుకుంటే వారికొచ్చే నష్టమేమి లేదనేది కొంతమంది ఫ్యాక్టరీ ఓనర్లు వాదన. ఉభయతారకంగా సమ్మెకు స్వస్తి పలికి పరిశ్రమ యథాతథంగా నడిచేలా క్వారీ ఓనర్లు ముందుకు వచ్చి తమ నిర్ణయం తెలపాలని ఆశిస్తున్నారు. ఏఎంఆర్, ఫ్యాక్టరీ ఓనర్ల మధ్య చర్చల్లో మధ్యవర్తిగా ఉంది కూడా క్వారీ ఓనర్లే కావటం విశేషం. గత రెండు సార్లు జరిగిన చర్చల్లో వారు మౌనంగా వింటున్నారే తప్ప సమస్య పరిష్కారం దిశగా ముందుకు రాకపోవటం గమనార్హం. మంగళవారం జరిగిన చర్చల్లో ఏఎంఆర్ సంస్థ ప్రతినిధి నీహంత్, కారీ ఓనర్లు శిద్దా భరత్, ఆర్‌పీ రవి, చలువాది బదరీనారాయణ, సురేంద్రరెడ్డి, శిల్పారెడ్డి, నూనె అనుదీప్, ఫ్యాక్టరీ ఓనర్లు కాట్రగడ్డ రమణయ్య, యర్రగుంట్ల శ్రీనివాసరావు, కోదూరి వెంకట్రావు, లగడపాటి శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు, సూదనగుంట కోటేశ్వరరావు, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

అనంతవరంలో కలెక్టర్ వినోద్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, వేదికపై ఆర్డీవో గ్లోరియా

యద్దనపూడి, (మార్టూరు) అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న విషయాలను విద్యార్థులు తెలుసుకోవడంతోపాటు, వాటిపై అవగాహన కలిగి ఉండాలని, కలెక్టర్ వి. వినోద్‌కుమార్ అన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు మంగళవారం సాయంత్రం యద్దనపూడి మండలంలోని అనంతవరం జడ్పీ హైస్కూల్‌లో ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా వేదికపై డీఈవో పురుషోత్తం అధ్యక్షత వహించారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం - 2017లో జీఎస్టీని ప్రవేశ పెట్టిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న 2.0 సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులు అవగాహన చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఈ ఏడాది పదవ, ఇంటర్, డిగ్రీ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో బాపట్ల జిల్లా ప్రథమ స్థానం ఉండేవిధంగా ప్రణాళికలను తయారు చేసుకోవాలని డీఈవోను, సర్వశిక్షా అభియాన్ పీవోను ఆదేశించారు. తరువాత హైస్కూల్‌లో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌లపై ఉపాధ్యాయులు విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, ఎస్‌ఎస్‌ఏ పీవో నాగిరెడ్డి, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ మురళీకృష్ణ, తహసీల్దారు కే.రవికుమార్, ఎంఈవో గోపి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.రాఘవరెడ్డి, తదితర అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించరూ..!


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న రైతులు

చీరాల : చీరాల నియోజక వర్గం పరిధిలోని ఈపూరు పాలెం స్ట్రయిట్ కట్ మురుగు పారక, వర్షపు నీరు పొలాల్లో నుండి బయటకు పోక రైతులు నానా యాతన పడుతున్నట్లు పలువురు రైతులు చెప్పారు. మంగళవారం కలెక్టర్ డా.వినోద్ కుమార్‌ను రైతులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సుమారు 12 గ్రామాలకు చెందిన రైతులకు ప్రయోజనకరంగా 1972లో అప్పటి ఇంజ నీరింగ్ విభాగం రూపొందించిన ప్రణాళిక ప్రకారం వర్షపు నీరు, మురుగు దీని ద్వారా సముద్రంలో కలిసే విధంగా రూపొందించినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అయితే ప్రస్తుతం కాలువ పూడికతీయకపోవడంతో మేటతో నింగి అధ్వానంగా ఉన్నట్లు చెప్పారు. అలాగే ఇటీవల హార్బర్ నిర్మాణం పరిశీలనపై కూడా అభ్యంతరం తెలుపుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు హరిప్రసాద్, నర్రా బ్రహ్మయ్య, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, వీరయ్య, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

బాలుడు చాటున చంద్రుడు



పక్క చిత్రంలో కనిపిస్తున్న మేఘంలో ఓ చిత్రం ఆవిష్కృతమైంది. చంద్రుడు ప్రకాశిస్తున్న సమయంలో అడ్డుగా వచ్చిన ఒక మేఘం బాలుడి ఆకారంలో కనిపించింది. బాలుడు చాటున చంద్రుడు నక్కినట్లు కనిపించిన ఈ దృశ్యాన్ని మంగళవారం రాత్రి ప్రజలు తిలకించారు.

- ఆంధ్రజ్యోతి, త్రిపురాంతకం

అవీ..ఇవీ..

తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు

అద్దంకి, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం పలు దుకాణాలను జిల్లా తూనికల కొలతలు అధికారి నాగేశ్వరరావు తనిఖీలు చేశారు. మొబైల్ షాపులను పరిశీలించి కంపెనీలు నిర్ణయించిన ధరకే అమ్మాలని సూచించారు. 4 దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

పంగులూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా శ్రీచరణ్


బాధ్యతలు స్వీకరించిన శ్రీచరణ్

పంగులూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పంగులూరు మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా శ్రీచరణ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ పి.సింగారావు వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో అద్దంకి తహసీల్దార్ శ్రీచరణ్‌ను పంగులూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించారు. ఈ నెల 29 వరకు తహసీల్దార్ బాధ్యతలు నిర్వహించనున్నట్లు శ్రీచరణ్ తెలిపారు.

ఆర్‌టీసీ బస్టాండ్‌లో అన్నదానం

ఇంకొల్లు, అక్టోబరు 7, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు శాంతినికేతన్ విద్యా సంస్థల వ్యవస్థాపకురాలు ఆవులమంద వరలక్ష్మీ 9వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండులో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి అన్నదానం నిర్వహించారు. ఆవులమంద వరలక్ష్మీ చారిటబుల్ ట్రస్టుపక్షాన భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ట్రస్టు నిర్వాహకులు సుబ్బయ్య, రామకృష్ణ, కిరణ్, లావణ్యలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ బాబు, పూర్వ విద్యార్థులు అజీమ్, రాధా, ఖాజావలి, సుభాని తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ బాంధవ్యాలకు ప్రతీక రామాయణం

● ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు



వాల్మీకి జయంతి మహోత్సవంలో ప్రతినిధులు

చీరాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ బాంధవ్యాలకు నిలువెత్తు ప్రతీక మహోన్నత రామాయణమని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం వాల్మీకి మహర్షి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు హాజరై వాల్మీకి రచనలను కొనియాడారు. కార్యక్రమంలో కామినేని రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై విద్యార్థులకు పోటీలు

వేటపాలెం(చీరాల), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ సంస్కరణలతో రాష్ట్రంలోని అన్ని రంగాలు అభివృద్ధి చెందడంతో పాటు అన్ని ఆయా వృత్తిదారులు, ప్రజలు సంతోషంగా ఉంటారని వేటపాలెం బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం సరోజినీ, సాంఘిక ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో జీఎస్టీ సంస్కరణలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకుగాను వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అలాగే విజేతలకు బహుమతులు అందజేశారు.

విద్యుత్ స్తంభానికి పగుళ్లు


విరిగిన విద్యుత్‌స్తంభం

బల్లికురవ, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నుపల్లి- ముక్తేశ్వరం గ్రామాల మధ్య విద్యుత్‌లైన్‌తో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ రోడ్డులో ఇటీవల నూతనంగా విద్యుత్ స్తంభాలను అధికారులు ఏర్పాటు చేశారు. స్తంభాలు వేసే సమయంలో రోడ్డు అంచులో వేయడంతో సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. విద్యుత్ స్తంభం దిగువ భాగంలో విరిగి పోయింది. దీంతో విద్యుత్ లైన్ మెత్తం కూలే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు అంచులోని విద్యుత్ స్తంభాలను చూసి రైతులు కూడా భయాందోళన చెందుతున్నారు. విరిగిన విద్యుత్ స్తంభం కూలితే రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులు ప్రమాదం బారిన పడే ప్రమాదం పొంచి ఉందని వెంటనే అధికారులు విరిగిన స్తంభాన్ని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యుడు లేడు.. సిబ్బంది లేరు..


బొమ్మనంపాడులో నిర్మాణంలో ఉన్న పశువైద్యశాల

- డిప్యూటేషన్‌పై వైద్యాధికారి విధులు
- ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి
- మండలంలో అగమ్యగోచరంగా పశువైద్యం

అద్దంకి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి తాలూకాలో మొట్టమొదటిగా 58 సంవత్సరాల క్రితం బొమ్మనంపాడులో పశువైద్యశాల ఏర్పాటు చేశారు. అప్పట్లో అద్దంకి తాలూకా మొత్తం మీద బొమ్మనంపాడులో మాత్రమే పశువైద్యశాల ఉంది. అనంతరం పలు చోట్ల పశువైద్యశాల ఏర్పాటు చేశారు. ఆ తరువాత అద్దంకి పట్టణంలో అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి పశువైద్యశాల ఏర్పాటు చేసినా వైద్యశాలకు తీసుకొచ్చిన పశువులకు మాత్రమే వైద్యం చేస్తారు. దీంతో అద్దంకి మండలంలోని మిగిలిన అన్ని గ్రామాలకు బొమ్మనంపాడు పశువైద్యశాల నుండే వైద్యం అందాల్సి ఉంది. అన్ని మండలాలలో మూడు, నాలుగు చొప్పున పశువైద్యశాలలు ఉన్నా అద్దంకి మండలం మొత్తానికి ఒకే ఒక పశువైద్యశాల ఉంది. అయితే ప్రస్తుతం బొమ్మనంపాడు పశువైద్యశాలలో ఉండాల్సిన వైద్యుడు, వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి నియమించినా ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో కూడా తెలియని పరిస్థితి ఉంది. రోజులో ఒక గంట పాటు ఎవరో ఒకరు వచ్చి వెళ్తుంటారని గ్రామస్థులు, రైతులు తెలిపారు. దీంతో ఎప్పుడూ తాళాలు వేసి దర్శనమిస్తోంది. పశుపోషకులు తప్పనిసరి పరిస్థితులలో ప్రైవేటు వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అద్దంకి మండలంలో మొత్తం 26 గ్రామపంచాయతీలు ఉండగా అధికారిక లెక్కల ప్రకారం గొర్రెలు, మేకలు, గేదెలు ఇతర పశువులు 73 వేల వరకు ఉన్నాయి. ఇక కోళ్లు సుమారు 13 వేల వరకు ఉన్నాయి. అద్దంకి పట్టణం మినహా మిగిలిన అన్ని గ్రామాలకు బొమ్మనంపాడు పశువైద్యశాల నుండే వైద్యం అందాల్సి ఉంది. అదనంగా కనీసం మరో రెండు, మూడు పశువైద్యశాలలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం కొత్త పశువైద్యశాలల ఏర్పాటు పరిస్థితి అటుంచితే ఉన్న ఒక్క పశు వైద్యశాలలో కూడా అటు వైద్యుడు కానీ, సిబ్బంది కానీ లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బొమ్మనంపాడు పశు వైద్యశాలలో ఖాళీగా ఉన్న వైద్యుడు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయడంతో పాటు అదనంగా పశువైద్యశాలలు ఏర్పాటు చేయాలని పశుపోషకులు కోరుతున్నారు. పుష్కరకాలం క్రితం బొమ్మనంపాడులో నిర్మించిన పశువైద్యశాల భవనం నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచాయి. దీంతో శిథిలావస్థకు చేరిన పాత పశువైద్యశాలలోనే వైద్యం అందించాల్సిన పరిస్థితి.

రెండు కొత్త పశువైద్యశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు

అద్దంకి మండలంలో ప్రస్తుతం బొమ్మనంపాడులో మా త్రమే పశువైద్యశాల ఉంది. అదనంగా మణికేశ్వరం, మోదేపల్లిలో పశువైద్యశాలల ఏర్పాటుకు ప్రతి పాదనలు పంపాం. బొమ్మనంపాడు పశువైద్యశాలలో పనిచేసే వైద్యుడు, సిబ్బంది బదిలీ కావడంతో తాత్కాలికంగా వైద్యురాలిని ఇన్‌చార్జ్‌గా, వెటర్నరీ అసిస్టెంట్‌ను డెప్యూటేషన్‌పై నియమించాం. సమయపాలన పాటించే విధంగా చర్యలు చేపడుతున్నాం.

డాక్టర్ బ్రహ్మయ్య, అసిస్టెంట్ డైరెక్టర్, అద్దంకి పశువైద్యశాల

గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించండి

సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పంగులూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు వైద్య సిబ్బంది గ్రామాలలో వైద్యశిబిరాలు నిర్వహించాలని ఎంపీడీవో కే.స్వరూపారాణి సూచించారు. పంగులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఏవో మాట్లాడుతూ మండలంలోని రైతుసేవా కేంద్రాలలో పంటసాగుకు సరిపడా యూరియా అందుబాటులో ఉందన్నారు. ఇప్పటివరకు ఆయా కేంద్రాల ద్వారా 428 టన్నుల యూరియా రైతులకు అందజేసినట్లు తెలిపారు. రబీలో పంటసాగుకు రెండువేల టన్నుల యూరియా అవసరంగా గుర్తించి అధికారులకు నివేదిక అందజేసినట్లు తెలిపారు. రైతులు తాము సాగుచేసిన ఖరీఫ్ పంటలను ఈ నెల 25లోగా ఈకేవైసీ చేయించాలని సూచించారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంజూరు చేయించిన రూ.2.8కోట్ల ఉపాధిహామీ పథకం నిధులతో రేణంగివరం నుంచి అలవలపాడు మార్గంలో రూ.2కోట్లతో చందలూరు నుండి గంగవరం వరకు బీటీ.రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. జలజీవన్ మిషన్ నిధులతో జరుగుతున్న పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణ వివరించారు. గ్రామాలలో శానిటేషన్ పనులను సక్రమంగా నిర్వహించాలని డిప్యూటీ ఎంపీడీవో సుమంత్ కోరారు. సూర్యఘర్ ప్రయోజనాలను అందరూ వినియోగించుకోవాలని ఏఈ అంజనేయులు కోరారు. పశువులలో గాలికుంటు వ్యాధినివారణ టీకాలు గేదెలకు విధిగా వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ అనూష తెలిపారు. కార్యక్రమంలో మండలపరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, ఎంఈవో వీరాంజనేయులు, ఏపీవో సంతోషం, సురేష్, జయప్రద, ఆర్‌టీసీ. ప్రతినిధి ఏడుకొండలు, ఉద్యానశాఖ అధికారి దీప్తి, ఆర్‌ఐ శ్వేత, ఏఈ కిషోర్, హెచ్‌ఈ అనూరాధ, రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పలువురు ప్రజా ప్రతినిధులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు చినగంజాం విద్యార్థులు


సత్తా చాటిన విద్యార్థులు

చినగంజాం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సత్యం హైస్కూల్‌కు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఎంపికైనట్లు తైక్వాండో కోచ్ వాటుపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఎస్.జీ.ఎఫ్ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర తైక్వాండో రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో ఒంగోలు ఇస్లాంపేటలోని షాదీఖానాలో 69వ అంతర జిల్లాల తైక్వాండో పోటీ లను సోమవారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుండి 69 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. అండర్-17 విభాగంలో స్థానిక సత్యం హైస్కూల్‌కు చెందిన కుక్కల రక్షితరెడ్డి 38 కేజీల కేటగిరిలో గోల్డ్ మెడల్, వాటుపల్లి మౌనిక 42 కేజీల కేటగిరిలో గోల్డ్ మెడల్, అండర్-14 విభాగంలో ఎల్.గీతిక 32 కేజీల కేటగిరిలో గోల్డ్ మెడల్, అండర్-17 విభాగంలో చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సీ.హెచ్.జాషువ 42 కేజీల కేటగిరిలో గోల్డ్ మెడల్, 68 కేజీల కేటగిరిలో బి.యశ్వంత్ గోల్డ్ మెడల్‌లు సాధించినట్లు తెలిపారు. పోటీలలో గోల్డ్ మెడల్స్ సాధించి, రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులను, తైక్వాండో కోచ్‌ని చినగంజాం జడ్పీ ఉన్నతపాఠశాల హెచ్.ఎం కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, పీ.వెంకటప్రసాదు. పీ.డీ గంటా అంకమ్మ, సత్యం హైస్కూల్ కరస్పాండెంట్ నున్నా హరనాథ్‌బాబు, హెచ్.ఎం.ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం అబినందనలు తెలిపారు.

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎంఈవో

మార్టూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ,సూపర్ సేవింగ్స్‌పై మంగళవారం స్థానికంగా రాయల్ హైస్కూల్ నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జీఎస్టీ అధికారి శ్రీనివాస్, ఎంఈవో వస్రాంనాయక్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు వారు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ కరస్పాండెంట్ పి.రవీంద్రబాబు, ఇన్‌చార్జ్ మధుబాబు,ఉపాధ్యాయులు నారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులు రూ.8.88 కోట్లు మంజూరు


మార్టూరులో పూర్తయిన సీసీ రోడ్డు

మార్టూరు, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలో సిమెంట్ రోడ్లు, సైడుకాల్వలు అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రెండో విడత 61 పనులకు రూ.8.88 కోట్లు నిధులు మంజూరైనట్లు ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిలో చిమ్మిరిబండ గ్రామంలో 3 పనులకు రూ.35 లక్షలు, అదేవిధంగా ఇసుకదర్శిలో 5 పనులకు రూ.50 లక్షలు, ద్రోణాదుల గ్రామానికి రూ.50 లక్షలు జొన్నతాళిలో 2 సీసీ రోడ్లు నిర్మాణం కోసం రూ.30 లక్షలు, కోలలపూడి గ్రామంలో రూ.40 లక్షలతో 2 పనులు కోనంకి గ్రామంలో 4 పనులకు రూ.80 లక్షలు మంజూరయ్యాయి. మార్టూరులో 14 పనులు కోసం రూ.1.83 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రాజుగారిపాలెం గ్రామంలో మంజూరైన రూ.30 లక్షలతో రెండు పనులు నిర్మాణం, రాజుపాలెం గ్రామంలో రూ.45 లక్షలతో 4 పనులు నిర్మాణం చేపట్టాలి. నాగరాజుపల్లి గ్రామంలో 4 పనులు కోసం రూ.70 లక్షలు, వలపర్ల గ్రామంలో 8 పనులు కోసం రూ.1 .45 కోట్లు మంజూరయ్యాయి. తాటివారిపాలెంలో 1 పని కోసం 20 లక్షలు మంజూరయ్యాయి. లక్కవరం గ్రామంలో రూ.20 లక్షలతో ఒక పని, బొల్లాపల్లి గ్రామంలో రెండు పనులు కోసం రూ.30లక్షలు, బొబ్బేపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో 3 పనులు, డేగరమూడి గ్రామంలో 1 పని కోసం రూ.20 లక్షలు మంజూరయ్యాయి.

సమన్వయంతో పనిచేసి సమస్యలు పరిష్కరించాలి

● ఎంపీపీ ఆనందకుమారి



మాట్లాడుతున్న ఎంపీపీ ఆనందకుమారి

పర్చూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజాసమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ మేకా ఆనందకుమారి అన్నారు. మంగళవారం మండల విద్యావనరుల కేంద్రం సమావేశ మందిరంలో పర్చూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందు బాటులో ఉంటూ ప్రజా సమస్యలపై స్పందించాలన్నారు. అనంతరం వివిధ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. కార్యక్రమంలో భాగంగా ఏవో భాస్కర్‌రావు మాట్లాడుతూ మండలంలో రైతులకు ఎలాంటి ఎరువుల కొరత లేదన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా అవసరాలకు మించి ఎరువులను స్టాక్ చేయవద్దని రైతులకు సూచించారు. పొగాకు పంటను ప్రభుత్వం పూర్తిగా నిషేదించిందని రైతులు ఎవ్వరూ పంటను సాగుచేయవద్దన్నారు. పొగాకు కొనుగోలు షెడ్యూలు నిర్వహించినప్పుడు హాజరుకాని రైతులు కూడా పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసుకోవచ్చన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారిణి అరుణ మాట్లాడుతూ పశుపోషకులు విధిగా పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేవిధంగా ఆయా శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆయా గ్రామ పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో సుభద్ర, డిప్యూటీ ఎంపీడీవో కొసనా సత్యనారాయణ, ఏపీవో రమేష్, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, ఏఈ పీఆర్ శ్రీనివాసరావు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

180 మంది ముత్తైదువులతో కుంకుమార్చన


వేయిస్తంభాల గుడిలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

అద్దంకి, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని వేయిస్తంభాల గుడి(నగరేశ్వరాలయం)లో మంగళవారం అశ్వయుజ పౌర్ణమి సందర్భంగా కుంకుమార్చన నిర్వహించారు. 11 మంది రుత్వికులు 180 మంది ముత్తైదువులతో వింధ్యావాసిని అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించినట్లు పూజారి సత్యనారాయణశర్మ తెలిపారు. మహిళాభక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం


బల్లికురవ కేజీబీవీలో యోగా చేస్తున్న విద్యార్థినులు

బల్లికురవ, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు కొంత సేపు వ్యాయమం చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ప్రియ పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా సమగ్రశిక్ష వారి ఆధ్వర్యంలో విద్యార్థినులకు యోగా, వ్యాయమం వలన కలిగే లాభాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు యోగా చేశారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరళకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన నీతి అయోగ్ బృంద సభ్యుడు


మున్నంవారిపాలెంలో బాలింతలను విచారిస్తున్న వెంకటరమణ

చినగంజాం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మున్నంవారిపాలెం గ్రామంలోని 132వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రాన్ని నీతి అయోగ్ బృందం సభ్యులు వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని శుభ్రతను, చిన్నారుల బరువు, ఎత్తులను ఆయన పరిశీలించారు. గ్రామంలోని గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి అంగన్‌వాడీకేంద్రం ద్వారా పోషకాహారాలు తీసుకుంటున్నారా..? లేదా..? ఆరోగ్యంపై కార్యకర్త సూచనలు, సలహాలు అందజేస్తున్నారా..? సీమంతాలకు పిలుస్తున్నారా..? తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీవో జి.సులోచనారాణి, పెదగంజాం సెక్టార్ సూపర్‌వైజర్ కె.వాణిశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్త ఎం.రమ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా



యూరియా పంపిణీ చేస్తున్న వీఏఏలు, టీడీపీ నేతలు

చినగంజాం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : చినగంజాం మండలానికి 140 టన్నుల యూరియాను కేటాయించినట్లు మండల వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్ తెలిపారు. ఖరీఫ్ సీజనల్‌లో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందన్నారు. మండల పరిధిలోని రైతుసేవా కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. మండలంలోని పెదగంజాం రైతుసేవా కేంద్రంలో మంగళవారం రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు గ్రామ వ్యవసాయ సహాయకులు సాంబశివరావు, జి.లక్ష్మిలు తెలిపారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని రైతుసేవా కేంద్రాలు-1, 2లకు 18 టన్నుల యూరియాను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆసోది అంజిరెడ్డి, నాయకులు ఆసోది సుబ్బారెడ్డి, ఆసోది బ్రహ్మానందరెడ్డి, మాచవరపు రాజేష్, సుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఉన్నతంగా ఎదగాలి



కంప్యూటర్‌లను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఇంకొల్లు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు దాతలు అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని హెచ్‌ఎం కఠారి భాస్కరరావు అన్నారు. మండలంలోని దుద్దుకూరు ఉన్నత పాఠశాలకు ఎన్.ఆర్.ఐ.లు కుర్రా విజయలక్ష్మి, చెన్నుపాటి నరేంద్రకుమార్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కుర్రా రామసుబ్బారావులు గ్రామ వికాస్ సొసైటీ ద్వారా కంప్యూటర్లు బహూకరించారు. దాతలు సమకూర్చిన కంప్యూటర్లను గ్రామ వికాస్ సొసైటీ అధ్యక్షులు చెన్నుపాటి జనార్ధనరావు మంగళవారం హెచ్.యం. భాస్కరరావుకు అందచేశారు. సాంకేతిక విద్యాబోధనకు ఉపకరించే కంప్యూటర్లను బహూకరించిన గ్రామ వికాస్ సొసైటీ ప్రతినిధులకు హెచ్.యం, పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి యం.చంద్రకళ, ఉపాధ్యాయులు చెంచయ్య తదితరుల పాల్గొన్నారు.



'సోమశిల'కు పెరిగిన వరద ప్రవాహం

● 2 గేట్లు ఎత్తి నీటి విడుదల



అనంతసాగరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి వస్తున్న వరద పెరిగింది. సోమవారం 12,992 క్యూసెక్కులు వస్తుండగా మంగళవారం 26,750 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాంలో 73.882 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 5, 6 నెంబరు గల గేట్లు ఎత్తి 22,650, ఉత్తర కాలువకు 100, కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టరు హిమాన్షు శుక్లా, సబ్ కలెక్టరు హిమవంశీ

సమస్యలన్నీ పరిష్కరిస్తాం!

పరిహారం చెల్లింపులో న్యాయం చేస్తాం

కరేడు రైతులతో కలెక్టర్ హిమాన్షు శుక్లా

- వివరాలు 8లో..

సీజేపై దాడి యత్నం అమానుషం

జిల్లావ్యాప్తంగా కొనసాగిన ఆందోళనలు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయిపై ఓ న్యాయవాది దాడికి యత్నించడం అమానుషమంటూ మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. న్యాయవాదులు, దళిత సంఘాలు, రాజకీయ నాయకులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నెల్లూరులో న్యాయవాదుల సంఘాలు, సీపీఎం నాయకులు వేర్వేరుగా ఆందోళనలు నిర్వహించారు. కందుకూరులో వివిధ సంఘాలు, రాజకీయ నేతలు అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కావలి, ఉలవపాడు, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లోనూ ఆందోళనలు జరిగాయి.



నెల్లూరులో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

మరోసారి పరిశీలన

● దివ్యాంగ, డీఎంహెచ్‌వో పింఛన్లపై ప్రభుత్వం నిర్ణయం

● ఇటీవల విచారణలో అనర్హులుగా తేలిన 4,250 మంది

● రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తులు ● జిల్లాలో నాలుగు ఆసుపత్రుల్లో పరిశీలన

నెల్లూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ, డీఎంహెచ్‌వో పింఛన్ల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల విచారణలో అనర్హులుగా తేలిన 4,250 పింఛన్లను మరోసారి పరిశీలించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థతోపాటు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖకు ఆదేశాలు అందాయి. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా పింఛన్ల రీవెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకూ దివ్యాంగ, డీఎంహెచ్‌వో పింఛన్లను రెండు విడతల్లో వైద్య సిబ్బంది విచారించగా, 4,250 పింఛన్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. వాటన్నింటినీ నిలిపేసేందుకు ప్రభుత్వం సిద్ధమైనప్పటికీ వివిధ వర్గాలు, పింఛన్‌దారుల నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు ఈ నెలలో కూడా వారందరికీ పింఛన్లు అందించింది. ఇటువంటి పింఛన్లన్నింటినీ రీవెరిఫికేషన్ చేసి ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. దీంతో తాజాగా జరగనున్న రీవెరిఫికేషన్ కీలకంగా మారనుంది. జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో ఈ ప్రక్రియ జరగనుంది. నెల్లూరులోని జీజీహెచ్‌తోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరుల్లోని ఏరియా ఆసుపత్రుల్లో రీవెరిఫికేషన్ జరిపేందుకు అధికారులు నిర్ణయించారు. వారంలో మూడు రోజులు అంటే ప్రతీ బుధ, గురు, శుక్రవారాల్లో ఈ ప్రక్రియ నిర్వహించనున్నారు. పింఛన్‌దారులకు ఎప్పుడు రీవెరిఫికేషన్ ఉంటుందన్నది ముందుగానే తెలియజేస్తారు.

అనర్హులుగా 4,250 మంది గుర్తింపు

జిల్లాలో సుమారు 3.10 లక్షల పింఛన్లు ఉన్నాయి. అందులో మెజారిటీగా వృద్ధాప్య పింఛన్లు 1.65 లక్షలు ఉండగా, మూడో స్థానంలో డిసేబుల్డ్ పింఛన్లు 32 వేలకు పైగా ఉన్నాయి. అలానే డీఎంహెచ్‌వో పింఛన్లు కూడా సుమారు రెండు వేల వరకూ ఉన్నాయి. డిసేబుల్డ్ పింఛన్ కింద ప్రతీ నెలా రూ.6 వేలను అందిస్తుండగా, డీఎంహెచ్‌వో పింఛన్ కింద రూ.15 వేలను ఇస్తున్నారు. జిల్లాలో ప్రతీ నెలా రూ.131 కోట్లను పింఛన్ల కింద చెల్లిస్తుండగా, అందులో డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో పింఛన్‌దారులకు సుమారు రూ.22 కోట్లను అందిస్తున్నారు. అయితే అనర్హులు కూడా ఈ జాబితాలో పింఛన్లు అందుకుంటున్నట్లు ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వీటిని పరిశీలించగా కొన్ని నిర్ధారణ కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మొదటగా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో పింఛన్లను తనిఖీ చేసింది. దొంగ సర్టిఫికెట్లతో కొందరు డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో కేటగిరీల కింద పింఛన్లు పొందుతున్నట్లు తేలింది. దీంతో ఈ ఏడాది జనవరిలో రాష్ట్రవ్యాప్తంగా డిసేబుల్డ్, డీఎంహెచ్‌వో కేటగిరీల్లోని పింఛన్లను పరిశీలించేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ విచారణ పూర్తయ్యే సరికి జిల్లాలో 4,250 మంది అనర్హులుగా తేలారు. అనర్హులుగా తేలిన వారు మరోసారి పరిశీలనకు ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం అనర్హులుగా తేలిన వారి డిసేబులిటీని రీవెరిఫికేషన్ చేసేందుకు తాజాగా ఆదేశాలిచ్చింది. కాగా ఈ అంశంపై డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి అనర్హతగా తేలిన పింఛన్లను రీవెరిఫికేషన్ చేయనున్నట్లు చెప్పారు.



రౌడీల కదలికలపై దృష్టి పెట్టండి

● జిల్లా పోలీసు అధికారులకు ఐజీ ఆదేశం

నెల్లూరు (క్రైం) : రౌడీల కదలికలు, ఆస్తి, గంజాయి రవాణా, విక్రయాలు, మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి జిల్లా పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం నగరంలోని పోలీసు కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఐజీ మాట్లాడారు. జిల్లాలో బేసిక్ పోలీసింగ్ అమలు చేయాలని, డ్రోన్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరించి వాటిని ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. విజబుల్ పోలీసింగ్, విలేజ్ విజిట్ చేసి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలలో ఇష్టానుసారంగా పోస్టులు పెట్టే వారిపై నిఘా ఉంచాలని, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ అజిత వేజండ్ల, అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు పాల్గొన్నారు.



దీనావస్థలో వృద్ధురాలు సుబ్బమ్మ

మా ఇంటికి చేర్చండయ్యా!

● రోడ్డుపై వృద్ధురాలి వేదన ● చలించిన డిప్యూటీ తహసీల్దార్

● చేయూతనందించిన రెవెన్యూ సిబ్బంది

కట్టుకున్నోడు పోయాడు. కడుపున పుట్టిన బిడ్డ చనిపోయాడు. నా.. అన్న వాళ్లే రోడ్డుపై వదిలి వెళ్లిపోయారు. ఏడు పదులు దాటిన ఓ వృద్ధురాలు కాలువిరిగి నడవలేక, రోడ్డుపై పాక్కుంటూ రెండురోజులుగా మనుబోలులో ప్రభుత్వ కార్యాలయాల వద్ద దైన్యంగా కాలం గడుపుతోంది. కనిపించిన వారినల్లా పదో, పరకో అడుక్కుంటూ తనను ఇంటికి పంపాలంటూ కాళ్లావేళ్లా పడుతోంది. మంగళవారం ఆమె దీనగాథ విన్న డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ చలించిపోయారు. రెవెన్యూ సిబ్బందిని పంపి రోడ్డుపై ఉన్న వృద్ధురాలిని సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో సిబ్బంది ఆమెను సమీపంలోని బస్‌షెల్టర్‌కు తీసుకెళ్లారు. తన పేరు సుబ్బమ్మ అని, కలువాయి సొంతూరని చెప్పింది. భర్త కొండయ్య. కుమారుడు 25 ఏళ్ల క్రితమే చనిపోయాడు. ఇద్దరు కుమార్తెలు. తనను ఎవరూ పట్టించుకోలేదని, తన మనవడు సుబ్బయ్య ఆటోలో ఇక్కడికి తీసుకువచ్చి వదిలి వెళ్లాడని రోదిస్తోంది. కలువాయిలో కరెంటు ఆఫీసు వద్ద తనకు ఇల్లు ఉందని, తనను అక్కడకు చేర్చాలని వేడుకుంటోంది. దీంతో డీటీ ప్రదీప్ కలువాయి తహసీల్దారుకు సమాచారం ఇచ్చారు. స్థానికులు వృద్ధురాలికి ఆహారం, దుస్తులు అందించారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)



సుబ్బమ్మను బస్సు షెల్టర్‌కు మోసుకెళుతున్న రెవెన్యూ సిబ్బంది

19న ఎల్‌ఐసీ ఏజెంట్ల మహాసభలు

కందుకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఎల్‌ఐసీఏఓఐ) నెల్లూరు డివిజన్ 6వ మహాసభలు ఈనెల 19న కందుకూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెజవాడ శివయ్య, సీహెచ్ నరసింహారావులు తెలిపారు. మంగళవారం స్థానిక బ్రాంచి కార్యాలయంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థను రక్షించుకోటా నికి, ఏజెంట్ల హక్కుల సాధనకు, రాబోయే కాలంలో నిర్వహించబోయే పోరాటాలకు రూపకల్పన చేయటం కోసం ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు షబ్బీర్, విష్ణువర్ధన్‌రెడ్డి, బి. మధుబాబు, పిచ్చయ్య, మాల్యాద్రి, రాజేశ్వరాచారి, సి. మాలకొండయ్య, బి. వెంకట్రావు, కె. వెంకటేశ్వర్లు, ఆర్. హజరత్‌రెడ్డి, యం. నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూలో పైసలిస్తేనే ఫైళ్ల కదలిక

● ప్రతి దస్త్రానికి రేటు పెట్టి.. డిమాండ్ చేసి వసూళ్లు

కావలి,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి) కావలి డివిజన్‌లో తహసీల్దార్‌కార్యాలయాలతోపాటు ఆర్డీవో కార్యాలయంలో కూడా పైసలిస్తేనే ఫైళ్ల కదలడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు తెచ్చినా భూసమస్యలు ఎప్పటికప్పుడు పుట్టుకొస్తుంటాయి. ఆ సమస్యలు పరిష్కరించుకోవాలంటే సచివాలయాలు, మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో అప్లయిచేసుకోవాలి. అనంతరం ఆయా కార్యాలయాలో ఆ ఫైళ్లు కదలాలంటే సంబంధిత సిబ్బందిని కలిసి పైసలు ముట్ట చెప్పుకోవాల్సిందే. లేదంటే ఏదో ఒక సమస్య చూపి వాటిని రిజక్ట్ చేస్తుంటారు. తహసీల్దార్ కార్యాలయాల్లో పైసలిచ్చి ఫైళ్లు కదిలించినా ఆర్డీవో కార్యాలయానికి వచ్చేసరికి ఇక్కడ కూడా పైసలివ్వనిదే ఫైలు కదలటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

● బరితెగించి వసూళ్లు

ఆర్డీవో కార్యాలయంలో ఉన్న ఒక ఉద్యోగి మరీ బరితెగించి వసూలు చేస్తుండటంతో ఆయనపై ఇటీవల కొందరు ఎమ్మెల్యేకు చెప్పినట్లు తెలిసింది. వెంటనే ఎమ్మెల్యే ఆర్డీవోకు ఫోన్‌చేసి ఎవరా ఉద్యోగి ఏమిటీ ఆరోపణలు అని అడగ్గా, ఇక నుంచి అలా జరగకుండా చూసుకుంటామని ఆర్డీవో చెప్పినట్లు తెలిసింది. ఎక్కువగా భూమార్పిడిలలో తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయం మరీ పోటీ పడి వసూళ్లు వసూళ్ల ఆరోపణలు వస్తున్నాయి. అయితే ప్రస్తుతం భూమార్పిడిని ప్రభుత్వం నిలుపుదల చేయటంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల వారు తమ రాబడి పోయిందే అని బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

● ప్రతీచోటా వసూల్ రాజాలు

ప్రతీ కార్యాలయంలో కలెక్షన్‌ల కోసం ఆరితేరిన ఒక ఉద్యోగిని ఆ కార్యాలయ అధికారులు ఎంపిక చేసుకుని ఉంచుకుంటారు. ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలకు సంబంధించి మీడియేటర్లు అయినా, అసలు బాధితులైనా నేరుగా ఆ ఉద్యోగిని కలిసి పైసలిస్తేనే ఆ ఫైలుకు మోక్షం కలుగుతోంది.

నా దృష్టికి వచ్చింది : ఆర్డీవో

ఆర్డీవో కార్యాలయంలో భూమార్పిడికి ఓ ఉద్యోగి డబ్బులు అడిగారని తన దృష్టికి వచ్చిందని ఆర్డీవో తెలిపారు, ఇక నుంచి అలా జరగకుండా చూస్తామన్నారు.

కుండపోత వర్షం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : నగరంలో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండగా ఉన్న వాతావరణం మధ్యాహ్నానికి మారిపోయింది. ఆకాశం మేఘాలతో కమ్ముకుంది. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ప్రారంభమైన భారీ వర్షం కారణంగా రహదారులు నీట మునిగా యి. ఉరుములు, పిడుగుల మోతతో నగరం దద్దరిల్లింది. ముత్తు కూరు రోడ్డు, ట్రంకురోడ్డు బాబు జగజ్జీవన్ రాం నగర్, రాయాజీ వీధి ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వర్షంతో జిల్లా వ్యాప్తంగా చల్లని వాతావరణం ఏర్పడింది. ఇటీవ ల ఎండలు మండిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో ప్రజలు ఆనందపడ్డారు. వర్షం కారణంగా చల్లని గాలులు వీచి వాతావరణం మరింత ఆహ్లాదకరంగా మారింది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో వర్షం రాకతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వరి, పత్తి తదితర పంటలు వేసిన వారికి ఈ వర్షం కొంత ఉపయోగకరంగా మారింది. కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నగరపాలక సంస్థ అధికారులు రోడ్లపై నీరు లేకుండా చర్యలు చేపట్టారు. వర్షం తరువాత రహదారులపై పిల్లలు ఆటలతో సందడి చేశారు. మొత్తం మీద ఈ వర్షం వలన ఎండవేడి, ఉక్కపోతతో సతమతమవుతున్న జిల్లా ప్రజలకు ఉపశమనం కలిగింది.

వామ్మో.. జ్వరం!

● ఒళ్లు కాలితే చాలు ఆసుపత్రులకు పరుగు ● డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌తో వణుకు ● స్థానికంగా వైద్యం అందక జిల్లా కేంద్రానికి బాధితులు

ఉదయగిరికి చెందిన ఎనిమిదేళ్ల విక్రాంత్ (8) జ్వరంతో బాధపడుతూ స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించున్నారు. ఎంతకూ జ్వరం తగ్గక పోవటంతో గత నెల 29వ తేదీన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించగా టైఫాయిడ్ అని తేలింది. దీంతో వైద్యుని సూచనల మేరకు ఆ చిన్నారి చికత్స పొందుతుంది.

దుత్తలూరు మండలానికి చెందిన వెంకటసుబ్బయ్య తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్నా జ్వరం లేదు. ఇక లాభం లేదని నెల్లూరులోని ఓ ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ఆయనకు డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. వెంటనే వైద్యచికిత్సలు చేయగా ప్రస్తుతం కోలుకుంటున్నాడు.

కావలి రూరల్ మండలానికి చెందిన సుధాకర్ అనారోగ్యానికి గురయ్యాడు. తీరా పూర్తిస్థాయి పరీక్షలు చేయగా సుధాకర్‌కు మలేరియా సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో వైద్యులు వెంటనే చికిత్సలు చేయగా ప్రస్తుతం కోలుకుంటున్నాడు.



జీజీహెచ్‌లో రక్తపరీక్షల కోసం బాధితుల క్యూ

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం అక్కడక్కడా వర్షాలు కురుస్తుండటం, జ్వరాలకు ఇదే సీజన్ కావటంలో జిల్లాలో బాధితుల సంఖ్య వేలల్లోనే ఉంటోంది. గత ఏడాదితో పోలిస్తే కొంతవరకు జ్వరాలు తగ్గాయని వైద్యులు చెబుతున్నా.. అసలు తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జ్వరపీడితులే రావటం లేదని, కేసులు తక్కువగా ఉన్నాయని పీహెచ్‌సీ వైద్యులు చెబుతున్నా నమోదవుతున్న జ్వరాలపై తగిన సమాధానం లేదు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే వ్యాధిగ్రస్థుల్లో జ్వరాల కేసులే 40 శాతం ఉంటున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా గత వారం రోజుల్లో ఆయా పీహెచ్‌సీల పరిధిలో 100 మందికిపైగా జ్వర బాధితులు ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఇక ఏరియా, జిల్లా ఆసుపత్రులతో పాటు నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజూ వేల మందికిపైగా వివిధ రకాల రోగులు వస్తుండగా వీరిలో జ్వరపీడితులు ఎక్కువగానే ఉన్నారు. ఇక జిల్లాలో 2వేలకుపైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా ఇక్కడకు వచ్చే రోగులలో జ్వరపీడితుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 15 వేలకు మందికిపైగా జ్వరపీడితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ సీజన్‌లో జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నా వైద్య ఆరోగ్య శాఖ తగిన ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపట్టటంలో విఫలమవుతోందన్న విమర్శలు ఉన్నాయి.

● ఆందోళన కలిగిస్తున్న విషజ్వరాలు

జిల్లాలో నమోదయ్యే జ్వరాలలో విషజ్వరాలు నమోదు కావటం ఆందోళన కలిగించే అంశమే. ప్రస్తుతం డెంగ్యూతోపాటు మలేరియా వ్యాధి గ్రస్తులు పలు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. వీటన్నిటి కంటే టైఫాయిడ్ బాధితులు వందల సంఖ్యలో నమోదవుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, రాపూరు, ఆత్మకూరు, అల్లూరు, నెల్లూరు, ఇందుకూరుపేట తదితర మండలాల్లో జ్వర పీడితులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. ఆయా మండలాలలో ప్రత్యేకించి డెంగ్యూ కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. అధికారులు మాత్రం డెంగ్యూ కేసులు తక్కువగా ఉన్నాయని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా ఉంది. ప్రైవేట్ ఆసుపత్రులలో నమోదయ్యే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ కేసుల వివరాలు వైద్యాధికారులు ఎప్పటికప్పుడు సేకరించాల్సి ఉన్నా ఆ దిశగా మాత్రం చర్యలు లేవు.

● మూడు పరీక్షలు తప్పదా..

జ్వరం వచ్చిన వారు తప్పనిసరిగా కరోనా నిర్ధారణ పరీక్ష చేయించుకోవాల్సి వస్తోంది. ఆ తర్వాత టైఫాయిడ్, డెంగ్యూ నిర్ధారణ పరీక్ష చేసుకుంటున్నారు. ఇలా మూడు రకాల పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుండంతో జ్వరపీడితులపై ఆర్థిక భారం ఎక్కువైంది. పీహెచ్‌సీలలో ఇలాంటి అన్ని రకాల పరీక్షలు అందుబాటులో లేక పోవటంతో ఎక్కువ మంది ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లకు పరుగులు తీస్తున్నారు.

● అవగాహన ఏదీ!?

వైద్య ఆరోగ్య శాఖ ప్రజా వైద్యం కోసం రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా వ్యాధులపై మాత్రం అవగాహన కల్పించడంలో వైఫల్యం చెందుతోంది. వ్యాధులపై అవగాహన కల్పించే అధికారులు, సిబ్బంది, గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉన్నా ఫలితం లేకుండా పోతోంది. ప్రత్యేకించి ఈ సీజన్‌లో డిసెంబరు వరకు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో దోమల సంఖ్య కూడా విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

● దోమల నివారణపై దృష్టి ఏదీ!?

దోమల నివారణపై ఇటు పాలకులు, అటు అధికారులు చేతులెత్తేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉండటంతో మురికి కాలువలు, గుంతలు, నీటి నిల్వ కేంద్రాలు దోమల ఉత్పత్తికి నిలయాలుగా మారుతున్నాయి. నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, ఆత్మకూరు, కందుకూరు మున్సిపాలిటీలతో పంచాయతీలు పారిశుధ్యంపై దృష్టి సారించకపోవడంతో పారిశుధ్యం లోపించి రోగాలు ప్రబలుతున్నాయి. వర్షాకాలం ప్రారంభానికి ముందే మురికి నీటి కాలువల నిర్మాణాలు, పరిశుభ్రత చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడంలేదు. ఒక ప్రణాళికా బద్ధంగా వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ చేపట్టాలని ప్రభుత్వం మార్గదర్శకాలు నిర్దేశిస్తున్నా అవి క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోడంలేదు.



విష జ్వరాలు నమోదవుతున్నాయి

వర్షాల కారణంగా జ్వరాలు వస్తున్నాయి. ఎక్కువగా డెంగ్యూ కేసులను గుర్తిస్తున్నాము. సాధారణ జ్వరం అని ఏదో ఒక మందులు వాడి తగ్గిందని నిర్ధారించుకోవద్దు. తప్పని సరిగా వైద్యులను కలిసి చికిత్స చేయించుకోవాలి. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ జరిగి జ్వరపీడితులు పూర్తిగా కోలుకుంటారు.

- డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ వైద్యుడు

తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం

జిల్లాలో విషజ్వరాల నివారణకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. నీటి నిల్వలు లేకుండా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా వైద్యసిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం ఎప్పటి కప్పుడు సమీక్షలు చేపట్టి జ్వరాలు ప్రబలకుండా నివారిస్తున్నాం. జ్వరాలు అదుపులోనే ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించి వైద్యులు చికిత్సలు అందిస్తారు. దీన్ని సద్వినియోగం చుసుకోవాలి.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో



మహిళల దిశ మార్చేలా..

● త్వరలో మరో రెండు పథకాలు

● ఒకటి విద్యా లక్ష్మి, రెండోది ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి

● పావలావడ్డీతో రుణ సౌకర్యం

కోవూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం పలు కొత్త పథకాల్ని ప్రవేశపెట్టి జిల్లాలోని మహిళాలోకానికి ఉపాధి చూపేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. జిల్లాలోని 4,06,145 సంఘబంధాల సభ్యులైన మహిళలకు త్వరలోనే రెండు పథకాల్ని ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. సంఘబంధాల్లోని సభ్యుల కుమార్తెల విద్యకోసం 'ఎన్టీఆర్ విద్యాలక్ష్మి' యువతుల వివాహాలకు ఆర్థికసహాయం అందించేందుకు వీలుగా 'ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి' పథకాన్ని విస్తరించనున్నారు. రెండుపథకాలకు పావలా వడ్డీతో రుణసదుపాయం కల్పించేందుకు వీలుగా బ్యాంకులకు సమాచారం అందించారు. పేదరిక నిర్మూలన సొసైటీ ఆధ్వర్యంలో రెండు పథకాలకు ఆర్థికసహాయం అందించాలని భావిస్తున్నారు. తక్కువ వడ్డీతో రుణసదుపాయం కల్పిస్తున్నందు వల్ల ప్రభుత్వం నుంచి మహిళలకు చేయూత లభించే అవకాశముంది.

● ఆడబిడ్డల చదువుకు...

బాలికల చదువు కోసం పావలా వడ్డీతో రుణసహాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కుటుంబంలో ఇద్దరు బాలికల చదువుకు రూ10,000 నుంచి రూ లక్ష వరకు రుణసదుపాయం కల్పించనున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో చెల్లించే ఫీజులవివరాల్ని సమాఖ్య కార్యాలయాల్లో నమోదుపరచి రుణం పొందే వీలుంది. విద్యార్థినులకు అందించే రుణసదుపాయం ఉన్నత విద్య అభ్యసించే వారికి చాలా మేలు చేకూర్చనుంది.

● పెళ్లి ఖర్చులకు..

పొదుపు సభ్యురాలి కుమార్తె పెళ్లి ఖర్చులకు రుణసదుపాయం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెళ్లి ఖర్చులకు రూ 10,000 నుంచి రూ 1,00,000 వరకు రుణసదుపాయం కల్పించనున్నారు. రుణాన్ని 48వాయిదాల్లో తిరిగి చెల్లించే వెసులుబాటు కల్పించారు. పావలా వడ్డీ నిర్ణయించడంతో సభ్యులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకునే అవకాశముంది. వివాహ విషయాన్ని సూచించే పెండ్లి పత్రిక, ఖర్చుల పట్టీల్ని సంఘ బంధాల్లో నమోదుచేసుకోవాలి. సంబంధిత డ్వాక్రా అధికారి పరిశీలించి సభ్యురాలి ఖాతాలో రుణాన్ని జమచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

● బాధిత మహిళలకు రుణ విముక్తి

కొత్తగా ప్రవేశపెట్టే రెండు పథకాల్లో రుణ సదుపాయం పొందిన మహిళలు ప్రమాదవశాత్తుతో, అనారోగ్యంతో మృతి చెందితే రుణం తిరిగి చెల్లించకుండా చర్యలు తీసుకున్నారు. గతంలో రుణసదుపాయం పొందిన మహిళ మృతి చెందితే కుటుంబ సభ్యులు రుణం మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించాల్సి వచ్చేది. ఈ విషయమై ప్రభుత్వం ఆలోచించి కుటుంబసభ్యులపై ఒత్తిడి లేకుండా నిర్ణయం తీసుకుంది.

10న సీఎం చంద్రబాబు రాక

వెంకటాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి సమీపంలో తాటిపర్తిపాళెం వద్ద నూతనంగా ఏర్పాటైన విశ్వసముద్ర బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి ఈ నెల 10న సీఎం చంద్రబాబు నాయుడు రానున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి హెలీపాడ్, రోడ్లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా అధికారులు మంగళవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం చంద్రబాబు పర్యటన అధికారికంగా బుధవారం ఖరారు కానున్నట్లు సమాచారం.

శిక్షణతో హస్త కళాకారులకు ఉపాధి

● తిరుపతి హస్తకళల అభివృద్ధి కమిషన్ ఏడీ

ఉదయగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నైపుణ్యంతో కూడిన శిక్షణ అందించి, హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయమని తిరుపతి హస్తకళల అభివృద్ధి కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి తెలిపారు. మంగళవారం పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధిలో గల చెక్కనగిషీ కేంద్రంలో హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ, అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ వారు హస్తకళాకారులకు అందించనున్న శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హస్తకళల అభివృద్ధిలో భాగంగా కళాకారులకు శిక్షణ ఇచ్చేందుకు ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రానికి డెవలప్‌మెంట్ కమిషనర్ న్యూఢిల్లీ వారు రూ.14 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. కేంద్రంలో 30 మంది హస్తకళాకారులకు ఐదు నెలలపాటు టెక్నికల్, డిజైన్ డెవలప్‌మెంట్, సాఫ్ట్ స్కిల్స్‌పై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణ సమయంలో కళాకారులకు భృతి అందచేస్తారని తెలిపారు. కళాకారులు తయారు చేసిన వస్తువులు ప్రపంచవ్యాప్తంగా విక్రయించేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ అధికారులు దివాకర్, యేసురాముడు, శ్రీనివాసరావు, చైతన్యజ్యోతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రమణయ్య, మాస్టర్ క్రాఫ్ట్ పర్సన్ షాహిదా, కేంద్రం నిర్వాహకులు జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి హస్తకళల అభివృద్ధి కమిషన్ ఏడీ సత్యనారాయణమూర్తి

సీతారామపురం ఉపాధ్యాయినికి నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు

సీతారామపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీతారామపురం గ్రామ పంచాయతీలోని సంగసానిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని అజుబా పవిత్రకుమారికి నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డును ప్రకటించింది. ఏఐసీఎఫ్ ఫౌండర్ గడ్డపాటి విజయరాజు, తెలంగాణ స్టేట్ మైనార్టీస్ కమిషన్ వైస్‌చైర్మన్ శంకర్ లూక్ చేతుల మీదుగా హైదరాబాదులో మంగళవారం ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.



నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయిని అజుబా పవిత్ర కుమారి

పరిహారం చెల్లింపులో సమస్యలు పరిష్కరిస్తాం

కరేడు రైతులతో కలెక్టరు హిమాన్షు శుక్లా

కందుకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ కంపెనీకి భూములిచ్చిన రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, పరిహారం చెల్లింపులో జాప్యం లేకుండా చూస్తామని జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. మంగళవారం కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయంలో పరిశ్రమలకు భూములిచ్చిన రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. కరేడు పరిధిలో భూములు కలిగి ఉన్న రామకృష్ణాపురం, ఉప్పరపాలెం, ఉలవపాడు, కరేడు గ్రామాలకు సంబంధించిన రైతులతో పాటు చేవూరు, రావూరు గ్రామాలకు సంబంధించిన పలువురు రైతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ భూములు ఇండోసోల్ కంపెనీకి ఇచ్చినప్పటికీ పరిహారం చెల్లింపులో ఎదురవుతున్న సమస్యలను జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టరు శుక్లా మాట్లాడుతూ రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జిల్లా స్థాయి నెగోషియేషన్ కమిటీలో కూడా చర్చించి రైతులకు ఎంతమేరకు నగదు చెల్లించాల్సి ఉందో ఆమేరకు వారి ఖాతాలకు జమచేసేలా ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీ, భూసేకరణ ప్రత్యేక అధికారులు రాజశేఖర్, శివకుమార్, ఉలవపాడు తహసీల్దారు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టరు హిమాన్షు శుక్లా, సబ్ కలెక్టరు హిమవంశీ

బ్రహ్మర్షి వాల్మీకికి కలెక్టర్ నివాళి

బ్రహ్మర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సబ్ కలెక్టరు కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లా, కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీలు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

రామాయణాన్ని అందించిన మహర్షి వాల్మీకి : జేసీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతి, నీతి, ధర్మం, కరుణ వంటి విలువలతో కూడిన రామాయణ మహాకావ్యాన్ని మానవాళికి అందించిన మహర్షి వాల్మీకి అని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి కార్యక్ర మం జరిగింది. వాల్మీకి చిత్రపటానికి అధికారులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభలో జేసీ మాట్లాడుతూ మానవుని జీవన విధానానికి, ధర్మపాలనకు నిలువెత్తు సాక్షాత్కారం రామాయణమని చెప్పారు. సాధారణ మనిషి నుంచి ఒక మహా రుషిగా ఎదిగిన వాల్మీకి జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శమన్నారు. కాగా, నెల్లూరు నగరంలో వాల్మీకి విగ్రహం, వాల్మీకి భవనం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా బీసీ సంఘాల వారు జేసీని కోరారు. నగరంలో బీసీ భవన్ పూర్తి చేసేందుకు కృషి చేస్తామని జేసీ సమాధానమిచ్చారు. బీసీ సంక్షేమాధికారి వెంకట లక్ష్మమ్మ మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్ర మంలో మాజీ జడ్పీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషయ్య ఆచారి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు నల్లబోతుల వెంకటేశ్వర్లు, దేవరాల సుబ్రహ్మణ్యం, బీసీ కోటయ్య, జనార్దన్, కాలేషా, బుదవారపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో నివాళి

నెల్లూరు(క్రైం): రామాయణం స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల పిలుపు నిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, బీసీ సంఘ నాయకులు

నెల్లూరులో న్యాయవాదుల నిరసన

నెల్లూరు (లీగల్), అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది దాడి చేయడాన్ని నిరసిస్తూ ఐలు జిల్లా కమిటీ, ఐక్య వేదిక, వివిధ సంఘాల న్యాయవాదుల ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టు ప్రాంగణంలో మంగళవారం నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఒక న్యాయవాది తన బూటును విసిరి సనాతన ధర్మం వర్ధిల్లాలి అంటూ మాట్లాడిన ఘటనను వారు తీ వ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షుడు ఎస్. అంకయ్య, ప్రధాన కార్యదర్శి చుక్కా రమేష్ , సీనియర్ న్యాయవాదులు కుడుముల రమేష్, బద్దేపూడి రవీంద్ర, స్వర్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● నేడు విధుల బహిష్కరణ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది దాడి చేయడాన్ని నిరసిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసనను తెలియజేయాలని నెల్లూరు బార్ అసోసియేషన్ తీర్మానించింది. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం సమావేశమైన బార్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నదని, అందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పులిమి అయ్యప్పరెడ్డి, నక్కల నాగరాజు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.



దీనావస్థలో వృద్ధురాలు సుబ్బమ్మ

మా ఇంటికి చేర్చండయ్యా!

● రోడ్డుపై వృద్ధురాలి వేదన ● చలించిన డిప్యూటీ తహసీల్దార్

● చేయూతనందించిన రెవెన్యూ సిబ్బంది

కట్టుకున్నోడు పోయాడు. కడుపున పుట్టిన బిడ్డ చనిపోయాడు. నా.. అన్న వాళ్లే రోడ్డుపై వదిలి వెళ్లిపోయారు. ఏడు పదులు దాటిన ఓ వృద్ధురాలు కాలువిరిగి నడవలేక, రోడ్డుపై పాక్కుంటూ రెండురోజులుగా మనుబోలులో ప్రభుత్వ కార్యాలయాల వద్ద దైన్యంగా కాలం గడుపుతోంది. కనిపించిన వారినల్లా పదో, పరకో అడుక్కుంటూ తనను ఇంటికి పంపాలంటూ కాళ్లావేళ్లా పడుతోంది. మంగళవారం ఆమె దీనగాథ విన్న డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ చలించిపోయారు. రెవెన్యూ సిబ్బందిని పంపి రోడ్డుపై ఉన్న వృద్ధురాలిని సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో సిబ్బంది ఆమెను సమీపంలోని బస్‌షెల్టర్‌కు తీసుకెళ్లారు. తన పేరు సుబ్బమ్మ అని, కలువాయి సొంతూరని చెప్పింది. భర్త కొండయ్య. కుమారుడు 25 ఏళ్ల క్రితమే చనిపోయాడు. ఇద్దరు కుమార్తెలు. తనను ఎవరూ పట్టించుకోలేదని, తన మనవడు సుబ్బయ్య ఆటోలో ఇక్కడికి తీసుకువచ్చి వదిలి వెళ్ళాడని రోదిస్తోంది. కలువాయిలో కరెంటు ఆఫీసు వద్ద తనకు ఇల్లు ఉందని, తనను అక్కడకు చేర్చాలని వేడుకుంటోంది. దీంతో డీటీ ప్రదీప్ కలువాయి తహసీల్దారుకు సమాచారం ఇచ్చారు. స్థానికులు వృద్ధురాలికి ఆహారం, దుస్తులు అందించారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)



సుబ్బమ్మను బస్సు షెల్టర్‌కు మోసుకెళుతున్న రెవెన్యూ సిబ్బంది

19న ఎల్‌ఐసీ ఏజెంట్ల మహాసభలు

కందుకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఎల్‌ఐసీఏఓఐ) నెల్లూరు డివిజన్ 6వ మహాసభలు ఈనెల 19న కందుకూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెజవాడ శివయ్య, సీహెచ్ నరసింహారావులు తెలిపారు. మంగళవారం స్థానిక బ్రాంచి కార్యాలయంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థను రక్షించుకోటానికి, ఏజెంట్ల హక్కుల సాధనకు, రాబోయే కాలంలో నిర్వహించబోయే పోరాటాలకు రూపకల్పన చేయటం కోసం ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు షబ్బీర్, విష్ణువర్ధన్‌రెడ్డి, బి. మధుబాబు, పిచ్చయ్య, మాల్యాద్రి, రాజేశ్వరాచారి, సి. మాలకొండయ్య, బి. వెంకట్రావు, కె. వెంకటేశ్వర్లు, ఆర్. హజరత్‌రెడ్డి, యం. నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూలో పైసలిస్తేనే ఫైళ్ల కదలిక

● ప్రతి దస్త్రానికి రేటు పెట్టి.. డిమాండ్ చేసి వసూళ్లు

కావలి,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి) కావలి డివిజన్‌లో తహసీల్దార్‌కార్యాలయాలతోపాటు ఆర్డీవో కార్యాలయంలో కూడా పైసలిస్తేనే ఫైళ్ల కదలడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు తెచ్చినా భూసమస్యలు ఎప్పటికప్పుడు పుట్టుకొస్తుంటాయి. ఆ సమస్యలు పరిష్కరించుకోవాలంటే సచివాలయాలు, మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో అప్లయిచేసుకోవాలి. అనంతరం ఆయా కార్యాలయాలో ఆ ఫైళ్లు కదలాలంటే సంబంధిత సిబ్బందిని కలిసి పైసలు ముట్ట చెప్పుకోవాల్సిందే. లేదంటే ఏదో ఒక సమస్య చూపి వాటిని రిజక్ట్ చేస్తుంటారు. తహసీల్దార్ కార్యాలయాల్లో పైసలిచ్చి ఫైళ్లు కదిలించినా ఆర్డీవో కార్యాలయానికి వచ్చేసరికి ఇక్కడ కూడా పైసలివ్వనిదే ఫైలు కదలటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

● బరితెగించి వసూళ్లు

ఆర్డీవో కార్యాలయంలో ఉన్న ఒక ఉద్యోగి మరీ బరితెగించి వసూలు చేస్తుండటంతో ఆయనపై ఇటీవల కొందరు ఎమ్మెల్యేకు చెప్పినట్లు తెలిసింది. వెంటనే ఎమ్మెల్యే ఆర్డీవోకు ఫోన్‌చేసి ఎవరా ఉద్యోగి ఏమిటీ ఆరోపణలు అని అడగ్గా, ఇక నుంచి అలా జరగకుండా చూసుకుంటామని ఆర్డీవో చెప్పినట్లు తెలిసింది. ఎక్కువగా భూమార్పిడిలలో తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయం మరీ పోటీ పడి వసూళ్లు వసూళ్ల ఆరోపణలు వస్తున్నాయి. అయితే ప్రస్తుతం భూమార్పిడిని ప్రభుత్వం నిలుపుదల చేయటంతో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల వారు తమ రాబడి పోయిందే అని బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

● ప్రతీచోటా వసూల్ రాజాలు

ప్రతీ కార్యాలయంలో కలెక్షన్‌ల కోసం ఆరితేరిన ఒక ఉద్యోగిని ఆ కార్యాలయ అధికారులు ఎంపిక చేసుకుని ఉంచుకుంటారు. ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలకు సంబంధించి మీడియేటర్లు అయినా, అసలు బాధితులైనా నేరుగా ఆ ఉద్యోగిని కలిసి పైసలిస్తేనే ఆ ఫైలుకు మోక్షం కలుగుతోంది.

నా దృష్టికి వచ్చింది : ఆర్డీవో

ఆర్డీవో కార్యాలయంలో భూమార్పిడికి ఓ ఉద్యోగి డబ్బులు అడిగారని తన దృష్టికి వచ్చిందని ఆర్డీవో తెలిపారు, ఇక నుంచి అలా జరగకుండా చూస్తామన్నారు.

వామ్మో.. జ్వరం!

● ఒళ్లు కాలితే చాలు ఆసుపత్రులకు పరుగు ● డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌తో వణుకు ● స్థానికంగా వైద్యం అందక జిల్లా కేంద్రానికి బాధితులు

ఉదయగిరికి చెందిన ఎనిమిదేళ్ల విక్రాంత్ (8) జ్వరంతో బాధపడుతూ స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించుకున్నారు. ఎంతకూ జ్వరం తగ్గక పోవటంతో గత నెల 29వ తేదీన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించగా టైఫాయిడ్ అని తేలింది. దీంతో వైద్యుని సూచనల మేరకు ఆ చిన్నారి చికత్స పొందుతుంది.

దుత్తలూరు మండలానికి చెందిన వెంకటసుబ్బయ్య తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్నా జ్వరం లేదు. ఇక లాభం లేదని నెల్లూరులోని ఓ ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ఆయనకు డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. వెంటనే వైద్యచికిత్సలు చేయగా ప్రస్తుతం కోలుకుంటున్నాడు.

కావలి రూరల్ మండలానికి చెందిన సుధాకర్ అనారోగ్యానికి గురయ్యాడు. తీరా పూర్తిస్థాయి పరీక్షలు చేయగా సుధాకర్‌కు మలేరియా సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో వైద్యులు వెంటనే చికిత్సలు చేయగా ప్రస్తుతం కోలుకుంటున్నాడు.



జీజీహెచ్‌లో రక్తపరీక్షల కోసం బాధితుల క్యూ

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం అక్కడక్కడా వర్షాలు కురుస్తుండటం, జ్వరాలకు ఇదే సీజన్ కావటంలో జిల్లాలో బాధితుల సంఖ్య వేలల్లోనే ఉంటోంది. గత ఏడాదితో పోలిస్తే కొంతవరకు జ్వరాలు తగ్గాయని వైద్యులు చెబుతున్నా.. అసలు తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జ్వరపీడితులే రావటం లేదని, కేసులు తక్కువగా ఉన్నాయని పీహెచ్‌సీ వైద్యులు చెబుతున్నా నమోదవుతున్న జ్వరాలపై తగిన సమాధానం లేదు.

ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే వ్యాధిగ్రస్థుల్లో జ్వరాల కేసులే 40 శాతం ఉంటున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా గత వారం రోజుల్లో ఆయా పీహెచ్‌సీల పరిధిలో 100 మందికిపైగా జ్వర బాధితులు ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఇక ఏరియా, జిల్లా ఆసుపత్రులతో పాటు నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రోజూ వేల మందికిపైగా వివిధ రకాల రోగులు వస్తుండగా వీరిలో జ్వరపీడితులు ఎక్కువగానే ఉన్నారు. ఇక జిల్లాలో 2వేలకుపైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉండగా ఇక్కడకు వచ్చే రోగులలో జ్వరపీడితుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 15 వేలకు మందికిపైగా జ్వరపీడితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ సీజన్‌లో జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నా వైద్య ఆరోగ్య శాఖ తగిన ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపట్టటంలో విఫలమవుతోందన్న విమర్శలు ఉన్నాయి.

● ఆందోళన కలిగిస్తున్న విషజ్వరాలు

జిల్లాలో నమోదయ్యే జ్వరాలలో విషజ్వరాలు నమోదు కావటం ఆందోళన కలిగించే అంశమే. ప్రస్తుతం డెంగ్యూతోపాటు మలేరియా వ్యాధి గ్రస్తులు పలు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. వీటన్నిటి కంటే టైఫాయిడ్ బాధితులు వందల సంఖ్యలో నమోదవుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, రాపూరు, ఆత్మకూరు, అల్లూరు, నెల్లూరు, ఇందుకూరుపేట తదితర మండలాల్లో జ్వర పీడితులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. ఆయా మండలాలలో ప్రత్యేకించి డెంగ్యూ కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. అధికారులు మాత్రం డెంగ్యూ కేసులు తక్కువగా ఉన్నాయని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా ఉంది. ప్రైవేట్ ఆసుపత్రులలో నమోదయ్యే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ కేసుల వివరాలు వైద్యాధికారులు ఎప్పటికప్పుడు సేకరించాల్సి ఉన్నా ఆ దిశగా మాత్రం చర్యలు లేవు.

● మూడు పరీక్షలు తప్పదా..

జ్వరం వచ్చిన వారు తప్పనిసరిగా కరోనా నిర్ధారణ పరీక్ష చేయించుకోవాల్సి వస్తోంది. ఆ తర్వాత టైఫాయిడ్, డెంగ్యూ నిర్ధారణ పరీక్ష చేసుకుంటున్నారు. ఇలా మూడు రకాల పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుండంతో జ్వరపీడితులపై ఆర్థిక భారం ఎక్కువైంది. పీహెచ్‌సీలలో ఇలాంటి అన్ని రకాల పరీక్షలు అందుబాటులో లేక పోవటంతో ఎక్కువ మంది ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లకు పరుగులు తీస్తున్నారు.

● అవగాహన ఏదీ!?

వైద్య ఆరోగ్య శాఖ ప్రజా వైద్యం కోసం రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా వ్యాధులపై మాత్రం అవగాహన కల్పించడంలో వైఫల్యం చెందుతోంది. వ్యాధులపై అవగాహన కల్పించే అధికారులు, సిబ్బంది, గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉన్నా ఫలితం లేకుండా పోతోంది. ప్రత్యేకించి ఈ సీజన్‌లో డిసెంబరు వరకు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో దోమల సంఖ్య కూడా విపరీతంగా పెరిగే అవకాశం ఉంది. దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

● దోమల నివారణపై దృష్టి ఏదీ!?

దోమల నివారణపై ఇటు పాలకులు, అటు అధికారులు చేతులెత్తేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉండటంతో మురికి కాలువలు, గుంతలు, నీటి నిల్వ కేంద్రాలు దోమల ఉత్పత్తికి నిలయాలుగా మారుతున్నాయి. నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, ఆత్మకూరు, కందుకూరు మున్సిపాలిటీలతో పంచాయతీలు పారిశుధ్యంపై దృష్టి సారించకపోవడంతో పారిశుధ్యం లోపించి రోగాలు ప్రబలుతున్నాయి. వర్షాకాలం ప్రారంభానికి ముందే మురికి నీటి కాలువల నిర్మాణాలు, పరిశుభ్రత చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడంలేదు. ఒక ప్రణాళికా బద్ధంగా వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ చేపట్టాలని ప్రభుత్వం మార్గదర్శకాలు నిర్దేశిస్తున్నా అవి క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోడంలేదు.



విష జ్వరాలు నమోదవుతున్నాయి

వర్షాల కారణంగా జ్వరాలు వస్తున్నాయి. ఎక్కువగా డెంగ్యూ కేసులను గుర్తిస్తున్నాము. సాధారణ జ్వరం అని ఏదో ఒక మందులు వాడి తగ్గిందని నిర్ధారించుకోవద్దు. తప్పని సరిగా వైద్యులను కలిసి చికిత్స చేయించుకోవాలి. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ జరిగి జ్వరపీడితులు పూర్తిగా కోలుకుంటారు.

- డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ వైద్యుడు

తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం

జిల్లాలో విషజ్వరాల నివారణకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. నీటి నిల్వలు లేకుండా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా వైద్యసిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం ఎప్పటి కప్పుడు సమీక్షలు చేపట్టి జ్వరాలు ప్రబలకుండా నివారిస్తున్నాం. జ్వరాలు అదుపులోనే ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించి వైద్యులు చికిత్సలు అందిస్తారు. దీన్ని సద్వినియోగం చుసుకోవాలి.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో



మహిళల దిశ మార్చేలా..

● త్వరలో మరో రెండు పథకాలు

● ఒకటి విద్యా లక్ష్మి, రెండోది ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి

● పావలావడ్డీతో రుణ సౌకర్యం

కోవూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం పలు కొత్త పథకాల్ని ప్రవేశపెట్టి జిల్లాలోని మహిళాలోకానికి ఉపాధి చూపేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. జిల్లాలోని 4,06,145 సంఘబంధాల సభ్యులైన మహిళలకు త్వరలోనే రెండు పథకాల్ని ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. సంఘబంధాల్లోని సభ్యుల కుమార్తెల విద్యకోసం 'ఎన్టీఆర్ విద్యాలక్ష్మి' యువతుల వివాహాలకు ఆర్థికసహాయం అందించేందుకు వీలుగా 'ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి' పథకాన్ని విస్తరించనున్నారు. రెండుపథకాలకు పావలా వడ్డీతో రుణసదుపాయం కల్పించేందుకు వీలుగా బ్యాంకులకు సమాచారం అందించారు. పేదరిక నిర్మూలన సొసైటీ ఆధ్వర్యంలో రెండు పథకాలకు ఆర్థికసహాయం అందించాలని భావిస్తున్నారు. తక్కువ వడ్డీతో రుణసదుపాయం కల్పిస్తున్నందు వల్ల ప్రభుత్వం నుంచి మహిళలకు చేయూత లభించే అవకాశముంది.

● ఆడబిడ్డల చదువుకు...

బాలికల చదువు కోసం పావలా వడ్డీతో రుణసహాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కుటుంబంలో ఇద్దరు బాలికల చదువుకు రూ10,000 నుంచి రూ లక్ష వరకు రుణసదుపాయం కల్పించనున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో చెల్లించే ఫీజులవివరాల్ని సమాఖ్య కార్యాలయాల్లో నమోదుపరచి రుణం పొందే వీలుంది. విద్యార్థినులకు అందించే రుణసదుపాయం ఉన్నత విద్య అభ్యసించే వారికి చాలా మేలు చేకూర్చనుంది.

● పెళ్లి ఖర్చులకు..

పొదుపు సభ్యురాలి కుమార్తె పెళ్లి ఖర్చులకు రుణసదుపాయం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెళ్లి ఖర్చులకు రూ 10,000 నుంచి రూ 1,00,000 వరకు రుణసదుపాయం కల్పించనున్నారు. రుణాన్ని 48వాయిదాల్లో తిరిగి చెల్లించే వెసులుబాటు కల్పించారు. పావలా వడ్డీ నిర్ణయించడంతో సభ్యులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకునే అవకాశముంది. వివాహ విషయాన్ని సూచించే పెండ్లి పత్రిక, ఖర్చుల పట్టీల్ని సంఘ బంధాల్లో నమోదుచేసుకోవాలి. సంబంధిత డ్వాక్రా అధికారి పరిశీలించి సభ్యురాలి ఖాతాలో రుణాన్ని జమచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

● బాధిత మహిళలకు రుణ విముక్తి

కొత్తగా ప్రవేశపెట్టే రెండు పథకాల్లో రుణ సదుపాయం పొందిన మహిళలు ప్రమాదవశాత్తుతో, అనారోగ్యంతో మృతి చెందితే రుణం తిరిగి చెల్లించకుండా చర్యలు తీసుకున్నారు. గతంలో రుణసదుపాయం పొందిన మహిళ మృతి చెందితే కుటుంబ సభ్యులు రుణం మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించాల్సి వచ్చేది. ఈ విషయమై ప్రభుత్వం ఆలోచించి కుటుంబసభ్యులపై ఒత్తిడి లేకుండా నిర్ణయం తీసుకుంది.

10న సీఎం చంద్రబాబు రాక

వెంకటాచలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి సమీపంలో తాటిపర్తిపాళెం వద్ద నూతనంగా ఏర్పాటైన విశ్వసముద్ర బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి ఈ నెల 10న సీఎం చంద్రబాబు నాయుడు రానున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి హెలీపాడ్, రోడ్లను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా అధికారులు మంగళవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం చంద్రబాబు పర్యటన అధికారికంగా బుధవారం ఖరారు కానున్నట్లు సమాచారం.

కుండపోత వర్షం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : నగరంలో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండగా ఉన్న వాతావరణం మధ్యాహ్నానికి మారిపోయింది. ఆకాశం మేఘాలతో కమ్ముకుంది. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ప్రారంభమైన భారీ వర్షం కారణంగా రహదారులు నీట మునిగా యి. ఉరుములు, పిడుగుల మోతతో నగరం దద్దరిల్లింది. ముత్తు కూరు రోడ్డు, ట్రంకురోడ్డు బాబు జగజ్జీవన్ రాం నగర్, రాయాజీ వీధి ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వర్షంతో జిల్లా వ్యాప్తంగా చల్లని వాతావరణం ఏర్పడింది. ఇటీవ ల ఎండలు మండిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో ప్రజలు ఆనందపడ్డారు. వర్షం కారణంగా చల్లని గాలులు వీచి వాతావరణం మరింత ఆహ్లాదకరంగా మారింది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో వర్షం రాకతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వరి, పత్తి తదితర పంటలు వేసిన వారికి ఈ వర్షం కొంత ఉపయోగకరంగా మారింది. కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నగరపాలక సంస్థ అధికారులు రోడ్లపై నీరు లేకుండా చర్యలు చేపట్టారు. వర్షం తరువాత రహదారులపై పిల్లలు ఆటలతో సందడి చేశారు. మొత్తం మీద ఈ వర్షం వలన ఎండవేడి, ఉక్కపోతతో సతమతమవుతున్న జిల్లా ప్రజలకు ఉపశమనం కలిగింది.

శిక్షణతో హస్త కళాకారులకు ఉపాధి

● తిరుపతి హస్తకళల అభివృద్ధి కమిషన్ ఏడీ

ఉదయగిరి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నైపుణ్యంతో కూడిన శిక్షణ అందించి, హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయమని తిరుపతి హస్తకళల అభివృద్ధి కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి తెలిపారు. మంగళవారం పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధిలో గల చెక్కనగిషీ కేంద్రంలో హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ, అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ వారు హస్తకళాకారులకు అందించనున్న శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హస్తకళల అభివృద్ధిలో భాగంగా కళాకారులకు శిక్షణ ఇచ్చేందుకు ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రానికి డెవలప్‌మెంట్ కమిషనర్ న్యూఢిల్లీ వారు రూ.14 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. కేంద్రంలో 30 మంది హస్తకళాకారులకు ఐదు నెలలపాటు టెక్నికల్, డిజైన్ డెవలప్‌మెంట్, సాఫ్ట్ స్కిల్స్‌పై మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణ సమయంలో కళాకారులకు భృతి అందచేస్తారని తెలిపారు. కళాకారులు తయారు చేసిన వస్తువులు ప్రపంచవ్యాప్తంగా విక్రయించేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ అధికారులు దివాకర్, యేసురాముడు, శ్రీనివాసరావు, చైతన్యజ్యోతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రమణయ్య, మాస్టర్ క్రాఫ్ట్ పర్సన్ షాహిదా, కేంద్రం నిర్వాహకులు జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి హస్తకళల అభివృద్ధి కమిషన్ ఏడీ సత్యనారాయణమూర్తి

సీతారామపురం ఉపాధ్యాయినికి నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు

సీతారామపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీతారామపురం గ్రామ పంచాయతీలోని సంగసానిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని అజుబా పవిత్రకుమారికి నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డును ప్రకటించింది. ఏఐసీఎఫ్ ఫౌండర్ గడ్డపాటి విజయరాజు, తెలంగాణ స్టేట్ మైనార్టీస్ కమిషన్ వైస్‌చైర్మన్ శంకర్ లూక్ చేతుల మీదుగా హైదరాబాదులో మంగళవారం ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.



నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయిని అజుబా పవిత్ర కుమారి

పరిహారం చెల్లింపులో సమస్యలు పరిష్కరిస్తాం

కరేడు రైతులతో కలెక్టరు హిమాన్షు శుక్లా

కందుకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ కంపెనీకి భూములిచ్చిన రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, పరిహారం చెల్లింపులో జాప్యం లేకుండా చూస్తామని జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. మంగళవారం కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయంలో పరిశ్రమలకు భూములిచ్చిన రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. కరేడు పరిధిలో భూములు కలిగి ఉన్న రామకృష్ణాపురం, ఉప్పరపాలెం, ఉలవపాడు, కరేడు గ్రామాలకు సంబంధించిన రైతులతో పాటు చేవూరు, రావూరు గ్రామాలకు సంబంధించిన పలువురు రైతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ భూములు ఇండోసోల్ కంపెనీకి ఇచ్చినప్పటికీ పరిహారం చెల్లింపులో ఎదురవుతున్న సమస్యలను జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టరు శుక్లా మాట్లాడుతూ రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జిల్లా స్థాయి నెగోషియేషన్ కమిటీలో కూడా చర్చించి రైతులకు ఎంతమేరకు నగదు చెల్లించాల్సి ఉందో ఆమేరకు వారి ఖాతాలకు జమచేసేలా ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీ, భూసేకరణ ప్రత్యేక అధికారులు రాజశేఖర్, శివకుమార్, ఉలవపాడు తహసీల్దారు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టరు హిమాన్షు శుక్లా, సబ్ కలెక్టరు హిమవంశీ

బ్రహ్మర్షి వాల్మీకికి కలెక్టర్ నివాళి

బ్రహ్మర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సబ్ కలెక్టరు కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లా, కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీలు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

రామాయణాన్ని అందించిన మహర్షి వాల్మీకి : జేసీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతి, నీతి, ధర్మం, కరుణ వంటి విలువలతో కూడిన రామాయణ మహాకావ్యాన్ని మానవాళికి అందించిన మహర్షి వాల్మీకి అని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి కార్యక్ర మం జరిగింది. వాల్మీకి చిత్రపటానికి అధికారులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సభలో జేసీ మాట్లాడుతూ మానవుని జీవన విధానానికి, ధర్మపాలనకు నిలువెత్తు సాక్షాత్కారం రామయణమని చెప్పారు. సాధారణ మనిషి నుంచి ఒక మహా రుషిగా ఎదిగిన వాల్మీకి జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శమన్నారు. కాగా, నెల్లూరు నగరంలో వాల్మీకి విగ్రహం, వాల్మీకి భవనం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా బీసీ సంఘాల వారు జేసీని కోరారు. నగరంలో బీసీ భవన్ పూర్తి చేసేందుకు కృషి చేస్తామని జేసీ సమాధానమిచ్చారు. బీసీ సంక్షేమాధికారి వెంకట లక్ష్మమ్మ మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్ర మంలో మాజీ జడ్పీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషయ్య ఆచారి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు నల్లబోతుల వెంకటేశ్వర్లు, దేవరాల సుబ్రహ్మణ్యం, బీసీ కోటయ్య, జనార్దన్, కాలేషా, బుధవారపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయంలో నివాళి

నెల్లూరు(క్రైం): రామాయణం స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల పిలుపు నిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, బీసీ సంఘ నాయకులు

నెల్లూరులో న్యాయవాదుల నిరసన

నెల్లూరు (లీగల్), అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది దాడి చేయడాన్ని నిరసిస్తూ ఐలు జిల్లా కమిటీ, ఐక్య వేదిక, వివిధ సంఘాల న్యాయవాదుల ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టు ప్రాంగణంలో మంగళవారం నిరసన తెలిపారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఒక న్యాయవాది తన బూటును విసిరి సనాతన ధర్మం వర్ధిల్లాలి అంటూ మాట్లాడిన ఘటనను వారు తీ వ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షుడు ఎస్. అంకయ్య, ప్రధాన కార్యదర్శి చుక్కా రమేష్ , సీనియర్ న్యాయవాదులు కుడుముల రమేష్, బద్దేపూడి రవీంద్ర, స్వర్ణా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● నేడు విధుల బహిష్కరణ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది దాడి చేయడాన్ని నిరసిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసనను తెలియజేయాలని నెల్లూరు బార్ అసోసియేషన్ తీర్మానించింది. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం సమావేశమైన బార్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకున్నదని, అందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పులిమి అయ్యప్పరెడ్డి, నక్కల నాగరాజు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.